రైతులోకం

సంపుటి : 48 ❀ సంచిక : 2 ❀ విజయవాడ ❀ అక్టోబర్ 2016 ❀ వెల : రూ. 15/-





అఖిల భారత కిసాన్ సభ డిమాండ్స్ డే సందర్భంగా రైతుసంఘం జెండా ఆవిష్కరిస్తున్న జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, రాష్ట్ర అధ్యక్షులు పి. రామచంద్రయ్య



తహశీల్దార్ కార్యాలయం ముట్టడిలో ప్రసంగిస్తున్న సంఘ ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్



అఖిల భారత కిసాన్‌సభ జాతీయ సమితి సమావేశంలో ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజన్



సంపాదకీయం

రాష్ట్ర ప్రజలను నిరాశపర్చిన అపెక్స్ కౌన్సిల్ సమావేశం

తెలంగాణ ప్రభుత్వ వాదనలను సమర్థవంతంగా తిప్పికొట్టడంలో ప్రభుత్వ వైఫల్యం

రాష్ట్ర విభజన నేపథ్యంలో నదీజలాల పంపిణీ సమస్య అత్యంత వివాదాస్పదంగాను, జటిలంగాను మారింది. కృష్ణా, గోదావరి నదులపైన అనేక సమస్యలకు, గొడవలకు దారితీసింది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులవద్ద నీటి విడుదల సందర్భంగా ఆరోపణలు, ప్రత్యారోపణలు, ఘర్షణలు చివరకు ఇరుప్రభుత్వ యంత్రాంగం మధ్య తగాదాలు ఏకంగా పోలీసులే కొట్లాటకు దిగటం జరిగింది. దీంతో ఇరు ప్రాంతాల మధ్య తీవ్రమైన ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.

కృష్ణానదిలో ప్రవహిస్తున్న నీటిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టి.ఎం.సి.లలో ఆంధ్రప్రదేశ్‌కు 512, తెలంగాణాకు 299 టిఎంసిలు పంపిణీ చేయడం జరిగింది. గోదావరిలో మన ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన 1490 టిఎంసిలలో ఆంధ్ర, తెలంగాణాల మధ్య పంపిణీ జరగలేదు. నిబంధనలను అతిక్రమించి తెలంగాణ ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను ప్రారంభించింది. కృష్ణానదీ పరివాహక ప్రాంతంలోను రీడిజైనింగ్ పేరుతో గోదావరి నదిపైన అనేక అక్రమ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. తత్ఫలితంగా దిగువనున్న ఆంధ్రప్రదేశ్‌కు పలు ఇబ్బందులు ఎదురైనాయి. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ ఉద్రిక్త వాతావరణాన్ని తగ్గించి సుహృద్భావ వాతావరణాన్ని నెలకొల్పుతారని ఈనెల 21న ఢిల్లీలో జరిగిన అపెక్స్ సమావేశం ఫలితంకోసం ప్రజలు ఎదురుచూశారు. తీరా సమావేశ ఫలితాలు నిరాశా నిస్పృహలకు గురిచేశాయి.

వివాదాస్పదమైన 5 అంశాలలో కేవలం 3 అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరింది.

1. టెలిమెట్రిక్ విధానం ద్వారా నీటి వాడకం లెక్కించడం.
2. నదీజలాల లభ్యత, పంపిణీపై అధ్యయనానికి సంయుక్త కమిటీని ఏర్పాటు చేసుకోవడం.
3. రాష్ట్రాల మధ్య నీటి పంపిణీకి తాత్కాలిక విధానానికి అంగీకారం (ప్రస్తుతం అమలులో వున్న విధానం). మిగిలిన రెండు అంశాలు అత్యంత వివాదాస్పదంగాను, జటిలంగాను మారాయి. తెలంగాణాకు కేటాయించిన 299 టిఎంసీల్లో ఇప్పటికే 298 టిఎంసిల నీటిని తెలంగాణా ప్రభుత్వం వాడుకుంటోంది. మిగిలినది ఒక టిఎంసి నీరయితే ఏకంగా 120 టిఎంసిల నీరు అదనంగా వాడుకునే పాలమూరు-రంగారెడ్డి, దిండి ప్రాజెక్టులకు టెండర్లు పిలిచి పని ప్రారంభించడం జరిగింది. దీనివల్ల దిగువనవున్న ఆంధ్రప్రదేశ్‌లో మన వాటా తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. అదేమంటే కేసీఆర్ వితండవాదం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్. రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నప్పడే ఆమోదం లభించిందని వాదన చేశారు. ఆనాడు ఫీజుబులిటీకోసం పరిశీలించమని జి.ఓ.లు జారీచేస్తే వాటిని ఆమోదించిన జీ.ఓ.లుగా కేసీఆర్ వక్రీకరిస్తున్నారు. అలాగే కల్వకుర్తి 25 టిఎంసిల సామర్థ్యంతో డిజైన్ చేయగా ఏకంగా 40 టిఎంసిల సామర్థ్యానికి పెంచారు. బచావత్, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ సూచనల ప్రకారం మిగులు జలాల ఆధారంగా ఉభయ ప్రాంతాల్లో గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ, వెలుగొండ, కల్వకుర్తి, నెట్టంపాడు, ఎస్‌ఎల్‌బిసీలకు 220 టిఎంసీల నీరు అవసరమని నిర్ధారించారు. ఈనాడు కేసీఆర్ లేవనెత్తిన పాలమూరు, రంగారెడ్డి, దిండి ప్రాజెక్టుల ప్రస్థావనే లేదు. అలాగే గోదావరి నదిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 1490 టిఎంసీలలో తెలంగాణకు 950 టిఎంసీలు వస్తాయని కేసీఆర్ వితండవాదం లేవనెత్తుతున్నారు. ఈ 950 టిఎంసిలు వాడుకోవడం కోసం రీడిజైనింగ్ పేరుతో అనేక ప్రాజెక్టుల నిర్మాణం చేయుటకు చర్యలు చేపట్టారు. దుమ్ముగూడెం, నాగార్జునసాగర్ టేల్‌పాండ్‌కు 190 టిఎంసిలకుగాను 35 టిఎంసిలకు కుదించి ఆంధ్రప్రదేశ్‌కు తీవ్రనష్టం కలిగించారు. ఇంత దుర్మార్గంగా కేసీఆర్ అపెక్స్ కౌన్సిల్ ముందు బలంగా తన వాదనలను నెగ్గించుకునే విధంగా మాట్లాడుతుంటే మన సి.ఎం. చంద్రబాబు గుడ్లప్పగించి చూస్తున్నాడే తప్ప దాన్ని తిప్పికొట్టడానికి బలమైన వాదనలు వినిపించడంలో విఫలమైనారు. అనుమతులు లేకుండా ఇన్ని ప్రాజెక్టులు తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్నా కేంద్ర ప్రభుత్వం వద్ద తన వాదనలు సమర్థంగా వినిపించలేకపోయారు. కనీసం అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి ముందుగా అన్ని రాజకీయ పార్టీలు రైతు సంఘాలతో సమావేశం ఏర్పాటుచేసి వారి అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఉంటే మన రాష్ట్ర ప్రభుత్వ వాదనకు బలం చేకూరేది. ఇప్పటికైనా అలాంటి ప్రయత్నం చేస్తే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుంది.

కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా నీటిపారుదల శాఖామంత్రి ఉమాభారతి అధ్యక్షత వహించి ఉచిత సలహాలు ఇచ్చారే తప్ప సమస్య పరిష్కారానికి నిర్దిష్ట సూచనలు చేయలేకపోయారు. మీలో మీరే చర్చించుకుని ఒక పరిష్కారానికి రమ్మని అయాచిత సలహా ఇచ్చారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకొని అఖిలపక్ష సమావేశాలకు అన్ని రైతు సంఘాలను, నీటిరంగ నిపుణులను ఆహ్వానించి అభిప్రాయాలను తెలుసుకోవటం మంచిది. ఉభయ ప్రాంతాలలో కూడా ఉద్రిక్తతలను తగ్గించుకొని తమ మధ్య వున్న అభిప్రాయ భేదాలను పోగొట్టుకొని ఉమ్మడి శత్రువైన కర్నాటక, మహారాష్ట్రల కుతంత్రాలను తిప్పికొట్టాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.

రావుల వెంకయ్య
ప్రధాన సంపాదకులు

రైతులోకం

అక్టోబర్ 2016
సంపుటి - 48 **సంచిక - 2**
వెల రూ. 15/-
పేజీలు : 44

చిరునామా :
రైతులోకం, రైతు భవన్, 210, అమృత ఎస్టేట్స్
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500 029
Mail : ryotulokam@gmail.com

విషయ క్రమం ...

ఎడిటర్ పేరుతో రచనలు,
కన్వీనర్, రైతులోకం పేరుతో చెక్కులు, డి.డి.లు పంపాలి.

పంటలకు శత్రువులు



సైన్స్ చక్రవర్తి

సి.వి. సర్వేశ్వరశర్మ
అమలాపురం - 533201.

పంటలకు శత్రువులు రకరకాలు. మానవజాతి మాదిరిగానే జంతుకోటి, వృక్షజాతికి కూడా చీడపీడల సమస్య ఎదురవుతుంది. విచిత్రం ఏమిటంటే ప్రతి జీవరాశికి తనను తాను రక్షించుకునే శక్తి ప్రకృతి ప్రసాదించింది.

ఈ కారణంగానే ఎన్నో శత్రు ప్రమాదాలను తట్టుకుని వృక్ష జాతులు పురాతన కాలంనుండి జీవించగల్గుతున్నాయి. మనిషి మొక్కలనుండి వచ్చే సహజ ఉత్పత్తులకు మించి రాబట్టాలనే ప్రయత్నంలో వాటి జీవన విధానంలో కలుగజేసుకోవడం ప్రారంభించిన నాటినుండి అవి తమను తాము రక్షించుకునే శక్తిని క్రమంగా కోల్పోవడం మొదలయింది.



మొక్కలు లేదా పంటలు మనకు అనుకూలమైన కాలంలో పండాలి, కావలసినంత దిగుబడిని ఇవ్వాలి, మనకు నచ్చిన నాణ్యతలో వుండాలి. ఆపైన మనం కేటాయించిన స్థలాన్ని మాత్రమే ఆక్రమించాలి. ఇటువంటి కోరికల నడుమ మొక్కలు, పంటలు వంటివి మనుగడ కొనసాగిస్తున్నాయి.

వీటి ఫలితంగా మొక్కలు తమ రక్షణ శక్తిని కోల్పోవడం, వాటి వ్యాధి నిరోధక శక్తి క్షీణించడం కారణాలుగా పురుగులు, తెగుళ్ళు వంటివి వాటి మీద దండయాత్రలు అధికం చేస్తున్నాయి. వీటిని అరికట్టే దిశలో శాస్త్రవేత్తలు రసాయనాలను కనుగొని పంటలను రక్షించడం ప్రారంభించారు.

ఇక్కడ మరొక చిక్కు ఎదురయింది. సరియైన అవగాహన లేక, అధికోత్పత్తి లక్ష్యంగా పెట్టుకుని, అవసరానికి మించి రసాయనాలు వినియోగం మొదలయింది. దీనివలన 'హరిత విప్లవం' కల్గిస్తున్న ఆనందం కనుమరుగయిపోతోంది.

కాలుష్యాలు :

మనిషి అత్యాశ చర్యల వల్ల పంట ఉత్పత్తి కాలుష్యం, అంటే ఆహార కాలుష్యం, భూమి కాలుష్యం అంటే భూమిలోని జీవరాశులనాశనం, నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యం వంటివి విపరీతంగా పెరిగి బతుకే ప్రశ్నార్థకంగా తయారయ్యే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. పరిస్థితిని ప్రణాళికాబద్ధంగా సరిదిద్దవలసిన ఆవశ్యకత తప్పనిసరి అవుతోంది. దీనికి పరిష్కార దిశగా 'సేంద్రియ వ్యవసాయం' తెరమీదకు వచ్చింది.

ప్రధాన శత్రువులు :

ప్రస్తుతానికి పురుగులు, తెగుళ్ళు, పోషక పదార్థాల లోపం అనేక పంటలను నాశనం చేసే జీవరాశి కాచుకుని వుంది. వీటిని నివారించే పద్ధతులు తప్పనిసరిగా అన్వేషించాలి, పాటించాలి.

పంటలను ఆశించే చీడపీడల్లో చెప్పుకోవాల్సినవి కీటకాలు, కీటకేతరాలు, బూజు తెగుళ్ళు, బ్యాక్టీరియా తెగుళ్ళు, వైరస్ తెగుళ్ళు మొదలయినవి.

కీటకాలు :

కీటకాలకు అనేక దశలు వుంటాయి. గుడ్డుదశ, లార్వాదశ, ప్యూపాదశ, రెక్కల పురుగు దశ వంటివి. మొక్కలకు ఎక్కువగా హాని చేసే దశ గొంగళిపురుగు లేక లద్దెపురుగు లేక తోక పురుగు దశ.

ఆకు తినే పురుగులని, కాండం దొలిచే పురుగులని, దుంపను పాడుచేసే పురుగులని, పీక పురుగులని, ఆకు మడత పురుగులని ఇలా రకరకాలు. ఇవన్నీ పంటలకు తీవ్రనష్టాన్ని కలుగజేస్తున్నాయి.

ఆకులు తినేవి చాలా ఎక్కువ. పశువులు వచ్చి మేశాయేమో అనే అంతగా తినేస్తాయి. ఆకు వెనుక భాగంలో సాధారణంగా గుడ్లు పెడతాయి. వాటిని గుర్తించగల్గాలి. వాటిని తీసి ఉప్పు నీళ్ళున్న బకెట్‌లో వేసి బయటకు వచ్చాక వాటిని నాశనం చేయాలి. గుడ్లను కూడా నిరోధించగల మందులు ఉపయోగించాలి.

కొన్ని పురుగులు - నారింజజాతి, కరివేపాకు మొక్కలపై ఆకు చివర ఒకే గుడ్డు పెడతాయి. అది గుర్తించగల్గాలి. ఆ గుడ్డుదశలో దానినేల మీద పడవేసినా కూడా చచ్చిపోతుంది. బయటకు రాగానే దానికి తిండికావాలి. నేలమీద దానికి తిండి దొరకదు. అందువల్ల చనిపోతుంది.

లార్వాదశలో వున్న వాటి నివారణకు కాంటాక్టు పాయిజన్ మందులు, కాండం కాయవంటి వాటిలోకి దూరి దాగుకునే వాటికైతే లోపలకు చొచ్చుకు పోయేమందులు వాడాలి. మోనోక్రోటోఫాస్, క్లోరోపైరిఫాస్, పాస్ఫామిడాన్, కార్బొఫ్యూరాన్ గుళికలు వంటివి వాడాలి. ఏమి వాడాలి అనేది, ఎంత మోతాదు వాడాలి అనే

విషయం వ్యవసాయ శాఖ అధికారిని అడిగి తెలుసుకోవాలి.

రెక్కల పురుగు :

ప్యూపా దశలో పెద్ద ప్రమాదం వుండకపోవచ్చు. దుక్కి దున్నిన సమయంలో అనేక ప్యూపాలు బయటపడతాయి. వాటిని పక్షులు, కొన్ని జంతువులు తింటాయి. ఎండకు కొన్ని మరణిస్తాయి. ఈ ప్యూపాలను రైతులు గుర్తించగల్గితే సులువుగా కొన్ని పురుగులను నివారించగల్గుతారు.

ఈ ప్యూపాదశ తరువాత చాలా ప్రమాదకరమైనది. ప్యూపా దశనుండి ఆడ, మగ పురుగులు బయటకు వచ్చి రెక్కలు సరి చేసుకుని ఎగురుతాయి. వీటిలో చాలా రకాలు పూలలో మకరం దాన్ని పీల్చుకుని బతుకుతాయి. వీటి ప్రధానమైన పని గుడ్లు పెట్టడం. పక్షులకు మనుషులకు కనపడని విధంగా చెట్లు కాండంపైన, ఆకుల వెనుక భాగంలోనూ బాగా ఎక్కువగా గుడ్లు పెడతాయి.

కొన్ని సిగరెట్ పెట్టెలాంటివి తయారు చేసి అందులో పెడతాయి. కొన్ని పిందె పుట్టగానే దాని లోపల గుడ్లు పెడతాయి. అది పండుగా తయారవగానే కోసి చూస్తే లోపల పురుగు వుంటుంది. మామిడి టెంకలోని పురుగు అలా చేరినదే.

ఈ పురుగుల నివారణకు రకరకాల మందులు వున్నాయి. వాటిని ఏ విధంగా ఎప్పుడు వాడాలి అనే విషయంలో రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలను సంప్రదించాలి.

కీటకేతరాలు

కీటకేతరాలు ముఖ్యంగా మైట్ అని, ఈవ్ వర్మ్ అని వున్నాయి. పంటలకు ఇవి చాలా నష్టాన్ని కల్గిస్తాయి.

ఇందులో మైట్ సాలీడు జాతికి చెందినది. దీనికి నాలుగు జతల కాళ్ళు వుంటాయి. వీటిని భూతద్దంలో చూస్తే కన్పిస్తాయి. ఇవి ఆకు అడుగు భాగాన్ని చేరి ఆకులో రసాన్ని తాగేస్తాయి. వీటి నివారణకు గంధకం మంచిది.

ఈవ్‌వర్మ్ సన్నని దారం లాంటి పురుగు. దీనికి తలవైపు తోకవైపు సూదిగా వుంటాయి. ఇవి ఒకచోటునుండి మరొక చోటుకు ప్రయాణం చేయలేవు. ఒక చదరపు మీటరు నేలలో 3 కోట్లు వరకు వుంటాయి. ఇవి మొక్కకు గాయం చేసి నష్టపరుస్తాయి. ఈ గాయం నుండి బూజు తెగుళ్ళు, బ్యాక్టీరియా తెగుళ్ళు మొక్కలకు ఆశించే ప్రమాదం వుంటుంది.

పంటల విషయానికి వస్తే ఇవి దాదాపు అన్ని పంట భూముల్లోనూ వుంటాయి. వీటివల్ల దాదాపు 10 శాతం నష్టం కలుగుతోంది. వీటి నిరోధానికి విత్తనశుద్ధి ప్రధానమైనది. 40° నుండి 55° సెల్సియస్ ఉష్ణోగ్రత వున్న నీటిలో విత్తనాన్ని వుంచాలి. ఒక్క నిముషం అయ్యేసరికి ఆ నీరు తన అధిక ఉష్ణాన్ని కోల్పోతుంది.

తొలకరి దుక్కి చేసి ఎండ బాగా తగిలేటే కూడా నేలలో వున్నవి చాలా వరకు నశిస్తాయి. పంట మార్పిడి మంచిది. నువ్వు పంట, ఆవాలు పంట వేరు వీటిని నిరోధిస్తాయి. అందుచేత ఈ పంటలను తరచు మీ నేలలో పండిస్తూ వుండాలి.

వేపపిండి, కానుగపిండి, విప్పపిండి, ఆముదపు పిండి ఎకరాకు / టన్ను వాడితే మంచిది. రసాయన మందులు ఫొరేటు, కార్బో ఫ్యూరాన్ గుళికలు చాలా ఉపయోగకరంగా వుంటాయి.

పంటలకు ఎలుకలు ఎంతో నష్టం కలిగిస్తున్నాయి. ఈ ఎలుకలను నిరోధించకుండా వదిలేస్తే కొన్నాళ్ళకు మనుషులకు తినడానికి ఏమీ మిగలదని, ఎలుకలు పందుల సైజులో పెరుగుతాయని చివరకు విధిలేక మనుషులు ఆ పందిసైజు ఎలుకల్ని తినే పరిస్థితి ఎదుయ్యే ప్రమాదం వుంటుందని వ్యవసాయ శాస్త్ర పరిశోధకులు హెచ్చరికలు ఇస్తూ వున్నారు.

బదనికలు :

పురుగుల్లో మనకు ఉపకారం చేసేవి కూడా వున్నాయి. అవి పరభాగ్యోప జీవులు. వీటినే బదనికలు అంటారు. ఇవి హానికరమైన పురుగులను నాశనం చేస్తాయి. ఈ హానికరమైన పురుగులను బదనికలు ఆహారంగా స్వీకరిస్తాయి.

కొన్ని బదనికలు కీటకాలుపై పడి సూదివంటి నోటి భాగాలతో పొడిచి తింటాయి. కొన్ని తమ లాలాజలాన్ని కీటకంలోకి పంపి మొత్తాన్ని తిరిగి పీల్చేస్తాయి. మరికొన్ని బదనికలు కీటకాల్ని ముక్కలు ముక్కలు చేసి తింటాయి. ఇంకొన్నయితే కీటకాల గుడ్లునే భక్షించేస్తాయి.

కొన్ని కీటకం యొక్క లార్వా మీద చిన్న కన్నం పెట్టి గుడ్లు పెడతాయి. అవి పగిలి పిల్లలు పురుగుని లోపలనుండే తినేస్తాయి. ఇటువంటి కీటకాలనే రైతుమిత్ర పురుగులు అంటారు. ఇటువంటివి ఎన్నో వున్నాయి.

కొన్ని ఉదాహరణలు :

అక్షింతల పురుగులు : ఇవి గుడ్లను, లార్వాలను దోమ జాతిపిల్ల, పెద్ద దోమలను తింటాయి.

ఎర్ర చీమ : నల్ల నీటి నల్లులను, వాటి గుడ్లను తింటాయి.

కందిరీగ : కాండం దొలిచే పురుగుల గుడ్లను ఆహారంగా తింటుంది.

చిమ్మిలు : శనగపచ్చ పురుగు గుడ్లను తింటుంది.

లింగ్సు సాలీడు : ఎక్కువగా రెక్కల పురుగులను తింటుంది.

చిన్న తూనీగ : పేనుబంక పురుగులను, ఈగలను, మిడతలను తింటుంది.

గొల్లభామ : శనగపచ్చ పురుగులను, ఈగలను, మిడతలను తింటుంది.

నీటినల్లి : నీటిపై పెద్ద పురుగులు, లార్వా, మరియు దోమలను భక్షిస్తుంది.

కోకాకోల బిళ్ళ పురుగు : ఆకుముడత పురుగు, లార్వాలను స్వాహా చేస్తుంది. ఇలాంటివి ఇంకా ఎన్నెన్నో వున్నాయి. ✧

రసాయన ఎరువులు – తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డా॥ యన్. కృష్ణప్రియ, రీసెర్చ్ అసోసియేట్, కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరు; డా॥ ఓబయ్య, ప్రోగ్రాం కో ఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరు;
డా॥ యం. చంద్రశేఖర్‌రెడ్డి, సైంటిస్ట్, లాంఫారం, గుంటూరు.

నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ముఖ్య పోషకాలు మరియు ఇతరపోషకాలు మరియు ఇతర పోషకాలు అంగిక భాగాలుగా కలిగివుండి, కృత్రిమంగా తయారు చేయబడిన లేదా రూపాంతరము చేయబడిన రసాయన పదార్థాలను “రసాయన ఎరువులు” అంటారు. రసాయనిక ఎరువులు 1 నుండి 3 ప్రధాన పోషకాలను అధిక పరిమాణాలలో కలిగి నేలలో వేయగానే త్వరగా కరిగి మొక్కలకు అందించబడుతాయి.

నత్రజని ఎరువులు

1. నత్రజని ఎరువులు :

ఎరువులో రసాయన రూపాన్ని బట్టి (నైట్రేట్, అమ్మోనియా, ఎమైడ్) నత్రజని ఎరువులు నాలుగు రకాలు.

1. నైట్రేట్ రసాయనిక ఎరువులు
2. అమ్మోనియా రసాయనిక ఎరువులు
3. నైట్రేట్ - అమ్మోనియా రసాయనిక ఎరువులు
4. ఎమైడ్ రసాయనిక ఎరువులు

నైట్రేట్ నత్రజని ఎరువులు


- నేలలో గల తేమ వలన త్వరగా కరిగి నత్రజనిని నైట్రేట్ రూపంలో మొక్కలకందిస్తుంది.
- నైట్రేట్ (NO_3^-) రూపంలో గల నత్రజనిని మట్టి రేణువులు పట్టి వుంచలేవు. అందువలన నీటిలో కరిగి నేల అడుగు పొరలలోనికి (leaching) పోవడం, మరియు సూర్యరశ్మి వలన వాయువుగా మారి గాలిలో కలిసిపోతుంది (volatalization).
- ఎక్కువ నష్టాలకు గురయ్యే ఈ రకపు ఎరువుల వాడకం తక్కువ.
- సాగునీటి క్రింద చేపట్టే వరి పైరుకు ఈ ఎరువులు వాడరాదు.


ఉదా : కాల్షియం నైట్రేట్ (15% N)
సోడియం నైట్రేట్ (16 % N)

అమ్మోనియా నత్రజని ఎరువులు

- ఈ ఎరువులలో నత్రజని అమ్మోనియా (NH_4^+) రూపంలో మొక్కలకు అందజేయబడుతుంది.
- అమోనియా రూపంలో గల నత్రజని నైట్రేట్ రూపంవలె వృధా కాదు. అందువలన మొక్కలు చక్కగా వినియోగించుకుంటాయి. అందువలన ఈ ఎరువులను మంచి ఎరువులుగా భావించవచ్చు.
- కాలానుగుణంగా అమ్మోనియా, నైట్రేట్‌గా రూపాంతరం చెందుతుంది.
- అమ్మోనియా సల్ఫేటు విత్తనం వేసేటప్పుడు గాని, పై పాటుగా గాని వేసుకోవచ్చు. కాని విత్తనంతో కలిపి వాడకూడదు.
- ఆమ్ల గుణం కలిగించే స్వభావం కలది కాబట్టి మరీ ఎక్కువగా అమ్మోనియం సల్ఫేట్‌ను వేయకూడదు.
- వంద కిలోల అమ్మోనియం సల్ఫేటు వల్ల ఏర్పడే ఆమ్లత్వాన్ని తటస్థం చేయడానికి 110 కిలోల కాల్షియం కార్బొనేట్ కావలసి వస్తుంది.
- అమ్మోనియం క్లోరైడ్ నేలలో గల కాల్షియంతో కలిసి కాల్షియం క్లోరైడ్‌గా మారుతుంది. కాల్షియం క్లోరైడ్ నీటిలో కరిగే స్వభావం వుండడం వల్ల సులభంగా కొట్టుకు పోతుంది. అంటే అమ్మోనియం క్లోరైడ్ వేయడం వల్ల నేలలోని కాల్షియం నష్టమయ్యే అవకాశం వుంది.
- మాగాణి పైర్లకు వేసుకోవచ్చు.
- పొగాకు, ఆలుగడ్డ పైర్లకు అమ్మోనియం క్లోరైడ్ వాడకూడదు. క్లోరిన్ రెండు పైర్లకు చెడుపు చేస్తుంది. పొగాకులో ఆకు నాణ్యత, ఆలుగడ్డలో ఎక్కువ కాలం నిల్వ వుండకుండా చేస్తుంది.

ఉదా : అమ్మోనియం సల్ఫేట్ (21% N, 24% S)
అమ్మోనియం క్లోరైడ్ (25% N)







నైట్రేట్ అమ్మోనియా ఎరువులు

- ☞ ఈ ఎరువులలో కొంత నత్రజని నైట్రేట్ రూపంలోనూ, మిగిలినది అమ్మోనియా రూపంలోనూ వుంటుంది.
- ☞ ఆరుతడి పంటలలో ఈ ఎరువు వాడినపుడు నైట్రేట్ రూపంలో వున్న నత్రజని త్వరగా మొక్కకు అందించబడి అమ్మోనియా రూపంలో గల నత్రజని నెమ్మదిగా మొక్కలకు అందించ బడుతుంది.
- ☞ పోషక వినిమయ సామర్థ్యం ఎక్కువగా వుంటుంది.
- ☞ కాల్షియం అమ్మోనియం నైట్రేట్ తేమను సులభంగా పీల్చు కొంటుంది. కనుక ప్రత్యేక గోతాలలో నిల్వ చేయాలి.
- ☞ ఇందులో నత్రజని సగ భాగం అమ్మోనియా రూపంలో సగ భాగం నైట్రేట్ రూపంలో వుంటుంది.
- ☞ ఇది తటస్థంగా వుండే ఎరువు.

ఉదా : అమ్మోనియా నైట్రేట్ (33% N)
కాల్షియం అమ్మోనియం నైట్రేట్ (CAN) (20.5% N)
అమ్మోనియం సల్ఫేట్ నైట్రేట్ (ASN) (26% N)

ఎమైడ్ నత్రజని ఎరువులు

- ☞ నత్రజని ఎమైడ్ (NH_2) లేదా సైనమైడ్ (CN_2) రూపంలో వుంటుంది.
- ☞ ఎమైడ్ నత్రజని ఎరువులలో యూరియా బహుళ ప్రాచుర్యం పొందిన ఎరువు.
- ☞ గాలిలో తేమను సులభంగా పీల్చి గడ్డకడుతుంది.
- ☞ మాగాణిలో వేసేటప్పుడు కొంత నత్రజని కొట్టుకుపోవచ్చు. మెట్టలో కూడా పైపొరలలోని నత్రజని ఆవిరై నష్టం కావచ్చు. కాబట్టి యూరియా వేసినపుడు అది నేలలో బాగా కలిసేటట్లు జాగ్రత్తపడాలి.
- ☞ కొద్దిగా ఆమ్లత్వం ఏర్పడవచ్చు.
- ☞ ఈ ఎరువును నీటిలో కరిగించి మొక్కలపై పిచికారి చేసిన నత్రజని శీఘ్రగతిన మొక్కలు తీసుకొంటాయి (2 శాతం అనగా 20 గ్రా / లీ)
- ☞ నీటిలో కలిపి పిచికారీ చేసినపుడు అధిక గాఢత కలిగియున్న ఆకులు మాడిపోతాయి. మరియు యూరియాలో 'బైయూరేట్' అనే పైరుకు హాని చేసే పదార్థముంటుంది. ఇది 1.5% మించకుండా వున్నపుడు యూరియా స్ప్రే పనికి వస్తుంది.

భాస్వర ఎరువులు

భాస్వరము లభ్యమయ్యే రూపాన్ని బట్టి మరియు కరిగే స్వభావాన్ని బట్టి భాస్వర ఎరువులను వర్గీకరించారు.

ఎ) నీటిలో కరిగే భాస్వరపు ఎరువులు
బి) సిట్రిక్ ఆమ్లములో కరిగే భాస్వరపు ఎరువులు
సి) కరగని భాస్వరపు ఎరువులు

ఎ) నీటిలో కరిగే భాస్వరపు ఎరువులు

- ☆ ఈ ఎరువులు నీటిలో కరిగి వెంటనే భాస్వరాన్ని మొక్కకు అందజేస్తాయి.



- ☆ ఈ ఎరువులలో భాస్వరం H_2PO_4 రూపంలో వుంటుంది.
- ☆ ఈ ఎరువులు అన్ని నేలల్లోనూ తటస్థ మరియు క్షార స్వభావము కలిగిన నేలల్లో వాడవచ్చు.

ఉదా : సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (16% P_2O_5)
డబుల్ సూపర్ ఫాస్ఫేట్ (32% P_2O_5)
ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్ (48% P_2O_5)

సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ భాస్వరం (16%)తో బాటు కాల్షియం (21%), గంధకం (12%) వుంటాయి. కొన్ని సూక్ష్మ పోషక పదార్థాలు కూడా ఈ ఎరువులో వుంటాయి. అందువల్ల ముఖ్యంగా వేరుశనగ పంటకు ఇది వేస్తారు.

ఎప్పుడూ విత్తనం నాటేటప్పుడు భాస్వర ఎరువులు వేసుకోవాలి. ఆరుతడి పంటలను వేసేటప్పుడు మొక్కలను 2-3 సెం.మీ. దూరంలో 4-8 సెం.మీ. లోతున వేసుకుంటే మంచి ఫలితమిస్తుంది.

బి) సిట్రిక్ ఆమ్లములో కరిగే భాస్వరపు ఎరువులు

ఈ ఎరువులో భాస్వరము HPO_4రూపంలో వుంటుంది.

ఉదా : బేసిక్ స్లాగ్ (16% P_2O_5)
బోన్ మీల్ (20-25 % P_2O_5) (బేసిక్ స్లాగ్‌ను పొడి చేసి అమ్ల భూములకు చల్లితే ఆమ్లత్వం తగ్గుతుంది)

సి) కరగని భాస్వరపు ఎరువులు

- ☆ ఈ ఎరువులలో భాస్వరం PO_4^{--} రూపంలో వుంటుంది.
- ☆ అత్యధిక ఆమ్లత్వం కలిగిన నేలల్లో ఈ ఎరువులు కరిగి భాస్వరాన్ని మొక్కలకు అందిస్తాయి.
- ☆ అధిక వర్షాలు పడే పర్వత శ్రేణుల్లో పండించే టీ, కాఫీ తోటల్లో ఈ ఎరువు వేస్తారు.

ఉదా : శిలాఫాస్ఫేట్ (rock phospate) (20-40 % P_2O_5)

పొటాష్ ఎరువులు

పొటాష్ ఎరువులు పొటాష్‌ను K^+ రూపంలో మొక్కలకు అందజేస్తాయి.

- ☆ ముఖ్యమైన పొటాష్ ఎరువులు - మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (పొటాషియం క్లోరైడ్) 60% K
- ☆ సల్ఫేట్ ఆఫ్ పొటాష్ (పొటాషియం సల్ఫేట్) 50% K, 18%S

పొటాషియం నైట్రేట్ 59% K, 14% N

- ✩ మ్యూరేట్ ఆఫ్ పొటాష్ నీటిలో త్వరగా కరుగుతుంది.
- ✩ ఇతర పొటాష్ ఎరువులతో పోలిస్తే ధర తక్కువ
- ✩ బంగాళాదుంప, పొగాకు వంటి పైర్లకు వేయరాదు.
- ✩ పొటాషియం సల్ఫేట్ ధర ఎక్కువ.
- ✩ పొటాషియం సల్ఫేట్ ఎక్కువగా బంగాళాదుంప, పొగాకు పైర్లకు వాడుతారు.
- ✩ వర్షాభావ పరిస్థితుల్లో దీనిని పైర్లపై పిచికారీ చేయవచ్చు.
- ✩ పొటాషియం నైట్రేట్‌ను నత్రజని, పొటాష్ లోపాలను సవరించడానికి పిచికారీ చేసుకోవచ్చు.

ద్వితీయ పోషక ఎరువులు

- ✩ ఆధునిక వ్యవసాయంలో అధిక దిగుబడి వంగడాల సాగు, సేంద్రియ ఎరువుల వాడకం తగ్గిపోవడం, రసాయన ఎరువులు ముఖ్యంగా సంకీర్ణ ఎరువుల వాడకం వల్ల అన్ని ప్రాంతాల్లో అనేక పైర్లు ఈ ద్వితీయ పోషకాల (కాల్షియం, మెగ్నీషియం, గంధకం) లోపాలకు దారి తీసింది.
- ✩ ముఖ్యంగా ఆమ్ల భూముల్లో కాల్షియం, మెగ్నీషియం కలిగిన రసాయన ఎరువులు ప్రతి సంవత్సరం వేసుకోవాల్సి వుంటుంది. గంధకం ప్రత్యేకంగా వేయనవసరం లేదు. దీనికి కారణం వ్యవసాయంలో వాడే వివిధ రసాయనిక ఎరువులు ముఖ్యంగా సూక్ష్మ పోషక లోప నివారణకు వాడే రసాయనాలు, చీడ పీడలకు వాడే రసాయనాల్లో ఎంతో కొంత గంధకం కలిగి వుంటుంది.

రసాయనిక పదార్థం	Ca%	Mg%	S%
ముడి సున్నం (lime)	36	-	-
డోలోమైట్ (Dolomite lime)	17	12	-
బేసిక్ స్లాగ్ (Basic slag)	29	29	-
జిప్సం (gypsum)	22	-	18
సింగిల్ సూపర్ ఫాస్ఫేట్	20	-	12
ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్	13	-	-
రాక్ ఫాస్ఫేట్ (శిలా ఫాస్ఫేట్)	33	-	-
అమ్మోనియం సల్ఫేట్	-	-	23
పొటాషియం సల్ఫేట్	-	-	18
మెగ్నీషియం సల్ఫేట్	-	10.5	13

సూక్ష్మ పోషక రసాయనిక ఎరువులు

సూక్ష్మ పోషక లోపాలు ఏర్పడటానికి ముఖ్య కారణాలు :

అధిక దిగుబడి నిచ్చు వంగడాల సేద్యం, సంవత్సర కాలంలో 2-3 పంటలు వేయడం, విచక్షణా రహితంగా రసాయనిక ఎరువుల వాడకం, సేంద్రియ ఎరువులు పూర్తిగా వేయకపోవడం

సూక్ష్మ పోషక లోపాల నివారణ :

సేంద్రియ పదార్థాలు విరివిగా వాడడం, రసాయనిక ఎరువులు వాడకంలో సమతుల్యత, ప్రత్యేకంగా సూక్ష్మ పోషకాలున్న రసాయన పదార్థాలులేదా రసాయనిక ఎరువులు నేలలో వేయడం, లోప లక్షణాలు కనిపించినపుడు ఆయా పోషక పదార్థాలు ద్రావకంగా తయారు చేసి పిచికారీ చేయడం.

సూక్ష్మ పోషక ఎరువులు రెండు రకాలు :


సూక్ష్మ పోషకాలు కలిగి వున్న ఖనిజ లవణాలు

చిలేటేడ్ రూపంలో యున్న సూక్ష్మ పోషకాలు, సేంద్రియ పదార్థంచే రింగు ఆకారంలో బంధింపబడి వుంటాయి.

సూక్ష్మ పోషకాల లోపాలు - సవరణ

జింకు లోప నివారణ :

- ✩ ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్ ప్రతి మూడు పంటలకు ఒకసారి వేసి లేదా అదే వరి తర్వాత వరిపంటను వరుసగా



వేసినట్లయితే ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్‌ను ప్రతి రబీ పంటకు ముందు వేసి నివారించవచ్చు.

ఇనుపధాతు లోప నివారణ :

- ✩ లీటరు నీటికి 20 గ్రాముల అన్నభేది (Ferrous sulphate), 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారి చేయాలి. పగటి ఉష్ణోగ్రత ఎక్కువగా వున్నపుడు తక్కువ గాఢత కల్గిన ద్రావణాన్ని (0.5 - 1.0) వాడాలి.

బోరాన్ లోప నివారణ :

- ✩ శాతం బోరిక్ ఆమ్లాన్ని (1 లీటరు నీటికి 1 గ్రాము) రెండుసార్లు 10-15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. ప్రత్యామ్నాయంగా ముందు జాగ్రత్తగా చెట్టు పాదులో 50 గ్రాముల బోరాక్స్ వేయాలి.

మెగ్నీషియం లోప నివారణ :

- ✩ లీటరు నీటికి 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ పైరు వేసిన 45, 90 రోజుల తర్వాత పిచికారీ చేయాలి.

మాలిబ్డినం లోప నివారణ :

- ✩ ఎకరానికి 400 గ్రాముల సోడియం మాలిబ్డేట్‌ను మట్టిలో కలిపి వేయాలి.

ఆముదంలో ముఖ్యమైన పురుగులు, తెగుళ్ళు – నివారణ

డా. శ్రావణి, కీటక విభాగ శాస్త్రవేత్త, సిహెచ్. వరప్రసాదరావు, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, వల్లూరు



ప్రపంచంలో ఆముదం సాగు విస్తీర్ణం మరియు ఉత్పత్తిలో మనదేశం ప్రధమస్థానంలో వుంది. ఆంధ్రప్రదేశ్ దేశంలోని ఆముదం విస్తీర్ణంలో 2వ స్థానం, ఉత్పత్తిలో 3వ స్థానం మరియు ఉత్పాదకతలో 6వ స్థానంలో వున్నది. ఆముదంలో ముఖ్యమైన పురుగులు, తెగుళ్ళ నివారణకు పాటించవలసిన సూచనలు.

పురుగులు :

ఎర్రగొంగళి పురుగు : ఈ పురుగు ఉధృతి పైరు మొలచిన వెంటనే అధికంగా వుంటుంది. గొంగళి పురుగులు ఆకుల కాడలను, ఈనెలను, లేత కొమ్మలను మాత్రమే మిగుల్చుతాయి.

సమగ్ర యాజమాన్యం : వేసవిలో భూమిని లోతుగా (15-30 సెం.మీ) దున్నుకోవాలి. లోతు దుక్కులు చేయడం వలన కోశస్థ దశలో భూమి లోపలి పొరల్లో దాగున్న ఎర్రగొంగళి పురుగు, మరియు ఇతర హానికర పురుగులు బయటపడి ఎండ తీవ్రతకు గాని, పక్షుల బారినపడి గాని చనిపోతాయి. భూమి తేమను నిలుపుకొనే సామర్థ్యాన్ని పెంచుకుంటుంది. కలుపు సమస్య తగ్గుతుంది. మరియు పంటను సకాలంలో విత్తుకోవచ్చును. ఆముదానికి ముందుగా, పొలంగట్లపైన అక్కడక్కడా దోస నాటడం వల్ల ఎరగా ఉపయోగపడుతుంది. తొలకరి వర్షాలు వచ్చినపుడు, రాత్రి 7.00 నుండి 10.00 గం.ల సమయంలో రైతులందరు సామూహికంగా మంటలు పెట్టడం ద్వారా మరియు దీపపు ఎరలను అమర్చడం ద్వారా రెక్కల పురుగులను అరికట్టవచ్చు. ఎదిగిన గొంగళి పురుగులు ఒక పొలం నుండి వేరొక పొలంలోకి పోకుండా పొలం చుట్టూ లోతైన నాగటి చాలును తీసి అందులో మిథైల్ పెరాథియాన్ 2% లేదా క్వినాల్‌ఫాస్ 1.5% పొడి మందును చల్లి పురుగులను నివారించవచ్చు. ఎదిగిన గొంగళి పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా పై మిథోయేట్ 2.0 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

దాసరి పురుగు / నామాల పురుగు : లద్దె పురుగులు తొలిదశలో ఆకులను గీకి తర్వాత దశలో రంధ్రాలేర్పరిచి ఆకులను తింటాయి. పెరిగిన లద్దె పురుగులు భూమిలోగాని, క్రిందపడి ఎండిన ఆకులలోగాని లేదా ముడుచుకున్న ఆకులలో గాని కోశస్థ దశలోకి ప్రవేశిస్తాయి.

సమగ్ర యాజమాన్యం :

అగస్టు మరియు సెప్టెంబరు మాసాల్లో ఎకరాకు 50,000 ట్రైకోగ్రామా పరాన్న జీవులను వదిలి దాసరి పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చు. దాసరి పురుగు మొదటిదశలో అవసరమైతే పరాన్న జీవులను హాని చేయని వేపనూనె 5 మి.లీ. లేదా ఎసిఫేట్ 15 గ్రా. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి దాసరి పురుగును అరికట్టవచ్చు. దాసరి పురుగులు పెద్దవిగా వున్నపుడు వాటిని ఏరి నాశనం చేయాలి. పొలంలో ఎకరాకు 10 పక్షి స్థావరాలను పక్షులు వాలేందుకు వీలుగా అమర్చినట్లయితే పొలంలోకి పక్షులు వచ్చి పురుగులను ఏరి తింటాయి. పంట పూర్తిగా కోసిన తర్వాత పొలంలోని చెత్తను కాల్చినట్లయితే కోశస్థ దశలోని దాసరి పురుగును నివారించవచ్చును.

తెగుళ్ళు :


వడలు తెగులు / ఎండు తెగులు :

ఈ తెగులు పంట విత్తిన 20-60 రోజుల మధ్యకాలంలో ఎక్కువగా రావటానికి ఆస్కారముంది. లేత దశలో తెగులు సోకినట్లయితే మొక్కలు వడలిపోయి, బీజ పత్రాలు రంగును కోల్పోయి, పాలిపోయి తర్వాత మొక్కలు చనిపోతాయి. కాని కాస్త పెద్ద మొక్కలకు సోకినట్లయితే లేత ఆకులు ముందుగా వడలిపోయి, క్రమేపి పసుపు వర్ణానికి మారి తర్వాత ఎండిపోతాయి. కాండం చీల్చి చూస్తే లోపల తెల్లని బూజులాంటి శిలీంధ్రపు పెరుగుదలను గమనించవచ్చు.

నివారణ :

నీరు నిలిచే నేలల్లో మరియు పల్లపు ప్రాంతాల్లో ఆముదం సాగు చేయరాదు. కనీసం 2-3 సంవత్సరాల కొకసారి జొన్న / సజ్జలతో పంట మార్పిడి చేయాలి. కిలో విత్తనానికి 3 గ్రా. కార్బెండజిమ్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. ఒక ఎకరంలో ఉపయోగించుటకు గాను 125 కిలోల బాగా మాగిన పశువుల

పశుగ్రాసం వృధా కాకుండా వుండాలంటే!



డా॥ సిహెచ్. రమేష్
డిప్యూటీ డైరెక్టర్
పశు సంవర్థకశాఖ, హైదరాబాద్

ప్రస్తుత పరిస్థితుల్లో పశుగ్రాసం, సమీకృత దాణాల ధరలు పెరిగిపోయినందున, పశుపోషణ ఖర్చు, పాల ఉత్పత్తి వ్యయం పెరిగిపోతున్నది. తద్వారా పాల ఉత్పత్తిదారులు ఎంతగానో నష్టపోవాల్సి వస్తున్నది.

ఈ తరుణంలో విలువైన పశుగ్రాసం వృధా చేయకుండా, జాగ్రత్తగా పశువులకు వినియోగించాల్సిన అవసరం ఎంతైనా వుంది. సాధారణంగా పశువులకందించే వరిగడ్డి, పచ్చిగడ్డి, చొప్పలు మనకు తెలియకుండానే పశువుల కాళ్ళ క్రిందపడి, మలమూత్రాలతో కలిసి 50% మేత వృధా అవుతున్నది. ఈ వృథాను రైతులు గమనించి అరికట్టే చర్యలు తీసుకుంటే, పశుపోషణ లాభసాటిగా మారడానికి దోహదపడుతుంది.

పశుగ్రాసాన్ని ముక్కలు, ముక్కలుగా కత్తిరిస్తే, మేత వృధా కాకుండా పశువులు పూర్తిగా సంగ్రహిస్తాయి. 10-15% ఎక్కువ గ్రాసాన్ని తింటాయి. తద్వారా పాలదిగుబడి 5-10% పెరుగుతుంది. పాల ఉత్పత్తి ఖర్చు తగ్గుతుంది. పశుగ్రాసాన్ని ముక్కలుగా కత్తిరించినపుడు లేత ఆకులు, కాండముతో పాటు, పెద్దగా, లావుగా వుండే కాండాలు, వెడల్పు ఆకులు కూడా ముక్కలు చేయబడతాయి. ఇలా చేయడం వల్ల కాండాలతో పాటు, లేత ఆకులు కూడా పూర్తిగా సంగ్రహించ బడతాయి. 90% మేత సద్వినియోగమవుతుంది.

ముక్కలు చేసిన పశుగ్రాసాన్ని పశువులు సులభంగా, ఇష్టంగా పూర్తిగా తింటాయి. ముక్కలు చేసిన పశుగ్రాసాన్ని బస్తాల్లో నింపి, సులభంగా తక్కువ స్థలంలో నిలువ చేయడం వీలవుతుంది. రవాణా చేయడం కూడా సులభంగా వుంటుంది. ఈ గ్రాసంలో విటమిన్లు, ఖనిజ లవణాలు, మెలాసిస్ వంటివి కలపడం చాలా సులభం. యూరియాలతో కూడా ఊరవేసి ఈ గ్రాసాన్ని నిలువ చేయడం వీలవుతుంది. అంగుళం పైగా సైజులో కత్తిరించి మేపడం వల్ల పాలల్లో వెన్న శాతం కూడా పెరుగుతుంది.

పశుగ్రాసాన్ని ముక్కలు చేసి మేపడం వల్ల ఇలాంటి పలు ప్రయోజనాలున్నాయి. ఇందుకొరకు "చాప్‌కట్టర్" పరికరాల్ని వినియోగిస్తున్నారు. ఈ పరికరాలు చేతితో, విద్యుత్‌తో కూడా పనిచేస్తాయి. పశువుల సంఖ్య, కత్తిరించే పశుగ్రాసం, సమయం మొ॥ విషయాల్ని దృష్టిలో వుంచుకుని చాప్ కట్టర్‌ను కొనుగోలు చేసి వినియోగించాలి. చేతితో నడిచే చాప్‌కట్టర్‌లు సుమారు 5 వేల రూపాయలలోపు, విద్యుత్‌తో నడిచే 2 హెచ్.పి. చాప్ కట్టర్‌లు 15 వేలు, 5 హెచ్.పి. చాప్ కట్టర్‌లు 40వేల లోపు ఖరీదుంటాయి. కాబట్టి పశుపోషకులు విలువైన పశుగ్రాసం వృధా కాకుండా వుండడానికి చాప్ కట్టర్‌లతో పశుగ్రాసాన్ని ముక్కలుచేసి పశువులకందించాలి. పాడికి ప్రసిద్ధి చెందిన హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో రైతులు ఆచరించే విధానాన్ని, మన రాష్ట్ర రైతాంగం కూడా ఆచరణలో పెట్టి, విజయపథంలో పయనించాలి. ✧

ఎరువుకు 2.50 కిలోల ట్రైకోడెర్మాపొడి మందు మరియు 2.0 కిలోల వేపపిండి కలిసి, గోనెసంచితో కప్పి ప్రతి 2-3 రోజులకు ఒకసారి నీరు చిలకరిస్తూ వుండాలి. 15 రోజుల తరువాత ఈ ఎరువును విత్తేముందు నేలపై చాళ్ళలో వేసుకోవాలి. తెలుగు తట్టుకునే వంగడాలైన హరిత, జ్యోతి, పి.సి.హెచ్-111, పి.సి.హెచ్-222, పి.సి.హెచ్-177 లాంటి రకాలను ఎన్నుకొని విత్తుకోవాలి. తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే కార్బండజిమ్ 1 గ్రా. లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్ళ దగ్గర భూమిని తడపాలి. తెగులు సోకి చనిపోయిన మొక్కలను ఎప్పటికప్పుడు పొలం నుండి తొలగించి నాశనం చేయాలి.

కాయకుళ్ళు / బూజు తెగులు :

ఈ తెగులు వల్ల ముఖ్యంగా గెల పైన లేదా కొన్ని కాయలపైన గోధుమరంగు మచ్చలేర్పడి, తర్వాత ఈ వ్యాధి అన్ని కాయలకు వ్యాపిస్తుంది. తెగులు సోకిన భాగాలపైన దూది పింజలాంటి బూడిద లేదా గోధుమ వర్ణపు శిలీంధ్రపు పెరుగుదల కన్పిస్తుంది. శిలీంధ్రపు బీజాలు గాలి ద్వారా ఒక మొక్క నుండి మరొక మొక్కకు వ్యాపిస్తాయి. తెగులు సోకిన కాయలు మెత్తబడి, కుళ్ళి రాలిపోతాయి. గెలపై వున్న పూలపై శిలీంధ్రం ఆశించడం వలన కాయలు తయారు కాకుండా నల్లగా మారిపోతాయి.

నివారణ :

. పొలంలో మొక్కల మధ్య సరియైన దూరముండాలి. మరీ దగ్గరగా విత్తరాదు. తెగులును పూర్తిగా తట్టుకునే వంగడాలు లేవు కనుక కొంత మేరకు తట్టుకునే రకాలైన జ్వాల మరియు కిరణ్ రకాలను విత్తుకోవాలి. లీటరు నీటికి 1 గ్రా. కార్బెండిజిమ్‌ను లేక 1 గ్రా. థయోఫెనేట్ మిథైల్‌ను కలిపి మొక్క అన్ని భాగాలు తడిసేలా పిచికారి చేయాలి. తెగులు సోకిన కాయలను, గెలలను కోసి పొలానికి దూరంగా వేసి తగులబెట్టి దీని వ్యాప్తిని అరికట్టాలి. ఎకరాకు 20 కిలోల యూరియా మరియు 10 కిలోల పొటాష్ ఎరువులను అదనంగా పై పాటుగా వేసినట్లయితే తర్వాత వచ్చే గెలలు బాగా వచ్చి, నష్టాన్ని కొంతవరకు తగ్గించుకునే వీలుకు దురుతుంది. ✧

జీవన ఎరువులు – ప్రకృతి సేద్యపు సోపానాలు

ఎం. అనంత విహారి, M.Sc. (Ag) Pro., **డా॥ బి.ముకుందరావు,** Associant Pro., **అగ్రికల్చరల్ కాలేజి, బాపట్ల**

ప్రస్తుత వ్యవసాయరంగంలో హరిత విప్లవం ద్వారా ఎంతో ప్రగతిని సాధించాం. ఆధునిక వ్యవసాయంలో రసాయనిక ఎరువులను విచక్షణా రహితంగా వాడడం పరిపాటి అయింది. దీనివల్ల భూగర్భ ఉపరితల జలాలు కలుషితమై, పర్యావరణ సమతుల్యం దెబ్బతిని, ఉత్పాదకశక్తి లోపిస్తుంది. పంటల ఉత్పాదకశక్తి లోపిస్తుంది. పంటలు ఉత్పాదకతులను పెంచేందుకు సమగ్ర సమతుల ఎరువులు వాడాల్సిన అవసరం ఎంతైనా వుంది. వివిధ పోషకాలు లభించే రసాయన సేంద్రియం, జీవన ఎరువులను సమతుల్యంగా వాడాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో జీవన ఎరువులను గురించి కొంతైనా తెలుసుకోవాలి.



జీవన ఎరువులంటే సూక్ష్మ జీవుల సముదాయం. జీవన ఎరువు అనగా భూమిలో నానాటికి తగ్గుముఖం పడుతున్న సూక్ష్మంగా జీవులలో మొక్కలకు పోషక పదార్థాలను మరియు పెరుగుదలకు ఉపయోగపడే హార్మోన్లను సమకూర్చు సూక్ష్మజీవుల సముదాయం.

వీటిలో ముఖ్యమైనవి :

ఎ) నత్రజని స్థిరీకరించే జీవన ఎరువులు : రైజోబియం, అజటోబాక్టర్, అజోస్పైరిల్లమ్, నీటి ఆకుపచ్చనాచు, అజోల్లా - అనాబినా, అజిటోబాక్టర్, ఫ్రాంకియా.

1) **రైజోబియం :** అపరాల పంటలకు నత్రజని అందించు జీవన ఎరువుగా వాడవలెను. కంది, పెసర మినుము, శనగ మొ॥ పప్పుజాతి పంటలకు ఉపయోగించవలెను.

ఉపయోగించు విధానం : ఒక లీటరు నీటిలో 50 గ్రా. బెల్లం కలిపి 15 నిమిషాల పాటు మరగకాచి చల్లార్చాలి. చల్లార్చిన పాకానికి 200 గ్రా. రైజోబియం కల్చరును నెమ్మదిగా పట్టించి, ఆ కల్చరును విత్తనానికి పట్టించి విత్తనాన్ని నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.

2) **అజటోబాక్టర్ :** పప్పుజాతి పంటలను మినహాయించి మిగతా అన్ని పంటలకు నత్రజని జీవన ఎరువుగా ఉపయోగపడును. ఇది ఆకురాలు, కూరగాయలుకు సిఫారసు చేయబడుచున్నది. ఇది వాయుసహిత.

వాడే విధానం : ఎకరాకు సరిపడే విత్తనానికి 200-400 గ్రా. కల్చరును లేదా 1 కిలో కల్చరును 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరం నేలపై చల్లాలి. 8-16 కిలోల నత్రజని పైరుకు అందుతుంది.

3) **అజోస్పైరిల్లమ్ :** ఈ మధ్యకాలంలో దీని ప్రాముఖ్యత అధికంగా గుర్తించడం జరిగింది. ఈ బాక్టీరియా మొక్క వేర్లు చుట్టూ పెరుగుతూ అవకాశమున్న చోట వ్రేళ్లలోకి చొరబడి కూడా జీవిస్తాయి. ఇది వరి, చెఱకు, ప్రత్తి, మిర్చి, జొన్న, సజ్జ పంటలకు బాగా ఉపయోగపడును.

వాడే విధానం : తక్కువకాలం పంటలకు, 2 కిలోల అజోస్పైరిల్లమ్ కల్చర్‌ను 80-100 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి ఒక ఎకరం విత్తనము క్రిందపడేటట్లు వేసుకొనవలెను.

4) **నీలి ఆకుపచ్చనాచు (సైనాబాక్టీరియా) :** ఇది వరికి మాత్రమే ఉపయోగపడే నత్రజనికి సంబంధించిన జీవన ఎరువు. వరి పొలంలో వేస్తే ఎకరాకు 10 కిలోల నత్రజని పైరుకు అందుతుంది. నాచు నేలలో కలిసి సేంద్రియ ఎరువుగా పనిచేస్తుంది.

వాడేవిధానము : ఒక ఎకరం పొలంలో వరినాట్లు వేసిన 3 నుండి 7 రోజుల వ్యవధిలో 4 నుండి 6 కిలోల ఈ జీవన ఎరువు 40-50 కిలోల సేంద్రియ ఎరువులో కలిపి చల్లుకోవలెను.

5) **అజొల్లా-అనాబినా :** ఈ జీవన ఎరువు నీటిపై తేలి ఆడుతూ వరి పెరిగే ఫెర్న్ జాతి చిన్న మొక్క అయినా అజొల్లా- అనాబినా అనే సైనో బ్యాక్టీరియాకు ఆశ్రయం కల్పించి నత్రజనిని స్థిరీకరించి వరి పైరుకు అందుబాటులో ఉపయోగపడుతుంది.

వాడే విధానం : వరి నాటిన వారం తరువాత సుమారు 200 కిలోల అజొల్లా జీవన ఎరువును ఒక ఎకరంలో వెదజల్లి 15 నుండి 20 రోజులు నీటిపై బాగా పెరగనివ్వవలెను. ఎకరాకు 3 టన్నులు పచ్చిరొట్ట మరియు 12 కిలోల నత్రజనిని నేలకు చేరవేస్తుంది.

6) **అజిటోబాక్టర్ :** ఇది చెఱకు మరియు షుగర్ బీట్ వంటి పంటలకు మాత్రమే నత్రజని జీవన ఎరువుగా ఉపయోగపడును. అంతేకాక ఎన్.ఎ.ఎ. (నాఫ్తలీన్ ఎసిటిక్ యాసిడ్) అనబడే హార్మోను అధికంగా ఉత్పత్తి చేసి మొక్క పెరుగుదలకు దోహదపడును.

వాడే విధానం : ఒక ఎకరం చెరకు పంటకు 4 కిలోల జీవన ఎరువును రెండు దఫాలుగా వాడవలెను. ముచ్చెలు నాటేటప్పుడు 2.0 కిలోల మరియు మోకాలు లోతు పంట అయిన తరువాత 2.0 కిలోలు, 100 కిలోల సేంద్రియపు ఎరువుతో కలిపి వాడవలెను.

7) ఫ్రాంకియా : ఇది ఎక్టినోమైసిటిస్ జాతికి చెందిన సూక్ష్మాంగ జీవి. దీనిని సరుగుడు చెట్లకు మాత్రమే నత్రజనిని స్థిరీకరించే జీవన ఎరువుగా వాడుకోవలెను.

వాడే విధానం : సరుగుడు మొక్కలను భూమిలో నాటే టప్పుడు పాత మొక్కల వ్రేళ్ళపై వున్న బుడిపెలను సంగ్రహించి, వాటిని ఒక పాత్రలో మెత్తగా నలగగొట్టి నీటితో బాగా కలిపి ద్రావణం తయారు చేసుకోవలెను. ఈ ద్రావణమును క్రొత్త మొక్కలు నాటే ప్రతి మొక్కకు 500 మి.లీ. చొప్పున వేసి నాటుకోవలెను.

భాస్వరం అందించే జీవన ఎరువులు :

ఫాస్ఫేట్ సాల్యుబలైజింగ్ బాక్టీరియా, ఫాస్ఫేట్ సాల్యూ ఒలైజింగ్ పంగై, ఫాస్ఫేట్ మెబిలైజింగ్ మైకోరైజా (వి.ఎ.ఎం).

1) **ఫాస్ఫేట్ సాల్యుబలైజింగ్ బాక్టీరియా** : ఈ జీవన ఎరువు ముఖ్యంగా బాసిల్లస్ మెగథీరియంతో గాని, సుడోమోనాస్ గాని ఉపయోగించి తయారు చేయబడును.

వాడే విధానం : ఎకరాకు 2.0 కిలోల ఫాస్ఫోబాక్టర్‌ను, 200 కిలోల పశువుల ఎరువుతో కలిపి దుక్కిలో గాని, మొక్క నాటినపుడు గాని సాళ్ళలో పడేటట్లు వేసుకొనవలెను.

2) **ఫాస్ఫోఫంగై** : ఈ జీవన ఎరువు ఆస్పర్జిల్లస్ అవమోరి లేదా పనిసీలియం డిజిటోటమ్‌ను ఉపయోగించి తయారు చేయబడును.

వాడే విధానం : 2.0 కిలోల జీవన ఎరువును 100 కిలోల సేంద్రియపు ఎరువుతో కలిపి ఒక ఎకరం నేలకు విత్తనం నాటి సాళ్ళలో పడేటట్లు వేసుకొనవలెను.

3) **ఫాస్ఫేటు మొబిలైజింగ్ మైకోరైజా (వేమ్)** : వేమ్ వెసికులర్ అర్బాస్కులర్ మైకోరైజా, మొక్క వ్రేళ్ళ చారలేని భూమి అడుగు పొరలలోనికి చొచ్చుకొనిపోయి మొక్కలకు ముఖ్యంగా భాస్వరంతో పాటు సూక్ష్మ పోషకాలైన జింకు, కాపర్, సల్ఫర్, మాంగనీసు, ఇనుము వాటిని అందించును. వీటిని నూనె పంటలకు, కూరగాయలు, పప్పుధాన్యాలకు ఉపయోగిస్తారు.

వాడేవిధానము : 10 కేజీ. వేమ్‌ను 50 కేజీల సేంద్రియ ఎరువులతో కలిపి వేయవలెను.

పొటాషియం మొబిలైజర్స్ : ఈ జీవన ఎరువు భూమిలో మొక్కకు అందుబాటులో లేని పొటాషియంను అందుబాటులోకి తెచ్చును. వీటిలో ముఖ్యంగా 'ప్రటురియా ఆర్హానియ' అనే బాక్టీరియా మోబిలైజర్స్‌గా ఇవ్వబడుచున్నది.

వాడేవిధానం : 2.0 కిలోల జీవన ఎరువును 100 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి ఒక ఎకరం భూమిపై వెదజల్లవలెను. నూనె పంటలలో దీని ప్రభావం బాగా కనబడుచున్నది.

జింక్ సాల్యూబలైజర్ : దీనిని కొన్ని బాసిల్లస్ స్పీసిస్ ఉపయోగించి తయారు చేయబడినది. దీని ప్రభావం వరి, మొక్కజొన్న వంటి పంటలపై చూడవచ్చును.

మొక్క పెరుగుదలను అభివృద్ధి పరచే జీవన ఎరువు (పి.జి.పి.ఆర్) : ప్లాంట్ గ్రోత్ ప్రమోటింగ్‌రైజోబ్యాక్టీరియా (పి.జి.పి.ఆర్) బాసిల్లస్ జాతి బాక్టీరియాలను మరియు సుడోమోనాస్ జాతి బ్యాక్టీరియాలను తయారు చేసి పి.జి.పి.ఆర్. జీవన ఎరువు అందించుచున్నారు. భూమిలోని మొక్కలకు, తెగుళ్ళు కలుగజేసే శిలీంద్రాలను పెరగకుండా అరికట్టాలి.

వాడే విధానం : ఒక ఎకరాకు రెండు కిలోల ఈ జీవన ఎరువును 100 కిలోల పశువుల ఎరువుతో గాని, వానపాముల ఎరువుతో గాని విత్తనం నాటుకునే సమయంలో వెదజల్లవలెను.

ద్రవరూపంలో రూపొందించబడిన జీవన ఎరువులు :

ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు రూపొందించిన ఈ ద్రవరూపంలోని జీవన ఎరువులు పొడిరూపంలో తయారవుతున్న జీవన ఎరువుల కన్నా ఎంతో మంచి ఫలితాలు అందజేయుచున్నవి. అధికసంఖ్యలో పంట పొలమునకు కావలసిన ఈ జీవన ఎరువులు బ్యాక్టీరియా కణముల (10^8/మి.లీ.) లభ్య మగును.

వాడవలసిన మోతాదు : ఒక ఎకరం పొలమునకు 300 మి.లీ. నుండి 500 మి.లీ. వరకు జీవన ఎరువును మిశ్రమ ద్రావణముగా చేసి వాడవలయును.

ద్రవరూపములో నున్న జీవన ఎరువుల వలన లాభములు :

1. ఎక్కువ కాలము అనగా 12 నుండి 18 నెలలు నిల్వ వుండును.
2. ఇతర బ్యాక్టీరియా కలుషితము వుండదు.
3. ఈ టెక్నాలజీ ద్వారా తేలికగా ఎక్కువ పొలమునకు తక్కువ సమయంలో జీవన ఎరువులను నేరుగా మొక్క వ్రేళ్ళ దగ్గర చేరునట్లు వేయవచ్చును.

జీవన ఎరువుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

1. జీవన ఎరువు ప్యాకెట్ ఎండవేడి తగలని నీడ ప్రదేశంలో నిల్వ చేయవలెను.
2. రైతు వాడే జీవన ఎరువు ప్యాకెట్ ఆ పంటకు సరైనదై వుండవలెను.
3. రసాయన ఎరువులతో కలిపి జీవన ఎరువులు వాడరాదు.
4. రసాయనాలతో విత్తనశుద్ధి చేసుకునేటప్పుడు విధిగా 24-48 గం॥ వ్యవధి వుండవలెను.

జీవన ఎరువుల వాడకం వలన కలిగే ఉపయోగములు :

1. వాతావరణ కాలుష్యంను అరికట్టవచ్చు.
2. హార్మోన్లు, విటమిన్లు మొక్కకు లభ్యమై పెరుగుదల వేగంగాను మరియు ఆరోగ్యకరంగా వుండును.
3. నేల నుండి సంక్రమించే తెగుళ్ళను కొంతమేర అరికట్ట వచ్చును.
4. రైతులకు రసాయన ఎరువుల ఖర్చు తగ్గి లాభాల నిష్పత్తి అధికమగును.
5. సాధారణ దిగుబడులు 20-30 శాతం వరకు పెరుగును.
6. రసాయన ఎరువులను 25 శాతం దాకా తగ్గించుకోవచ్చు.

జీవన ఎరువులు లభ్యమయ్యే కేంద్రం : వ్యవసాయ పరిశోధన స్థానం, అమరావతి, గుంటూరుజిల్లా.

భారీ వర్షాల మరియు వరదల సమయంలో పశుసంరక్షణ, పశుపోషణ

డా॥ యం. భరద్వాజ కృష్ణ, పి.జి. స్కాలర్, డా॥ జి.ఆర్.కె. శర్మ, ఆచార్యులు మరియు విభాగాధిపతి
పశువైద్య విస్తరణ విభాగం, పశువైద్యకళాశాల, తిరుపతి. 9494515813, 8374211765

ప్రస్తుతం కొన్ని రోజులుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాలలో వరద తీవ్రత ఎక్కువగా వుంటుంది. చెరువులు, వంకలు, వాగులు, నదులు పొంగిపొర్లుతున్నాయి. ఇటువంటి విపత్కరమైన పరిస్థితులలో మనుషులతో పాటు పశు సంపదను కూడా కాపాడుకోవాల్సిన అవసరం పాడి రైతులకు ఎంతైన్నా వుంది.

భారీవర్షాలు, వరదల సమయంలో పాడిరైతులు చాలా అప్రమత్తంగా వుండి తమ పశువులను మెరక ప్రాంతాలకు వీలైనంత త్వరగా తరలించాలి. ఇలాంటి సమయంలో పశువులతో పాటు పెంపుడు జంతువులను కూడా బంధించకుండా స్వేచ్ఛగా తిరిగేలా వదిలేయాలి. లేనిచో వరద ఉధృతి నుండి తప్పించుకుపోయే అవకాశం వున్నా, కట్లు తెంచుకోలేక ప్రాణాలు కోల్పోతాయి.



భారీ వర్షాలు ముగిసిన తరువాత పశువులకు అవసరమైన ఎండుమేత, దాణాలను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలి. లేదంటే వర్షానికి తడిచిన మేత, దాణా బూజుపట్టి విష పదార్థాలు పెరిగి వినియోగానికి పనికిరాకుండా పోతాయి.

భారీ వర్షాల కారణంగా వర్షపునీరు మలినాలతో చెరువులను, బావులను కలుషితం చేస్తాయి. సహజంగా పశువులు ఇటువంటి నీటిని త్రాగుటకు ఇష్టపడవు. కాబట్టి తరువాత వాటికి పరిశుభ్రమైన నీరును అందించాలి.

వరదల సమయంలో పశువుల పోషణ :

1) ఆహారకొరత వలన పశువులు తడిసిన ఎండుగడ్డిని సైతం తినడానికి ఇష్టపడతాయి. కానీ అటువంటి ఎండుగడ్డిలో సూక్ష్మ క్రిములు, విషపదార్థాలు వుండే ప్రమాదం ఉన్నందున పశువులు తడిసిన గడ్డిని తినకుండా జాగ్రత్త వహించాలి.

2) రైతుల దగ్గర దాణా వున్నచో వరద ఉధృతి తగ్గేవరకు పశువులను దాణాపై మేపడం శ్రేయస్కరం.

3. వరదల సమయంలో గడ్డికంటే కూడా, గింజలు లేదా చెక్కలు సులభంగా రవాణా చేసుకోవచ్చు. కావున రైతులు వీటిపైన తాత్కాలికంగా పశుపోషణ చేసుకోవడం మంచిది.

4. వరద ఉధృతి తగ్గిన తరువాత కూడా నీరు నిల్వ వుండే ప్రదేశాలలో పశువులను మేతకు వదలకూడదు. పశువులను ఇంటి వద్దనే వుంచి అందుబాటులో వుండే వేరుశనగ తీగలు, ఉలవపొట్టు, కందిపొట్టు, చొప్పలాంటి వాటితో పశుపోషణ చేసుకోవాలి. తడిసిన వరిగడ్డిని వీలైనంత త్వరగా ఆరబెట్టి కాపాడుకోవడానికి ప్రయత్నించాలి లేనిచో పశుగ్రాసం కొరత తీవ్రం కావచ్చు.

తడిసిన గడ్డిని ఎండబెట్టుపద్ధతి :

1. తడిసిన గడ్డిలో 0.5 - 1.1 ఉప్పు కలిపి నిల్వ వుంచడం ద్వారా బూజు ఏర్పడకుండా కొద్దిరోజులు కాపాడుకోవచ్చు.

2. తడిసిన గడ్డి లేదా ధాన్యాన్ని ఇంటిపై కప్పులో తేమ 15% కంటే తక్కువ వచ్చే వరకు ఆరబెట్టుకోవాలి. ఆ తరువాత మాత్రమే పశువులకు గడ్డిగా అందించాలి.



3. కొద్దిగా తడిసిన గడ్డిని 3% యూరియా ద్రావణంతో కలిపి చిన్నగుంతలో పాతర వేసుకోవడం మంచిది.

4. పచ్చికబైర్లు పూర్తిగా నీటిలో మునిగివుండే సమయంలో పశువులకు మేతను అందించే చెట్ల రకాలైన అవిస, సుబాబుల్, గ్లైరిసీడియా వంటి వాటిని మేతగా ఇంటివద్దనే అందించవచ్చు.

వరదల సమయంలో పశువులలో వ్యాప్తి చెందే వ్యాధులు - నివారణ:

వరదల సమయంలో వాతావరణంలోని ఆంత్రాక్స్ చల్లదనం మరియు తేమ కారణంగా వైరస్, బ్యాక్టీరియా తదితర హానికరమైన సూక్ష్మక్రిములు వృద్ధి చెంది పశువులకు ఆంత్రాక్స్, జబ్బవాపు, పచ్చికవామ్మ, కాలిపుండు వ్యాధి, న్యూమోనియా, పొదుగువాపు వంటి ప్రాణాంతక వ్యాధులను కలిగిస్తాయి. కనుక పాడిరైతులు

గాలికుంటు వ్యాధి

డా॥ జి. రాంబాబు, డా॥ టి. శ్రీకాంత్‌రెడ్డి, పశువైద్యాధికారులు, కడప.



☆ పశువులు, గొర్రెలు, మేకలు, పందులు మొదలైన చీలుగిట్ట ఉండే జంతువుల్లో సంక్రమించే వ్యాధులలో గాలికుంటు చాలా ముఖ్యమైన వ్యాధి. ఈ వ్యాధి పికార్నో కుటుంబానికి చెందిన సూక్ష్మమైన అఫ్తోవైరస్ వలన పశువులకు సోకి గాలి మరియు ఇతర మార్గాల ద్వారా అతివేగముగా ఇతర పశువులకు వ్యాపించే ఒకానొక తీవ్రమైన వైరల్ అంటువ్యాధి.

☆ ఈ వ్యాధి సోకడం వల్ల మరణాల శాతం తక్కువగా వున్నప్పటికీ, పశువుల్లో ఉత్పాదక శక్తి తగ్గి తీవ్రమైన ఆర్థిక నష్టం కలుగుతుంది. జబ్బుసోకిన పశువుల పాలు త్రాగి దూడలు మరణిస్తాయి.

☆ ఈ వ్యాధి యుక్త వయస్సులో వున్న పశువుల్లో, వ్యాధి నిరోధకత శక్తి తక్కువగా వున్న పశువుల్లో, దేశవాళి పశువుల కన్నా సంకరజాతి పశువుల్లో ఎక్కువగా సోకుతుంది.

వ్యాధి వ్యాప్తి :

☆ సాధారణంగా వ్యాధి సోకిన పశువులు ఆరోగ్యవంతమయిన పశువులకు దగ్గరగా వుండడము వలన వ్యాధి వ్యాప్తికి కారణమవుతుంది.

☆ ముఖ్యముగా వ్యాధి సోకిన పశువుల ముక్కు ద్వారా బయటకు వదిలే గాలిలో ఎక్కువ మొత్తములో వాయు రూపమైన వైరస్ వుంటుంది. ఈ గాలిని ఆరోగ్యవంతమయిన పశువులు నోటిద్వారా గాని, ముక్కుద్వారా గాని పీల్చినపుడు వ్యాధి సంక్రమణకు కారణమవుతుంది.

☆ అంతేకాకుండా వ్యాధిసోకిన పశువుల నుండి విడుదలయ్యే అంతస్రావాలు మరియు విసర్జకస్రావాలలో వైరస్‌ను కలిగి వుండి వ్యాధికి గురవుతాయి. అలాగే వ్యాధి లక్షణాలు కనబడే 4 రోజులు ముందు వరకు పాలలో, వీర్యంలో కూడా వైరస్ వుంటుంది.

☆ వాయు రూపమైన వైరస్ వాతావరణ పరిస్థితుల మీద ఆధారపడి వ్యాధి వ్యాప్తి వుంటుంది. కాని పాల ద్వారా దూడలకి మరియు పాల ట్యాంకుల ద్వారా వేరే పశువులశాలకు వ్యాధి వ్యాప్తి జరుగుతుంది. అలాగే వ్యాధి సోకిన పశువులు తిన్న గడ్డి ద్వారా, వైద్యపరీక్షల ద్వారా వ్యవసాయ పనిముట్ల ద్వారా కూడా వ్యాధి వ్యాప్తి జరుగును.

☆ ఈ వ్యాధి కలిగించే వైరస్‌లు ఎండకాలంలో ఎండిపోయిన పేడలో అయితే 14 రోజులు, చలికాలములో వుండే పేడలో 6 నెలలు, మూత్రములో 39 రోజులు మరియు మట్టిలో అయితే ఎండాకాలంలో 3 రోజులు, చలికాలంలో అయితే 28 రోజులు బతకగలదు. ☛

తమ పశువులకు, పెంపుడు జంతువుల యజమానులు వాటికి సంబంధించిన వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి.

అధిక పాల దిగుబడినిచ్చే పాడిపశువుల నుండి పాలు పితకడం ఒక్కసారిగా ఆపివేయకూడదు, అలా చేయడం వలన పశువులకు పొదుగువాపు వ్యాధి సోకి శాశ్వతంగా పాడికి పనికి రాకుండా పోయే ప్రమాదం వుంది కాబట్టి జాగ్రత్తగా వ్యవహరించాలి.

భారీవర్షాలు మరియు వరదల కారణంగా పశుసంపదలలో బాహ్య, అంతర పరాన్న జీవుల ఉధృతి పెరిగిపోయి, అవి వ్యాధి గ్రస్తం కాకుండా పశువైద్యులను పాడిరైతులు సంప్రదించి ముందుగానే తగు మందులను వాడుకోవాలి. ఇటువంటి సమయంలో మరణించిన పశువుల వివరాలను కూలిపోయిన పశువుల పాకలు, షెడ్లు వివరాలను స్థానిక పంచాయితీ కార్యదర్శికి లేదా మండలస్థాయి అధికారులకు, పశుసంవర్ధక శాఖ అధికారులకు తెలియజేసి రికార్డు చేయించాలి.

వరదల సమయంలో పశువులు చనిపోయిన యెడల యజమానులు ఆర్థికపరమైన నష్టాలను అధిగమించేందుకు పశువులన్నింటికి "బీమా" చేయించడం ద్వారా పూర్తిస్థాయిలో నష్టపరిహారం పొందవచ్చు. వర్షాలు మరియు వరద సమయంలో పశువులు చనిపోయిన యెడల వాటిని లోతైన గుంతతీసి, సున్నం చల్లి పూడ్చిపెట్టాలి లేదా కాల్చివేయాలి.

ముగింపు :

పశుసంవర్ధక శాఖ అధికారులు భారీ వర్షాలు మరియు వరదల సమయంలో వెంటనే స్పందించి రైతులకు అవగాహన కల్పించడం ద్వారా పశువుల్లో మరణాల సంఖ్యను తగ్గించడానికి వీలౌతుంది. అలాగే రైతుల యొక్క ఆర్థిక స్థితిగతులను మెరుగు పరచవచ్చు. ✧

వ్యాధి లక్షణాలు :

☆ వ్యాధి లక్షణాలు గొర్రెలు, మేకలు కన్నా పశువుల్లో ఎక్కువగా కనిపిస్తాయి.

☆ శరీర ఉష్ణోగ్రత 104F- 106F వరకు వుంటుంది.

☆ నోటిలో చర్మపు పొరలు, పళ్లచిగుళ్ళు, నాలుక, ముట్టెలోపలి ప్రాంతాల్లో, బొబ్బలు ఏర్పడి అవి 24 గంటల్లో చితికిపోవడం వల్ల, పశువులు నొప్పిచేత మేత తినవు. నోటినుండి విపరీతంగా చొంగ, నురుగును కారుస్తుంది.

☆ గిట్టల మధ్య, గిట్టపైన వలయంగా వుండే ప్రాంతంలో బొబ్బలు ఏర్పడి, చితికి, నొప్పివల్ల నడువలేక కుంటుతాయి.

☆ అలాగే పాలిచ్చే పశువులు మరియు చనుమొనలపై కూడా బొబ్బలు ఏర్పడి పొదుగు వాపు కూడా సంభవిస్తుంది.

☆ వ్యాధి సోకిన పశువుల పాలు తాగి దూడలు మరణిస్తాయి. దుక్కిటి పశువులు పనులకు ఉపయోగపడవు.

☆ చూలి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి.

☆ పశువులు రక్తహీనత కలిగి శ్వాసకష్టంగా పీల్చుతూ, రొప్పుతూ, ఎండవేడిమికి తట్టుకోలేక నీరసించిపోతాయి. ఈ పాంటింగ్ లక్షణాలన్నీ ఎక్కువగా సంకరజాతి పశువుల్లో గమనిస్తాము.

వ్యాధి చికిత్స :

☆ వ్యాధి సోకిన పశువులను వేరు చేసి సత్వర చికిత్స చేయించాలి. వైరస్ మందులు పనిచేయవు గనుక వ్యాధి లక్షణాలకు అనుగుణంగా చికిత్స చేయాలి.

☆ నోటిలోని పుండ్లను పొటాషియం పర్మాంగనేటు నీళ్ళల్లో శుభ్రం చేసి, వాటికి బోరోగ్లిజరిన్, యాంటిసెప్టిక్ ఆయింట్మెంట్ పూతగా పూయాలి. అలాగే కాలి పుండ్లకు జింక్ ఆక్సైడ్, లొరాక్సిన్, హిమాక్స్ వంటి ఆయింట్‌మెంట్ పూతగా పూయాలి. ఈగలు వాలకుండా వేపనూనె, లినమెంట్ వంటి వాటిని వాడాలి.

☆ అలాగే నోటిలోని చిగుర్లు మరియు పుండ్ల మీద పొరలు అభివృద్ధికి విటమిన్-సి కలిగివుండే పౌడర్ ఆస్థోకేర్ వంటి వాటిని వాడవలెను.

☆ బాక్టీరియా సంక్రమణ కాకుండా ఎన్రోఫ్లాక్సాసిన్ వంటి మందులు 3-5 రోజులు వాడాలి. ఉపశమనం కోసము మెలోక్సికామ్ మందులు వాడాలి. అలాగే విటమిన్లు, బి-కాంప్లెక్స్‌లతో కూడిన టానిక్‌లను ఇచ్చి వ్యాధి నిరోధక శక్తిని పెంచాలి.

☆ బొబ్బల వల్ల మేత మేయని పశువులకు సులభంగా జీర్ణమయ్యే పోషక పదార్థాలతో కూడిన ఆహారాన్ని అందించాలి. జావ/జొన్న అన్నం, చిటికెడు ఉప్పు, బెల్లంతో కలిపి ప్రతిరోజూ త్రాగించడము ద్వారా బలహీనపడకుండా జాగ్రత్త వహించాలి. బలహీనత తీవ్రంగా వుంటే గ్లూకోజ్ రక్తంలోనికి ఇవ్వాల్సివుంటుంది.

నివారణ :

☆ గాలికుంటు వ్యాధికి చికిత్సలేదు నివారణ మార్గాలపై ముఖ్యంగా శ్రద్ధ వహించాలి.

☆ గాలికుంటు వ్యాధి టీకాలు మొదటికాలు 2 నెలల వయస్సులో, బూస్టర్ డోసు ఒక మాసం తర్వాత చేయించాలి. ఆ తర్వాత చేయించాలి. ఆ తర్వాత ప్రతి సంవత్సరమునకు ఒకసారి క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. టీకాలు వేసిన తర్వాత 2-3 వారాల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొంది సంవత్సరకాలం పనిచేస్తుంది.

☆ వ్యాధిగ్రస్త పశువుల నోటి చొంగలో వైరస్ అధికశాతం వుండి మేత, దాణా, నీరు, మలమూత్రాదుల్లో సంవత్సరం వరకు దాగి వుండి అనుకూల పరిస్థితులలో వ్యాధిని కలుగచేస్తాయి. అందువలన పశువులశాలలను సాధారణ క్రిమిసంహారక మందులతో కాకుండా సోడియం హైడ్రాక్సైడ్, 2% ఫార్మాలిన్, 4% సోడియం కార్బోనేటు వంటి మందులతో శుభ్రం చేయడం వల్ల వైరస్ నశిస్తుంది.

☆ ఆబోతుల, దున్నల వీర్యం ద్వారా కూడా వ్యాపిస్తుంది. కావున 3 నెలల వరకు సంపర్కానికి వినియోగించకూడదు.

☆ దూడలకు అటువంటి పశువుల పాలు తాగకుండా చూడాలి.

☆ కొత్త ప్రాంతాల నుండి అనగా సంత నుండి తెచ్చిన పశువుల్ని మూడు వారాలు విడిగా వుంచి, పరిశీలించి, టీకాలు వేయించి ఆరోగ్యమయిన వాటితో కలువనివ్వాలి.

☆ వ్యాధిగ్రస్థమయిన పశువుల కళేబరాల్ని లోతైన గోయి తీసి అందులో సున్నం వేసి పాతిపెట్టాలి లేదా కాల్చివేయాలి తద్వారా వ్యాధి అరికట్టబడుతుంది.

☆ వ్యాధి నుండి కోలుకున్న పశువుల్లో పాంటింగ్ (రొప్పడం)తో పాటు గర్భస్రావాలు, పొదుగువాపు, వంధ్యత్వం, న్యూమోనియా, రక్తక్షీణత, గిట్టలు పోవడం వంటి దుష్ఫలితాలుంటాయి.

☆ క్రమం తప్పకుండా పశువులకు టీకాలు వేయించాలి. భారతదేశ ప్రభుత్వం వారు పశు సంవర్ధకశాఖ వారి ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణకు గాను ఉచితంగా టీకా పంపిణీ కార్యక్రమము సంవత్సరములో రెండుసార్లు చేయడము జరుగుతున్నది. కావున రైతు సోదరులందరు సమీప పశువైద్యుని సంప్రదించి టీకాలు వేయించుకొని ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించగలరు.

☞ **ఆగస్టు నెల 20వ తేదీ నుండి సెప్టెంబర్ 20వ తేదీ వరకు గాలికుంటువ్యాధి నిరోధక టీకాలు దేశవ్యాప్తంగా వేస్తున్నారు. మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము పశు సంవర్ధక శాఖ తరపున కంప్యూటర్ అప్లికేషను మరియు ఆండ్రాయిడ్ అప్లికేషను తయారు చేసి టీకాలు వేసిన పశువులకు మరియు రైతుల ఆధార్ నంబర్లతో సహా వెబ్‌సైట్ అప్లికేషన్‌లోకి నమోదు చేస్తున్నారు.**

వెబ్‌సైట్ పేరు : www.ahd,aponline.gov.in ✧

రెయిన్‌గన్ - వాటి ఉపయోగాలు

బి. జశ్వంత్ నాయక్, M.Sc. (Ag) Pre., Agricultural Extension,
డా॥ బి. ముకుందరావు, Associant Professor, Agricultural extension
Agricultural Collage, Bapatla

గత కొన్ని సంవత్సరాలుగా వాతావరణంలోని మార్పుల వలన ముఖ్యంగా అనావృష్టి పరిస్థితి ఏర్పడడం వలన మెట్ట ప్రాంతంలో సాగుచేస్తున్న పంటల దిగుబడి గణనీయంగా తగ్గటం కాని రైతులు పంటలు పూర్తిగా కోల్పోవడం జరుగుతోంది.

ఇలాంటి పరిస్థితులలో తక్కువగా వున్న భూగర్భజలాలను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం వాడుకలో వున్న తుంపర బిందుసేద్యం పద్ధతుల వలన అంత సమర్థవంతంగా అనావృష్టి పరిస్థితులలో "రెయిన్‌గన్" వాడటం ద్వారా పంటలను రక్షించుకోవచ్చు. అంతేకాకుండా రెయిన్‌గన్ వాడటం ద్వారా చాలా ఉపయోగాలు వున్నాయి.

☆ తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణం భూమిని తడపగలదు.



☆ పంటల యొక్క సున్నిత దశలలో నీటిని అందించవచ్చు.
☆ పంటకు తగినంత నీటినిఅందిస్తుంది.
☆ అధిక దిగుబడిని పొందవచ్చు.
☆ నాణ్యమైన దిగుబడిని సంపాదించవచ్చు.
☆ పంటకు హాని కలిగించే చీడపురుగుల నుండి నివారించవచ్చు.
☆ నేల కోతకు గురి కావడం జరగదు.
☆ పంటకు కావలసినంత నీటిని అందించవచ్చు. తద్వారా నీటిని ఆదా చేయవచ్చు.
☆ రెయిన్ గన్ వాడటం ద్వారా రైతు కరెంటును ఆదా చేసుకోవచ్చు.
☆ కూలీల ఖర్చు ఆదా చేయవచ్చు. మొదలగు ఉపయోగాలు రెయిన్‌గన్ ద్వారా పొందవచ్చు.

మన రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున రెయిన్‌గన్ వాడుకని ప్రోత్సహిస్తోంది. రైతు మీ-సేవ కేంద్రానికి వెళ్ళి రు.9410 డి.డి. (డిమాండ్ డ్రాఫ్ట్) ద్వారా డబ్బులు చెల్లించినట్లయితే ఒక రెయిన్ గన్ హెడ్, 20 అడుగుల పైపులు 2 1/2 అంగుళాల వ్యాసార్థం గల 25 పైపులను వ్యవసాయ శాఖ ద్వారా సరఫరా చేస్తారు.

పైపులను మోటరుకు అనుసంధానం చేసి ఉపయోగించి నట్లయితే రెయిన్ గన్ చుట్టూ 100 అడుగుల వ్యాసార్థం 4 మి.మీ. భూమి లోతు తడుపుతుంది.

ముఖ్యంగా చిన్నకారు / సన్నకారు రైతులు మెట్ట ప్రాంతాలలో రెయిన్‌గన్ వాడటంద్వారా అనావృష్టినుండి పంటలను రక్షించవచ్చు.

రెయిన్‌గన్ హెడ్ మూడు రకాలు :

1) స్కిప్పర్ హెడ్ :
- ఇందులో పీడనం 2 నుండి 7 కేజి / సెం.మీ. వుంటుంది.
- ఇందులో ఇన్‌లెట్ సైజు 1.5 అంగుళాలు వుంటుంది.
- పూలమొక్కలు, మిరప, టమోట, ఎర్రగడ్డ, చెరుకు వంటి మొదలగు పంటలకు ఉపయోగిస్తారు.
- గంటలకు 13,000 నుండి 30,000 లీ॥ నీటిని విడుదల చేస్తుంది.
- ఇది 27.9 నుండి 63.1 మీ॥ విస్తీర్ణంని తడపగలదు.

ఇందులో నాజిల్ సైజు 12 మి.మీ., 14 మి.మీ. 16 మి.మి., 18 మి.మి.లు కలిగి వుంటాయి.

2) టూబ్లెక్స్ హెడ్ :
- ఇందులో పీడనం 3 నుండి 6 కేజీ / సెం.మీ. వుంటుంది.
- ఇందులో ఇన్‌లెట్ సైజు 2 అంగుళాలు వుంటుంది.
- చెరకు, వేరుశనగ, కూరగాయలు, గడ్డిజాతి మొక్కలు వంటి పంటలకు ఉపయోగిస్తారు.
- గంటకు 20,000 నుండి 36,000 లీ॥ నీటిని విడుదల చేస్తుంది.
- ఇది 110 చదరపు అడుగుల విస్తీర్ణంని తడపగలదు.
- ఇందులో నాజిల్ సైజు 16 మి.మీ, 18 మి.మి., 20 మి.మి.లు కలిగి వుంటాయి.

3) మెరినర్ హెడ్ :
- ఇందులో పీడనం 3.5 నుండి 7 కే.జి./ సెం.మీ. వుంటుంది.
- ఇన్‌లెట్ సైజు 2.5 అంగుళాలు వుంటుంది.
- చెరకు, పసుపు, వేరుశనగ, కాఫీ, టీ, కూరగాయలు మొదలగు పంటలకు ఉపయోగిస్తారు.
- గంటలకు 35,000 నుండి 70,000 లీ॥ నీటిని విడుదల చేస్తుంది.
- ఇది 179 చెదరపు అడుగుల విస్తీర్ణంని తడపగలదు.
- ఇందులో నాజిల్ సైజు 23 మి.మి., 28 మి.మి., 30 మి.మి మరియు 32 మి.మి.లు కలిగి వుంటాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎక్కువగా స్కిప్పర్ హెడ్ రెయిన్ గన్‌లను సరఫరా చేస్తోంది.

- ఈ విధంగా రైతు సోదరులు అందరు, ప్రభుత్వం ఇచ్చినటు వంటి అవకాశాన్ని సద్వినియోగం పరచుకొని తద్వారా పంటలను అనావృష్టి నుండి కాపాడుకోవచ్చు.

"రెయిన్ గన్ వాడండి - అనావృష్టిని తొలగించండి!"

కంది పంటనాశించే తెగుళ్ళు - యాజమాన్యం

ఎల్. ఎన్. హనుమాన్, శాస్త్రవేత్త, (శిలీంధ్రశాస్త్రం), జి. బిందుమాధవి, శాస్త్రవేత్త (శిలీంధ్రశాస్త్రం)
డా॥ శ్రీలక్ష్మి భట్టిప్రోలు, ప్రధాన శాస్త్రవేత్త (శిలీంధ్రశాస్త్రం), డా॥ ఎస్. రాజమణి, సీనియర్ శాస్త్రవేత్త, (ప్లాంట్ బ్రీడింగ్)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానము, లాంఫారం, గుంటూరు - 522 034, ఆంధ్రప్రదేశ్

మన రాష్ట్రంలో పండించే అపరాలలో కంది ప్రధానమైన పంట. మన రాష్ట్రములో కంది విస్తీర్ణము 4.63 లక్షల హెక్టార్లు ఉత్పత్తి 3.02 లక్షల టన్నులు. ఉత్పాదకత 652.27 కిలో/ హె.

కందిపంటను భూమి ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ళు ఎక్కువగా ఆశిస్తాయి. జీవ శిలీంధ్రనాశనులైన ట్రైకోడెర్మా విరిడి లేక సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ భూమిలో కలపటము వలన కంది తెగుళ్ళను సమర్ధవంతంగా అరికట్టవచ్చు.

కంది పంటనాశించే తెగుళ్ళు వాటి లక్షణాలు మరియు యాజమాన్యము గురించి తెలుసుకుందాం.

1) ఎండు తెగులు / వడలు తెగులు

ఈ తెగులు ఫ్యుజేరియం ఉడమ్ అనే శిలీంధ్రం ద్వారా కలుగుతుంది.

లక్షణాలు : కందిపంట పూత, కాయలేర్పడే దశలో ఎండు తెగులు ఆశించిన మొక్కలు చేలో గుంపులు గుంపులు చనిపోతాయి. ఎదిగిన మొక్కలలో కాండం మొదలు నుంచి ప్రారంభమై ఊదారంగు చారలు పై భాగానికి వ్యాప్తి చెందడం ఈ తెగులు ప్రధాన లక్షణము. ఎండిన మొక్కను పీకి కాండము మొదలు భాగము చీల్చి పరిశీలిస్తే గోధుమ వర్ణపు నిలువ చారలు కనిపిస్తాయి. తెగులు ఆశించిన మొక్కలు చనిపోయే ముందు వాటి ఆకులు వాడిపోవడం, ఈనెల మధ్యనున్న ఆకు పసుపు వర్ణముగా మారడం, ఆకులు పూర్తిగా తెల్లబడటం జరుగుతుంది.

వ్యాప్తి : ఈ తెగులు విత్తనాల ద్వారా గాని, భూమిలో నివసించే శిలీంధ్రం ద్వారా గాని, వ్యవసాయ పనిముట్లు ద్వారా గాని మొక్కల నాశిస్తుంది.



సమగ్ర యాజమాన్యము :

★ మారుతి (ఐసిపి 8863), లక్ష్మి (ఐసిపియల్ 85063), దుర్గ (ఐసిపియల్ 84031), ఆష (ఐసిపియల్ 87112, పిఆర్‌జి 100 అనే కంది రకాలు ఈ తెగులుని తట్టుకుంటాయి.

★ దీని నివారణకు తెగులు అధికంగా కనిపించే పొలాల్లో పొగాకు లేక జొన్నతో పంట మార్పిడి చేయాలి. కందిపంటలో జొన్నపంటను మిశ్రమ పంటగా పండించాలి.

విత్తనశుద్ధి : ట్రైకోడెర్మా విరిడిని 10 గ్రాములలో విత్తనానికి పట్టించి విత్తుకోవాలి. లేక 2 గ్రాముల కార్బెండజిమ్ పట్టించి (కిలో విత్తనానికి) విత్తుకోవాలి.

ట్రైకోడెర్మా విరిడిని భూమిలో కలిపే విధానము :

2 కిలోల ట్రైకో డెర్మా విరిడిని పొడి రూపంలో (Talc formulation) తీసుకుని 90 కిలోల పశువుల ఎరువులో 10 కిలోల వేపపిండి కలిపి ఈ మిశ్రమం గోనెసంచీతో కప్పియుంచాలి. ప్రతి మూడు రోజులకొకసారి నీళ్ళు చల్లుతూ, పదిరోజుల తర్వాత ఆకుపచ్చని శిలీంధ్రం పెరుగుదల కనిపించగానే ఈ ఎరువును ఒక ఎకరం పొలంలో చల్లాలి. ఇలా మూడు నాలుగు సార్లు చేయటం వలన ఎండు తెగులును సమర్ధవంతముగా అరికట్ట వచ్చును.

2) వెర్రి తెగులు : (sterclity mosaic Disease)



ఈ తెగులు వైరస్ వలన కలుగుతుంది.

వ్యాప్తి : ఇరియోఫిడ్ నల్లి ద్వారా వ్యాపిస్తుంది.

లక్షణాలు :

★ తెగులు ఆశించిన మొక్క గిడసబారి పోతుంది.

★ ఆకుల మీద ఆకుపచ్చ, పసుపు వర్ణాలు మిళితమై వుండును.

★ ఈ వ్యాధికి గురైన మొక్కలకు పూత, కాత వుండదు.

యాజమాన్యం :

★ వ్యాధి నిరోధక రకాలైన ICPL 87119, BSMR 853 వాటిని వేసుకోవాలి.

★ నల్లి నివారణకు గంధకం పొడిని, నీటిలో కరిగేది 3 గ్రాములు లీటరు నీటిలో కలుపుకొని పిచికారి చేయాలి. వారానికి ఒకసారి



రెండు దఫాలుగా పిచికారి చేయాలి.

★ వ్యాధి సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి.

3) ఫైటోఫ్థార మాడు తెగులు :

★ ఫైటోఫ్థార డ్రెక్స్లెరి పాథాహిర్ కజాని అను శిలీంధ్రం వలన కలుగుతుంది.

★ వర్షం బాగా పడినప్పుడు, అందునా శిలీంధ్రం భూమిలో వున్నప్పుడు మాత్రమే ఆశిస్తుంది. వర్షాలు, గాలిలో తేమ అధికంగా వుంటే ఈ తెగులు ఉధృతి అధికంగా వుంటుంది. రాత్రి, పగలు ఉష్ణోగ్రత 20°C లేదా ఇంతకన్నా తక్కువ వుంటే తెగులు ఉధృతి అధికం.

లక్షణాలు :

★ గోధుమ వర్ణపు మచ్చలు ఆకుల మీద కనిపిస్తాయి.

★ కాండం మరియు కొమ్మలు తెగులు సోకిన ప్రదేశములో విరిగిపోతాయి.

★ ఈ తెగులు ఎక్కువగా నల్లనేలలోకంటే ఎర్ర నేలల్లో కనిపిస్తుంది.


యాజమాన్యం :

★ పొలములో నీరు నిలవకుండా చూడాలి.

విత్తనశుద్ధి :

★ ట్రైకోడెర్మా విరిడి 8 గ్రా/ కిలో మరియు మెటలాక్సిల్ 6 గ్రా కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి.

★పైరుపై లీటరు నీటికి 2 గ్రా రిడొమిల్ యమ్‌జెడ్ మందు కలిపి పిచికారి చేయాలి.



ట్రైకొడెర్మా విరిడిని భూమిలో కలపాలి. ఈ విధానము పైన వివరించబడింది.

4) మాక్రోఫొమినా వేరు కుళ్ళు తెగులు :

మాక్రొఫామిన ఫాసియోలిన అనే శిలీంధ్రం వలన కలుగుతుంది.

లక్షణాలు :

★ మొక్కలు పూర్తిగా ఎండిపోతాయి, అటువంటి మొక్కలు పీకి చూసినచో వాటి వేర్లు కుళ్ళిపోయి బెరడు చీలిపోవడం గమనించ వచ్చు.

★ వేర్లు బెరడు తొలగించి చూసినచో నల్లని స్క్లీరోషియ కనిపిస్తాయి.

★ కాండంపైన నూలుకండె ఆకారం కలిగిన ముదురు గోధుమ రంగు మచ్చలు కనిపిస్తాయి. .

★ కాండం మొదట్లో గంటు ఏర్పడటం ముఖ్య లక్షణము. వీటితో శిలింధ్ర బీజాలు వుంటాయి.


యాజమాన్యం :

★ MRG 66 అను రకము ఈ తెగులును తట్టుకొంటుంది.

★ విత్తన శుద్ధి మరియు నేల శుద్ధి చేసుకోవాలి.

★ ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి మరియు భూమిలో కలిపే విధానము పైన వివరించబడింది.

5) సెర్కొస్పోర్ ఆకుమచ్చ మరియు ఆల్టర్నేరియా ఆకు మాడు గాలి ద్వారా వ్యాపించే తెగుళ్ళు కావున మాంకొజెబ్ 2.5 గ్రా/ లీ/




లేదా కార్బెండజమ్ 1 గ్రా/ లీ కలిపి పిచికారి చేసిన యెడల వీటిని అరికట్టవచ్చును.

6) చివరగా పంట మార్పిడి విధానము అవలంబించాలి, వేసవిలో దుక్కులు లోతు చేసుకోవాలి. విత్తన శుద్ధి పాటించాలి. జీవ శిలీంధ్ర నాశికలను ఉపయోగించుకోవాలి. ధృవీకరించిన విత్తనము వాడాలి.

గమనిక : ట్రైకోడెర్మా విరిడి మరియు సూడోమొనాస్ ఫ్లొరెసెన్స్‌లను జీవ సంబంధ శిలీంధ్రనాశనులను వ్యవసాయశాఖ వారు ప్రతి జిల్లాలో బయోకంట్రోల్ లాబ్‌లో ఉత్పత్తిచేసి, తక్కువ ధరకే రైతులకు అందిస్తున్నారు.

ప్రత్తిసాగులో ప్రత్యేక సూచనలు



యన్.వి.యస్. వర్మ
వ్యవసాయ సహాయ సంచాలకులు (రిటైర్డ్)
నరసాపురం

భారతదేశంలో ప్రత్తి సాగుకు ముఖ్యంగా అయిదు రకాలు సాగు చేయబడుచున్నది.

అవి : దేశవాళీ రకాలు
అమెరికన్ సూదిరకాలు
స్వజాతి సంకరరకాలు
బిన్నజాతి రకాలు మరియు
బిటి ప్రత్తి రకాలు అని చెప్ప వచ్చును.

దేశవాళీ రకాలలో ముఖ్యమైనవి శ్రీశైలం, అరవింద, మహానంది, సరస్వతి, జయధర్ మరియు రాఘవేంద్ర వంటివి.

భారతదేశంలో ప్రత్తిసాగు విస్తీర్ణము 2014-15 సంవత్సరాలలో 3.54 కోట్ల బేళ్ళ ఉత్పత్తి కాగా 2015-16 సంవత్సరంలో. 3.35 కోట్ల బేళ్ళకు పడిపోయింది.

జాతీయ వార్షిక నివేదిక ప్రకారం 2014-15 సంవత్సరంలో దేశవ్యాప్తంగా కరువు పరిస్థితులు ఏర్పడటం వలన ప్రత్తి దిగుబడితో బాటు, ఇతర ఆహారధాన్యాల ఉత్పత్తి బాగా పడిపోయినట్లు జాతీయ వార్షిక నివేదిక తెలియజేయుచున్నది. దేశవ్యాప్తంగా ప్రత్తి దిగుబడి తగ్గడానికి కొన్ని కారణాలు.

వాతావరణ పరిస్థితులు, సాగుచేయు నేలలు, అందుబాటులో ఉన్న రకములు, నీటితడులు, సస్యరక్షణ మరియు అంతరపంటల సాగు కొన్ని కారణాలుగా చెప్పవచ్చును.

నేలలు :

ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో వివిధ రకాల నేలలో ప్రత్తిమొక్కలు ఉపయోగించు ముఖ్యమైన రకములు ఈ విధంగా వుంటాయి అని పరిశోధనలు తెలియజేయుచున్నవి.

	హెక్టారుకు కిలోలు		
నేల స్వభావము	నత్రజని	భాస్వరం	పొటాష్
లోతైన నల్లరేగడి నేలలు	55	20	57
మధ్యరకము నేలలు	44	13	43
తేలికరకము ఇసుక నేలలు	44	12	45

ప్రత్తిసాగుకు ఎర్రనేలలలో దిగుబడి తగ్గడానికి కారణాలు : ఎర్రనేలలలో లోతు తక్కువగా వుండి సేంద్రియ పదార్థములు తక్కువగా అందుబాటులో వుంటుంది.

సేంద్రియ నిలువలు తక్కువ మోతాదులో అందుబాటులో వుంచటం వలన వివిధ పోషకములు తేమను పట్టి వుంచుకునే సామర్థ్యములు చాలా తక్కువగా వుంటాయి. అందువలన నీటితడులు తరచుగా ఇవ్వవలసి వుంటుంది.


ప్రత్తిమొక్కలకు వేరు వ్యవస్థ లోతుగా విస్తరించి వుంటుంది. ఇది భూమి లోపలి పొరలనుండి తేమను గ్రహించ గలుగుతుంది. కొన్ని ఎర్రనేలలో లోతు తక్కువగా వుండటం వలన భూమిలోపలి పొరల నుండి పోషకాలను, మరియు తేమను పూర్తిస్థాయిలో గ్రహించే అవకాశం వుండదు. వేరు వ్యవస్థ లోతుగా విస్తరించు అవకాశం చాలా తక్కువగా వుంటుంది. అందువలన ప్రత్తి దిగుబడి తగ్గడానికి పరోక్షంగా కారణమవు చున్నది. ఎర్రనేలలో ప్రత్తి సాగు చేయదలచినపుడు వీలైనంత వరకూ స్వల్పకాలిక రకాలను ఎంపిక చేసుకోవాలి.

నీటితడులు :

వివిధ రకాల భూములలో ప్రత్తి సాగు చేయదలచిపుడు సాగు ప్రత్తిరకము భూమిలో అందుబాటులో వున్న తేమ శాతాన్ని బట్టి నీటితడినివ్వవలసి వుంటుంది. పూత సమయంలో ఒక నీటితడి తప్పనిసరిగా ఇవ్వవలసి వుంటుంది. పూత మొదలైన తరువాత కాయలు ఏర్పడే దశలో కనీసం రెండు నీటితడులనివ్వాలి. కాయలు ఏర్పడిన తరువాత కోతకు తయారయ్యే సమయానికి మధ్యలో మూడు నీటి తడులనివ్వాలి.

నీటితడినిచ్చిన తరువాత మొక్కల మధ్య నీరు నిలువ వుండ రాదు. ముఖ్యంగా నీటిపారుదల క్రింద ప్రత్తిసాగు చేయు నపుడు 15 రోజులకు ఒకసారి ఇవ్వాలి.

నీటి పారుదల క్రింద ప్రత్తిరకములు సాగుచేయ దలచినపుడు నీరు అందుబాటులో లేని పరిస్థితు లలో ప్రత్యామ్నాయంగా వరుస విడిచి వరుసల



మధ్య నీటి తడి నివ్వాలి. నీటి తడులు రోజు విడిచి రోజులో ఒకసారి నివ్వాలి.

నీరు అందుబాటులో వుండి ప్రత్తిసాగు చేయదలచినపుడు స్ప్రింక్లర్లు లేదా డ్రిప్ పద్ధతి ద్వారా నీరు అందుబాటులో వుండేటట్లు చేయడం వలన నీరు సుమారు 85 శాతం వరకూ ఆదా అవుతుం దని పరిశోధనలు తెలియజేయుచున్నవి.

ఇసుక నేలలు లేదా తేలిక భూములు ప్రత్తిసాగు చేయునపుడు బోదెలు మరియు కాలువలు ఏర్పరచినపుడు అనుకూలంగా వుంటుంది. వరుస విడిచి వరుసలలో నీరు పెట్టడం కన్నా జంట వరుసలలో ప్రత్తి సాగుచేసినపుడు వరుసలలో నీటితడుల నిచ్చి నపుడు కూడా నీరు సుమారు 30 శాతం వరకూ ఆదా అవుతుంది.

ప్రత్తి మొక్కలకు డ్రిప్ పద్ధతిలో నీటి తడుల నివ్వడం వలన, నీరు 27 శాతం వరకూ ఆదా అవుతుంది మరియు దిగుబడి 27 శాతం వరకూ పెరుగుతుందని ఐయన్‌సిఐడి (1994) తమ పరిశోధ నల ద్వారా తెలియజేశారు.

కోత :

ప్రత్తి కోతలు పూర్తి అయిన తరువాత మోళ్ళను తొలగించి తగులబెట్టాలి. లేనప్పుడు మోళ్ళు చిగురించి పురుగుల ఉధృతి పెరుగుతుంది. ప్రత్తిని ఉదయంపూట గాని, సాయంత్రం పూట గాని చల్లని వాతావరణ పరిస్థితులలో కోతలు చేయడం వలన దిగుబడి బాగుంటుంది.

సస్యరక్షణ :

పుండరీకాంక్షులు అను శాస్త్రవేత్త 1992వ సం॥లో ప్రత్తి మొక్కలపై కొన్ని రకాల పురుగులు ఆశించినపుడు అమృతజల పిచికారి చేసి కొంతవరకూ నివారించవచ్చునని తన పరిశోధనలో తెలియజేయుచున్నారు.

అమృత జలం తయారు చేయు పద్ధతి :

ఆవు పేడ	4 కిలోలు
ఆవు మూత్రం	15 లీటర్లు
ఆవు నెయ్యి	250 గ్రా॥
బెల్లం	5 కిలోలు

200 లీటర్ల నీటితో కలిపి 7 రోజుల పాటు నిలువ వుంచవలసి వుంటుంది. తన పరిశోధనలో తెలియజేయుచున్నారు. పై మిశ్ర మాన్ని సిమెంటు గోతాలలో నిలువ వుంచడం వలన మంచి ఫలితం వుంటుంది. ప్లాస్టిక్ డ్రమ్ములు, అల్యూమినియం డ్రమ్ములలో నిలువ వుంచరాదు అని తెలియజేయుచున్నారు.

ఎనిమిదవ రోజున ప్రత్తి విత్తనాలు నాటు సమయంలో ఒక హెక్టారు విస్తీర్ణములో పిచికారి చేయడం వలన మంచి ఫలితం వుంటుంది. తరువాత ప్రత్తి విత్తనాలను వరుసలలో నాటుకోవాలి.

విత్తనాలు నాటు సమయంలో భూమిలో తగినంత తేమ అందుబాటులో వుండేటట్లు జాగ్రత్తపడాలి.

ప్రత్తిసాగులో పురుగులు మరియు తెగుళ్ళ నివారణ పద్ధతులు :

ప్రత్తి సాగు చేయదలచినపుడు ఎరపంటలు ప్రత్తి పొలం గట్లపై సాగుచేయవలసి వుంటుంది. పొలంగట్లపై బంతిమొక్కలను ఎర పంటగా సాగుచేసినపుడు ప్రత్తి మొక్కలపై కాయ తొలుచు పురుగు లను కొంతవరకూ నియంత్రించవచ్చును.

ప్రత్తిసాగు చేసిన పొలంగట్లపై లేదా పొలంచుట్టూ నాలుగు వరుసలలో జొన్న లేదా మొక్కజొన్న పంటలను విత్తుకోవాలి ప్రతి ఎకరానికి పొలంగట్లపై బంతిమొక్కలు 100 లేదా ఆముదం మొక్కలు 50 చేను చుట్టూ పెంచుకోవాలి.

ప్రత్తి సాగు చేసిన పొలంలో అంతరపంటలుగా వరుసలలో అలసంద, కర్ర లేదా గోరుచిక్కుడు సాగు చేయవచ్చును.

ప్రత్తిసాగు చేసిన పొలంలో గట్లపై ప్రతి ఎకరానికి 100 ఆముదం మొక్కలను గట్లపై సాగుచేసినపుడు పొగాకు లద్దె పురుగులను నియంత్రించవచ్చును.

ప్రత్తి విత్తనాలు నాటుటకు ముందు పెసర, మినుము, అలసంద వరుసల మధ్య నాటుకోవాలి. ప్రత్తి మొక్కల పెరుగుదల తొలిదశలో తక్కువగా వుంటుంది. దీనివలన అంతరపంటల సాగు చేయడం వలనా పోషకపరంగా ఎటువంటి నష్టము కలుగదు.

పప్పుజాతి పంటలు తక్కువకాలంలో పూతకు వస్తాయి. పంటలకు మేలు చేసే కీటకాలు వాటిని ఆకర్షిస్తాయి. వాటిపై చేరిన మిత్రపురుగులు ప్రత్తికి హానిచేసే పురుగుల గుడ్లను మరియు లార్వా దశలోనే తినివేస్తాయి. కీటకాలలో పరాన్నభుక్కులుగా వుండే కందిరీగలు, అక్షింతల పురుగుల వంటివి ప్రత్తి మొక్కలను ఆశించే శనగపచ్చ పురుగులు మరియు లద్దె పురుగులను తినివేస్తాయి.

ప్రత్యేక సూచనలు :


ప్రత్తిసాగు చేయదలచిన రైతులు సరైన అవగాహనాలోపం వలన సరైన యాజమాన్య పద్ధతులు సకాలంలో పాటించలేకపోవు చున్నారు. మరియు గిట్టుబాటు ధర పొందలేకపోవుచున్నారు. దీనిని అధిగమించడానికి ఎండలు ఎక్కువగా వున్న సమయంలో ప్రత్తి కాయలు కోయరాదు. ప్రత్తి కాయలను చల్లని వాతావరణం వున్నప్పుడు ఉదయం పూటగాని, సాయంత్రం పూటగాని కోయడం వలన దిగుబడి మరియు నాణ్యత బాగుంటుంది.

వాతావరణ పరిస్థితులు ప్రత్తిసాగుకు అనుకూలంగా లేనపుడు హైబ్రిడ్ ప్రత్తి విత్తనాలు సాగు చేయడం తగ్గించి సమస్యలను అధిగమించే వంగడాలు సాగుకు ఎంపిక చేసి నాటుకోవాలి. అధిక దిగుబడినిచ్చే సాధారణ ప్రత్తి రకాలలో ముఖ్యమైనవి నరసింహా, యమ్‌సియు-5, యల్‌కె 861, యల్‌ఆర్‌ఎ 5166 వంటివి సాధారణ ప్రత్తిరకాలు హైబ్రిడ్ రకాల కన్నా వర్షాభావ పరిస్థితులు మరియు చీడపీడల తాకిడిని సమర్థవంతంగా తట్టుకుంటాయి. పెట్టుబడి ఖర్చులు కొంతవరకూ తక్కువగా వుంటాయి. నరసింహ అను ప్రత్తి రకము (ఎన్‌ఎ 1325) కాలపరిమితి 160 రోజులు మరియు దిగుబడి హెక్టారుకు సుమారు 27 క్వింటాళ్ళు వుంటుంది. .

యమ్‌సియు 5 అను ప్రత్తిరకము కాలపరిమితి 190 రోజులు మరియు దిగుబడి 25 క్వింటాళ్ళు వుంటుంది. ఈ రకం ప్రత్తిలో నూగు వున్నందున పచ్చదోమల ఉధృతిని తట్టుకుంటుంది. ✧

జన్యుమార్పిడి ఆవాల సాగుకు అనుమతి

ప్రజారోగ్యానికి పర్యావరణానికి హానికరం



డా॥ సోమసుందర్ మర్ల
ప్రధాన శాస్త్రవేత్త ఐ.సి.ఎ.ఆర్.
న్యూఢిల్లీ

ఇప్పటివరకు బీటీ ప్రత్తితో పరిమితమైన జన్యు మార్పిడి పంటల సాగు ఇటీవల ఢిల్లీ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు రూపొందించిన డి.హెచ్.ఎమ్.11 హైబ్రీడు ఆవాల వంటలకు జెనిటిక్ ఇంజనీరింగ్ అప్రూవల్ కమిటీ (జి.ఇ.ఎ.సి) ఇవ్వనున్న అనుమతితో ఆహారపంటలకు సైతం విస్తరించనున్నది.

వ్యవసాయ పరిశోధనల్లో సాంప్రదాయ బ్రీడింగ్ ప్రక్రియకు భిన్నంగా హెటిరోసిస్ అనే జన్యు ప్రక్రియనుపయోగించి రూపొందించిన హైబ్రీడ్లతో అధిక దిగుబడి లభిస్తుంది. మొక్కజొన్న, టమాటో, పుచ్చ వంటి పంటల్లో హైబ్రిడ్లు ఈ పంటల సాగులో అధికోత్పత్తికి తోడ్పడ్డాయి. ఢిల్లీ విశ్వవిద్యాలయం రూపొందించిన డిహెచ్.ఎం.11 ఆవ హైబ్రీడు కూడా ఈ కోవకు చెందినదే. ప్రస్తుతం దేశంలో తీవ్రమైన వంటనూనెల కొరత వుంది. దాదాపు 65వేల కోట్ల (10 బిలియన్ డాలర్ల) రూపాయల వ్యయంతో 14 మిలియన్ టన్నుల వంటనూనెలు దిగుమతి చేసుకొంటున్నాము. దేశంలో నూనెగింజల ఉత్పత్తిని పెంచే శాస్త్ర పరిశోధనలను తప్పక ప్రోత్సహించాలి. కానీ సమస్యల్లో డి.హెచ్.ఎం.11 ఆవాల హైబ్రీడ్ రూపకల్పనంలో వినియోగించిన విషపూరిత జన్యువులు, సాగులో కలుపు నివారణ రసాయనాల వినియోగాన్ని గణనీయంగా పెంచే ప్రమాదం వుంది. కాగా ఆవ హైబ్రీడులో వినియోగించిన హానికర జన్యువులు, ప్రజారోగ్యానికి, పర్యావరణానికి కలిగే దుష్పరిమాణాలపై కొందరు శాస్త్రజ్ఞుల్లోను, మేధావులు, ప్రజానీకంలోను అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సహజంగా ఆడ, మగ పుష్పభాగాలను కలిగిన స్వపరాగ సంపర్క లక్షణాలున్న మొక్కల్లో పుప్పొడిని నిర్వీర్యం చేసి (వంధ్యత్వం) ఆడపుష్పభాగాల్ని మేలైన ఇంకొక మొక్కతో సంకరణం చేసి "హెటిరోసిస్" జన్యు ప్రక్రియ ద్వారా అధికోత్పత్తినిచ్చే హైబ్రీడ్లను రూపొందిస్తారు. సాంప్రదాయ బ్రీడింగ్ పద్ధతిలో నుపయోగించి సైటో ప్లాస్మిక్ మగ రకాలు (సి.ఎం.ఎస్), రిస్టోరర్ రకాలకు బదులుగా మగపుప్పొడిలో "వంధ్యత్వం" కలిగించటానికి, తిరిగి హైబ్రీడ్ విత్తనాల ఫలదీకరణకు బ్యాక్టీరియా నుండి సేకరించిన "బార్నేస్", "బార్‌స్టార్" మరియు "బార్" అనే డయాగ్నస్టిక్ మార్కరు జన్యువులు ఉపయోగింపబడినవి. సాధారణ వంగడాలు రైతులు పంటకోత అనంతరం భద్రపరచుకొని వచ్చే సీజన్‌లో సాగుకు వినియోగిస్తారు. ఒక సాగు సీజన్‌కే అధికోత్పత్తినిస్తాయి. ఈ కారణంగా రైతులు ప్రతీ సంవత్సరం మార్కెట్‌లో హైబ్రీడు విత్తనాలు కొని సాగు చెయ్యాలి. ఈ కారణంగానే సాధారణ వంగడాల ఉత్పత్తి, మార్కెటింగ్ కంటె హైబ్రీడ్లుపై ప్రైవేటు విత్తన కంపెనీలు, బహుళజాతి సంస్థలు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నాయి.

జన్యుమార్పిడి ఆవ హైబ్రీడు రూపకల్పనలో వినియోగించిన బ్యాక్టీరియా జన్యువులు గ్లూకోసినేటు, గ్లైఫోసేట్ వంటి కలుపు నివారణ రసాయనాల నిరోధక శక్తి కలిగి వుంటాయి. ఈ కారణంగా పొలంలో కలుపు నివారణ రసాయనాలను హెచ్చుమోతాదుల్లో స్ప్రే చేసినా ఆవ పంట దెబ్బతినదు, ఇతర కలుపు మొక్కలన్నీ సంహరింపబడ్తాయి. ఈ కారణంగానే ఈ జన్యు మార్పిడి ఆవ హైబ్రీడు సాగులో కలుపు నివారణకు ప్రముఖ బహుళజాతి కంపెనీ ఉత్పత్తి చేసిన "బాస్తా" అనే కలుపు మందును తప్పనిసరిగా అధిక మోతాదుల్లో స్ప్రే చేయాలి. మనం నిత్యం సేవించే పళ్ళు, కూరగాయలు తదితర ఆహారం ద్వారా పొలాల్లో స్ప్రే చేసిన రసాయనాల అవశేషాలు శరీరంలో చేరి, క్రమంగా పేరుకుపోయి, గ్లైఫోసేట్, గ్లూకోసినేట్, ఆర్గనోఫాస్ఫేట్లు, సింథటిక్, పెరిత్రాయిడ్లు కేన్సరు, పార్కిన్‌సన్ తదితర వ్యాధులకు కారణమవుతున్నాయి. కనుకనే సాగులో ఈ రసాయనాల వినియోగాన్ని తగ్గించుకోవాలని, ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని రక్షించుకోవాలని శాస్త్రజ్ఞులు, వివిధ వైద్య సంఘాలు, ఐ.రా.స. తదితర సంస్థలు ఉద్ఘాటిస్తున్నాయి. ఆవ నూనెను, మొక్కల ఆకుల్ని ఉత్తరభారతంలోని పంజాబ్, యు.పి, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ఆహారంలో విరివిగా వినియోగిస్తారు. కేవలం పంజాబ్‌లోని భటెండా నుండి పొరుగు రాష్ట్రంలోని బికనీరుకు నిత్యం ఒక రైలు చేరవేస్తుంది. వందలమంది పంజాబ్ గ్రామీణ ప్రాపంతాల్లోని కేన్సరు పేషంట్లను వైద్య నిమిత్తం తీసుకెళ్ళే ఈ రైలుకు మరో పేరు కేన్సరు రైలు. హరిత విప్లవక్రమంలో విరివిగా (మితిమీరిన) వినియోగింపబడిన కీటకనాశక రసాయనాల దుష్పరిణామాలకు ఈ ఒక్క ఉదాహరణ చాలు.

బీటీ ప్రత్తినుండి జన్యుమార్పిడి అనే హైబ్రీడు వరకు రూపకల్పనలో "కన్నామైసిన్", రిఫ్లాపసిలిన్' వగైరా యాంటీ బయాటిక్ జన్యువులను విరివిగా ఉపయోగిస్తారు. ఇవి ఆహారం ద్వారా శరీరంలో చేరి ఉదరంలోని బ్యాక్టీరియాలో ఉత్పరివర్తనాలను కలిగించి (మ్యూటేషన్సు) యాంటీబయాటిక్ నిరోధకశక్తిని పెంపొందిస్తున్నది. ఈనాడు వైద్యులకు యాంటీబయాటిక్ నిరోధకత ఒక పెద్ద సమస్యగా మారింది.

ఆవ, మొక్కజొన్న, వరి, సోయా చిక్కుడు, వంటి జన్యు పరివర్తన పంటల్లో కలుపు నివారణ, క్రిమి సంహారక రసాయనాలకు సంబంధించిన జన్యువులు వుండటం వలన బహుళజాతి సంస్థలకు

అటు జన్యుమార్పిడి విత్తనాలు, ఇటు అధికంగా కలుపు, కీటక నివారణ, రసాయనాల అమ్మకాలను ఏకకాలంలో భారత్ వంటి వర్ధమాన దేశాల్లో మార్కెటింగ్ చేసుకోవడానికి అవకాశం చిక్కింది. కొన్ని రోజులక్రితమే మోన్‌సాంటో విత్తన కంపెనీని మరొక ప్రముఖ వ్యవసాయ రసాయనాల ఉత్పత్తి బహుళజాతి సంస్థ 66 బిలియన్ డాలర్లు వెచ్చించి కొనివేసింది. ఈ కంపెనీకి ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా విత్తనాలు, పురుగు మందులు, కలుపుమందుల మార్కెటింగ్‌లో 35 శాతం వాటా ఉన్నదంటే, ఈ కంపెనీలకు ప్రజల ఆరోగ్యం, పర్యావరణం కంటే అధిక లాభాలను తెచ్చే వ్యవసాయ రసాయనాల వ్యాపారమే ప్రియం.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 180 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో జన్యుమార్పిడి పంటలు సాగవుతున్నాయి. వీటిలో 90శాతం కలుపు నివారణ రసాయనాలను తట్టుకొనే మొక్కజొన్న, ప్రత్తి, సోయా చిక్కుడు పంటలే. సాలీనా జన్యుమార్పిడి విత్తనాల, వ్యవసాయ రసాయనాల వ్యాపారం 100 బిలియన్ డాలర్లకు మించి వుంది. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి కలుగు ముప్పు కారణంగా అభివృద్ధి చెందిన కెనడా, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో జన్యు మార్పిడి పంటల సాగు సాలీనా 4 నుండి 7 శాతం తగ్గుతూ వస్తోంది. గత 20 సంవత్సరాలుగా జన్యు మార్పిడి పంటలపై పరిశోధనలు సైతం జరగటం లేదు. కాగా ఈ పంటలను భారత్, చైనా, ఇండోనేషియా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలపై రుద్ది వదిలించుకోవాలని, మార్కెట్లను కాపాడుకోవాలని ప్రయత్ని స్తున్నాయి. ఈ కారణంగానే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో జన్యుమార్పిడి పంటల సాగు ఇటీవల ఊపందుకున్నది.

మితిమీరిన కలుపు నివారణ మందుల వినియోగంతో పొలాల్లో గ్లైఫొనేట్, గ్లూకోసినేట్ వంటి వానికి తట్టుకొని నిరోధక శక్తి కలిగిన కొత్త (సూపరు) కలుపు ప్రత్యక్షమవుతోంది. అమెరికాలోని అర్కాన్‌సాస్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త జాసన్ నోస్‌కర్త్ అధ్యయనం ప్రకారం హెర్బిసైడ్లను తట్టుకొనే 217 రకాల కలుపు మొక్కలు కొత్తగా ప్రత్యక్షమయ్యాయి. ఈ కలుపు నివారణకు ఏ విధమైన హెర్బిసైడ్లు లేవు. కలుపు మొక్కల్లో గ్లైఫోసేటు వంటి హెర్బిసైడ్లు క్రియాశీలతకు మూలమైన "ఇ.పి.ఎస్.పి.ఎస్" జన్యువు ఉత్పరివర్త నాలు (మ్యుటేషన్) "ప్రో 106 సెర్" లేదా "టిప్స్" సంభవించి హెర్బిసైడ్లను తట్టుకొనే మొండి కలుపుగా మారిపోయాయి.

మన దేశం వంగ, ఆవాలు, పనస, మామిడి, వరి తదితర పంటలకు పుట్టినిల్లు. ఈ మొక్కల్లో ఎంతోజన్ వైవిధ్యం వుంది. బాక్టీరియా వంటి ఇతర జీవుల నుండి సేకరించిన జన్యువులు జన్యుమార్పిడి పంటల నుండి దేశీపంటలపై పరపరాగ సంపర్కం ద్వారా పుప్పొడి ద్వారా చేరి కలుషితం చేసే ప్రమాదం వున్నది. దీని కారణంగా బంగాళాదుంప, మొక్కజొన్నల ఆవిర్భావానికి పుట్టినిల్లయిన పెరూ, మెక్సికో దేశాలు ఈ పంటల్లో జన్యుమార్పిడి పంటల సాగును నిషేధించటం గమనార్హం. ఈ కారణంగానే గత ప్రభుత్వ హయాంలోని శ్రీబాసుదేవ భట్టాచార్య అధ్యక్షతన నున్న పార్లమెంటరీ కమిటీ, సుప్రీం ధర్మాసనం జన్యుపరివర్తన పంటల సాగు వలన కలిగే ఆరోగ్య, పర్యావరణ సమస్యల పరిశోధనల నుండి పూర్తి సమాచారం లభించేవరకు తొందరపడక, ఈ పంటల సాగును విరమించుకోవాలని కోరటం గమనార్హం.

డి.హెచ్.ఎం. 11 ఆవ హైబ్రీడు సాగులో ఉత్పన్నమయ్యే పర్యావరణం, ఆరోగ్య సమస్యలను విశ్లేషించటానికి భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐ.సి.ఎ.ఆర్) పర్యవేక్షణలో వివిధ వ్యవసాయ క్షేత్రాల్లో రెండు దశల్లో గత 4 సంవత్సరాలుగా భద్రతా పరీక్షలు జరిగాయి. అదే సమయంలో ప్రస్తుతం సాగులో నున్న స్థానిక ఆవ వంగడంతో పోల్చి డి.హెచ్.ఎం. 11 హైబ్రీడుకున్న దిగుబడి సామర్థ్యం కూడా పరిశీలింపబడింది. ఈ హైబ్రీడు రూపకర్త డా॥ దీపక్‌పెంటల్ తమ హైబ్రీడును ఇతర వంగడాలతో పోల్చితే 37 శాతం అధికంగా దిగుబడినిస్తుందని చెప్పుకొచ్చేరు. కాగా బాగా అణు పరిశోధనా సంస్థ శాస్త్రజ్ఞుడు, నాగపూర్ సమీపంలోని అకోలా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆవపంట సలహాదారు డా॥ ఎన్.ఇ. పావెల్ ప్రకారం, నిర్వహింపబడిన 6 క్షేత్ర పరీక్షల్లో నాలుగిట్లో జన్యు పరివర్తన ఆవ హైబ్రీడు కంటె స్థానికంగా సాగులో నున్న ఆవ వంగడాలు 28 శాతం అధిక దిగుబడినిచ్చేయి. అదేవిధంగా న్యూఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా స్థానపు క్షేత్రపరీక్షల్లో (2015వ సం॥ రబీ సీజనులో) డి.హెచ్.ఎమ్. 11 హైబ్రీడు దిగుబడి కేవలం 7.5 శాతానికి మించి (స్థానిక ఆవ రకాలపై) లేదని బ్రీడర్లు వెల్లడిస్తున్నారు. అదేవిధంగా జన్యుమార్పిడి ఆవాలు మేతగా పెట్టిన ఎలుకల్లో ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కానందున కలుపు రసాయనాలతో ముడిపడి ఉన్నా జన్యువులు కలిగిన ఆవ హైబ్రీడు మానవ ఆరోగ్యానికి ఎటువంటి హానికరం కాదని తేల్చి చెప్పడం కూడా ప్రశ్నార్థకమే. గ్లైఫోసేటు, పురుగుమందులు కేన్సరు తదితర ప్రాణాంతక వ్యాధులకు కారకాలని అందరికీ తెల్సినదే. అట్లాంటి పరిస్థితుల్లో ఆహార భద్రతపై లభించిన అనుమతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బహుశా పరీక్షలకు పంపబడిన ఆవ మొక్కల సేంపిలు స్వచ్ఛత, నిబద్ధతపై అనుమానాలు వ్యక్త మవుతున్నాయి.

వైద్యరంగంలో, వివిధ డి.ఎన్.ఎ. మందులు, వ్యాక్సిన్లు తయారీ వలె బయోటెక్నాలజీ వ్యవసాయ పరిశోధనల్లో ఎన్నో విప్లవాత్మక మార్పులకు తోడ్పడుతున్నది. ప్రస్తుతం వరిలో అగ్గి తెగులు, ఎండ్లాకు తెగులు, అనేక మొక్కజొన్న రకాలు జీనోమ్ సీక్వెన్సింగ్, మాలిక్యులర్ బ్రీడింగ్ ప్రక్రియల ద్వారా రైతులకు వివిధ ప్రభుత్వ పరిశోధనా సంస్థల నుండి అందుబాటులోకి తెచ్చినవి. వ్యాసకర్త సైతం ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా మండలిలో జీనోమ్ సీక్వెన్సింగ్ ద్వారా బయోటెక్నాలజీ నుపయో గించి నూతన పంట రకాల అభివృద్ధిలో కృషి చేస్తున్నారు. మొక్కల పరిశోధనల్లో జన్యుమార్పిడి ప్రక్రియ ఎంతో ఉపయోగకరం,

కూరగాయ పంటల్లు - అనువైన వంగడాలు

(గత సంచిక తరువాయి)

క్యాబేజి

ఓ.పి. రకాలు :

1. గోల్డెన్ ఎకర్ : గడ్డగట్టి, గుండ్రన, ఆకులు డొప్ప ఆకారం, 60-65 రో॥ సెప్టెంబర్ 2 వారం సాగుకు అనువైనవి.

2. ప్రయిడ్ ఆఫ్ఇండియా : గడ్డలు గుండ్రన, 1.5-2.0 కిలోల బరువు, 60-80 రో॥.

3. ఎర్లీ డ్రమ్‌హెడ్ : గడ్డచదును, పెద్దది, 60-70 రో॥

4. పరిరాణిగోల్, గణేశ్‌గోల్ : హైబ్రిడ్‌లు, గట్టిగడ్డ, నిల్వ వుండే రకం 85-90 రో॥.

5. లేట్‌డ్రమ్ హెడ్ : గడ్డపెద్దవి, గట్టివి, గుండ్రన 100-120 రో॥

6. పూసాడ్రమ్ హెడ్ : గడ్డగట్టి, చదును, నల్లకుళ్ళును తట్టుకొనును,. 85-90 రోజులు

7. హస్తాముక్త (సెలెక్షన్ 8) - గడ్డలు గట్టి, చదును, పెద్దది 1.5-2.0 కిలోలు. నల్లకుళ్ళును తట్టుకొనును. 80-90రో॥

ప్రైవేటు రకాలు :

మహీకో హరిరాణి, మహారాణి, ఈస్ట్‌వెస్ట్ ఆకాంక్ష, ఇండో అమెరికన్ క్రిష్ణ, గోల్డెన్‌భీమ, నన్‌హెమ్స్ బహార్, సహజ సహజ, నూజివీడు ప్రభాత్, నాంధారి ఎన్.ఎస్.35, 220, కలాస్ బ్రోంకో.

కాలీఫ్లవర్

ఓ.పి. రకాలు :

స్వల్పకాలిక రకాలు :

1. పూసాదివాలి : పూసాకట్కి, పూసా ధవల్ - పువ్వులు గట్టి, ముద్ద, తెలుపు, చిన్నసైజు, ఆకులు నీలం రంగు, వొంపులేకుండా వుంటాయి. సెప్టెంబర్ 2వ వారం నుండి సాగుకు అనుకూలం, 90-100 రో॥

2. ఎర్లీకున్‌వారి : పూర్వ అర్ధచంద్రాకారం, ముద్ద 90-100 రో॥

మధ్యకాలిక రకాలు :

1. పూసాశుభ్ర, హిమని : పువ్వులు మధ్యస్థం, తెలుపు, ముద్ద, ఆకులు బూడిదరంగు, 90-100 రో॥

ముఖ్యంగా మౌలిక పరిశోధన (బేసిక్ రిసెర్చ్) సాగించటంలో కానీ ఈ జన్యు ప్రక్రియపై పూర్తి పరిశోధనే సమాచారం రానంత వరకు ఆహార పంటల రూపకల్పనకు వినియోగించటం తొందరపాటు, అవివేకం.

జన్యు మార్పిడి విధానాలకు భిన్నంగా ప్రభుత్వ రంగ పరిశోధనలో భాగంగా జి.బి.పంత్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, ఢిల్లీలో భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐ.ఎ.ఆర్.ఐ)కు చెందిన శాస్త్రవేత్తలు సాంప్రదాయ బ్రీడింగ్ ప్రక్రియల నుపయోగించి వివిధ సైటోప్లాస్మిక్ మేల్, రిస్టోరర్ లైనులతో రూపొందించిన ఆవ హైబ్రీడ్లుకు ప్రోత్సాహం లభించక పోవడం దురదృష్టకరం. అదేవిధంగా గతంలో ప్రముఖ బహుళజాతి సంస్థల బీ.టీ. ప్రత్తి హైబ్రిడ్లకు ప్రత్యామ్నాయంగా రైతుకు చౌకగా విత్తనాలను సమకూర్చే బికనిరె బీటీవంటి రకాలు, బహుళజాతి విత్తన సంస్థల ఒత్తిడి వలన కానీ, ప్రభుత్వ ప్రోత్సాహం లేక వెలుగు చూడలేకపోయాయి.

వంటనూనెల కొరత తీర్చడానికి మార్గాలు :

90వ దశకంలో దేశంలో నెలకొన్న వంటనూనెల కొరతను పరిష్కరించటానికి ఆనాడు ప్రభుత్వం జాతీయ నూనెగింజల మిషన్‌ను ప్రముఖ శాస్త్రవేత్త కీ॥ శ్రీ ఎం.వి. రావుగారి ఆధ్వర్యంలో ప్రారంభించింది. డా॥ రావుగారి సునిశిత, అవిరామ కృషి ఫలితంగా కేవలం నాలుగు సంవత్సరాల్లోనే దేశంలో నూనె గింజల ఉత్పత్తి రెట్టింపయి, దేశం స్వయం సమృద్ధిని సాధించింది. విలువైన విదేశీ ద్రవ్యం కాపాడబడింది. కాగా తదుపరి, వ్యాపారస్తుల, విదేశీ బహుళ జాతి సంస్థల ఒత్తిడితో ఆనాటి ప్రభుత్వం దిగుమతి కస్టమ్ సుంకాలను బాగా తగ్గించి వేసి పామాయిలు, సోయానూనె దిగుబడులకు అవకాశమిచ్చింది. ఫలితంగా దేశంలో నూనె గింజల సాగు గిట్టుబాటు కాక, విస్తీర్ణం తగ్గి, పంట ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. ఈనాటికి సైతం వేరుశనగ, పామాయిలు రైతులు గిట్టుబాటు ధరలులేక పంటల సాగునుండి తప్పుకొంటున్న దీనావస్థ పరిచితమే.

దీనికి పరిష్కారంగా దిగుమతి సుంకాలను బాగా పెంచి విదేశాలనుండి వంటనూనెల దిగుబడులను నిరుత్సాహపర్చాలి. తద్వారా దేశంలో రైతులకు సరసమైన గిట్టుబాటు ధరలు ప్రకటించి, అధిక దిగుబడి వంగడాలను, ఇతర ప్రోత్సాహకాలను కల్పించాలి. దేశంలో ప్రభుత్వరంగ పరిశోధనలకు విస్తృతంగా నిధులను కల్పించి, నూతన అధిక దిగుబడి వంగడాల రూప కల్పనకు ప్రోత్స హించాలి. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యాన్ని, పోషక విలువలను మెరుగుపర్చే వ్యవసాయ పరిశోధనలను ప్రోత్సహించే విధానం రావాలి. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి చేటు చేసి కేవలం ప్రైవేటు బహుళజాతి విత్తన, రసాయన కంపెనీలకు లాభాలను చేకూర్చే దిశలో జరిగే వ్యవసాయ పరిశోధనలను నిరుత్సాహపర్చాలి.

పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలిగించే జన్యుమార్పిడి ఆహార పంటల సాగుకు అనుమతివ్వటం తొందరపాటు మరియు అవివేకం.

2. స్నోబాల్ 16 : పువ్వులు మధ్యస్థం, ముద్ద, తెలుపు ఆకులు బూడిద రంగుతో కూడిన ఆకుపచ్చ, శీతాకాలం రకం 100-120 రోజులు.

3. పూసాజపనీస్ : పువ్వులు పెద్దవి, ముద్ద, తెలుపు. కోత ఆలస్యమైతే పసుపు రంగుకు మారతాయి. 90-95 రో॥

4. పూసా హిమజ్యోతి : ఆకులతో కప్పబడి వుండే పువ్వు 500-600 గ్రా॥ బరువు.

5. పూసా హైబ్రిడ్ : పువ్వు ముద్ద, తెలుపు, బరువు 970 గ్రా॥ ఎక్కువ దిగుబడి 23 ట/ఎక 90/100 రో॥

6. ఊటీ నం.1 : పర్వత ప్రాంతాలకు అనువైనది 110-120 రో॥

దీర్ఘకాలిక రకాలు :

1. పూసా ఎర్లీసింతటిక్ : పువ్వులు, చిన్నవి, మధ్యస్థం, చదును తెలుపు. అక్టోబర్ నాట్లకు అనువు. 110-120 రో॥

2. పూసా సింతటిక్ : సెప్టెంబర్ మధ్య నాట్లకు అనువైనది. 110-120 రో॥.

3. పూసా స్నోబాల్ 1 : ఎండసోకినా పూలు తెల్లగా వుండేరకం. పూసా స్నోబాల్ 2 : సెప్టెంబర్ మధ్య నుండి నాట్లకు అనువు. 110-120 రో॥

4. పూసా స్నోబాల్ కె.1 : ఆలస్యపు నాట్లకు అనువైనది కోత ఆలస్యమైనా పువ్వులు తెల్లగానే వుంటాయి. నల్లకుళ్ళును తట్టుకొనును. 100-120 రో॥.

5. పూసా శుభ్ర : పొడవైన కాండం, పెద్ద పువ్వు 700-800 గ్రా॥ నల్లకుళ్ళును తట్టుకొనును. 90-95 రో॥.

ప్రైవేట్ రకాలు :

సింజెంటా సుహాసిని, గోల్డెన్ గరిమ, శ్రీరాం పెరల్ వైట్, యు.ఎస్. 113, నానంధారి 60 ఎన్.

బీట్‌రూట్

1. డెట్రాయట్ డార్క్ రెడ్ : గడ్డపై పొర బాగా ఎరుపు 80-100 రోజులు.

2. కిమన్స్ గ్లోబ్ : గడ్డపై పొర లేత ఎరుపు రంగు, గుండ్రన 90-95 రోజులు.

3. ఎర్లీ వండర్ : గడ్డ ఎరుపు 55-60 రో॥

4. మహకోలాల్ - 2 : మహికో కంపెనీ రకం

పెండలం

1. కొవ్వూరు : నాణ్యమైన రకం, ఎక్కువ వ్యాప్తిలో వుంది.

2. శ్రీకీర్తి : శంకు ఆకారం దుంపలు, పైతోలు ముదురు గోధుమరంగు, కండ తెలుపు రుచి ఎక్కువ.

3. శ్రీరూప : పై తోలు ముదురు గోధుమ రంగు కండ తెలుపు.

క్యారెట్

1. పూసా కేసర్ : దుంప ఎరుపు, కండ కూడా ఎరుపు, కెరొటీన్ ఎక్కువ.

2. ఎర్లీ నాన్‌టెస్ : దుంపలు స్థూపాకారం, 12-15 సెం.మీ. పొడవు కండ కాషాయి రంగు.

3. చాన్‌టెనీ : దుంప నారింజ రంగు, నిగనిగలాడును వ్యాసం - 35 సెం.మీ.

4. పూసా యమదగ్ని : దుంప నారింజ రంగు, నిగనిగ లాడును. 15-16 సెం.మీ. పొడవు.

ప్రైవేట్ రకాలు :

న్యూకరోడా (స్పిక్ కంపెనీ) బీజో సీతల్ శాంసన్ (హై), టోకిట కరోడా.

ముల్లంగి

1. పూసా హిమని, 2. జపనీస్ వైట్, 3. పూసా చట్కి, 4. వైట్ ఐసికిల్, 5. ముల్లంగి హైబ్రిడ్-2

కంద

గజేంద్ర : 6-8 నెలలు, దిగుబడి 28 ట/ఎక

చేమదుంప

1. శతముఖి, 2. కెసిఎస్-2, 3) కెసిఎస్-3, 4) ఆర్ఎస్‌సిఎ-11

చిలకడదుంప

1. సామ్రాట్ : దుంపలు తెల్లగా వుండి, గులాబిరంగు చారలు గల్గి వుంటాయి.

2. కిరణ్ : నారింజరంగు కండగల దుంపలు

3. ఎస్ 33/21 : దుంపలపై పొర తెలుపు, లోపలి కండ క్రీడు రంగు, హైబ్రిడ్.

4. దేశవాళి రకం : పైతోలు ఎరుపుగా వుండి, కండ తెలుపు రంగు.

బంగాళాదుంప

1. కుఫ్రీలాలిమ : దుంపలు మధ్యస్థలావు, గుండ్రన, లేశ ఎరుపు రంగు.

2. కుఫ్రీ చంద్రముఖి : దుంపపై పొర గోధుమ రంగు కళ్ళుపైన వుంటాయి. కండ లేత పసుపు రంగు.

3. కుఫ్రీబాద్‌షా : దుంపలు మధ్యస్థ లావు, గుండ్రని తెలుపు.

4. కుఫ్రీ సింధూర్ : దుంపలు మధ్యస్థం, గ్రుండని, కళ్ళు తక్కువ లోతులో వుంటాయి. కండ లేత పసుపు రంగు:

కర్రపెండలం

సగ్గుబియ్యం రకాలు : హెచ్ 226, 165, ఎస్ 856, శ్రీప్రకాశ్, శ్రీజయ.

తినే రకం : యమ్ - 4.

మంచి గుమ్మడి

1. అర్కసూర్యముఖి 2. అర్కచందన్, 3. ఎపిఎయు - సియం 56 4. పూసా అలంకార్, 5. పూసా విశ్వాస్ 6.కో1, కో2, 7.పూసా హైబ్రిడ్-1,8. వి.ఎన్.ఆర్. 24 (విఎన్ఆర్ సీడ్స్), 9.ఎంబిహెచ్ 1 (మహికో), 10. అర్జున (ఈస్ట్ వెస్ట్).

బుడిద గుమ్మడి

1. ఎపిఎయు-శక్తి 2. కో1, కో2. 3. బిహెచ్ 24, 25 4) నిర్మల్ 33 (నిర్మల్ సీడ్స్), మహికో ఎం.బి.హెచ్-1, ఇండస్ - ఆర్తి.

(ఇంకా వుంది)

ఆహార పదార్థాలలో కల్తీ - తీసుకోవలసిన జాగ్రత్తలు

టి. ఆశాలత (గృహ విజ్ఞాన శాస్త్రవేత్త), డా॥ సిహెచ్. వరప్రసాదరావు (ప్రోగ్రాం కోఆర్డినేటర్)

ప్రస్తుత కాలంలో ఆహార పదార్థాల కల్తీ సర్వసాధారణమై పోయింది. వ్యాపార వర్గాల్లో స్వార్థచింతన బాగా పెరగడంతో ఆహార పదార్థాల్లో కల్తీ నానాటికీ అధికమవుతోంది. పాలు, టీపొడి మొదలుకొని అన్ని రకాల నిత్యావసర వస్తువులు కల్తీ అవుతున్నాయి. కల్తీల వల్ల వినియోగదారులు ఆరోగ్యపరంగానూ, ఆర్థికంగానూ దోపిడీకి గురవుతున్నారు. బజారులో దొరికే ఆహార పదార్థాల్లో ఏది అసలైందో, ఏది నకిలీదో తెలియక వినియోగదారులు నానా అవస్థలకు గురవుతున్నారు. కల్తీ జరిగిన ఆహారాన్ని తినడం వల్ల కడుపులో నొప్పి, కళ్ళు పోవడం, గుండెజబ్బులు, క్యాన్సర్, పక్షవాతం వంటి ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే అవకాశముంది. కాబట్టి వినియోగదారులు ఆహార పదార్థాల్లో కల్తీలను గురించి అవగాహన కలిగి వుండాలి. కల్తీని గుర్తించడం తెలియాలి.

ఆహార పదార్థాలలో జరిగే కల్తీని భౌతిక పరీక్షల ద్వారా కొంతవరకు గుర్తించవచ్చు.

→ ఉదాహరణకు పాలలో నీళ్ళు కలపడం అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. నీళ్ళు మాత్రమే కాకుండా కొన్ని రకాల రసాయనాలను పాలలో కలువుతున్నారు. కొన్ని పాలచుక్కలను పాలిష్ చేసిన వర్టికల్ సర్ఫేస్‌పై వేస్తే కల్తీలేని పాలు జారవు లేదా కొద్దిగా జారతాయి. తెల్లటి మచ్చ మిగులుతుంది. కానీ కల్తీ పాలు వేగంగా కిందికి జారడమే కాకుండా తెల్లటి మచ్చ కూడా మిగలదు.

→ పంచదారలో 20 శాతం చాక్ పౌడర్‌ను కలుపుతారు. నీటిలో

ఆహార పదార్థాల్లో గమనించిన కల్తీలు - ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు

వ.సెం.	ఆహారపదార్థం	కలిపే పదార్థం	వ్యాధి / దుష్ఫలితాలు
1.	పాలు	డిటర్జెంట్ పౌడర్, పిండి పదార్థాలు అపరిశుభ్రమైన నీరు	ఉదర సంబంధిత జబ్బులు
2.	టీపొడి	వాడిన టీపొడి, రంగు, రంపపుపొట్టు, ఇనుప రజను	ఉదర సంబంధిత జబ్బులు
3.	కారంపొడి	ఇటుకపొడి, రంపపుపొట్టు, లెడ్‌క్రోమైడ్‌లు	క్యాన్సర్, రక్తహీనత
4.	పసుపుపొడి	బియ్యపు పిండి, మెటానిల్ ఎల్లో, రంపపు పొట్టు	క్యాన్సర్, రక్తహీనత, గుడ్డితనం, ఫిట్స్
5.	నెయ్యి, వెన్న	వనస్పతి, జంతువుల నుంచి సేకరించిన కొవ్వు	ఆర్థిక నష్టం
6.	పంచదార	డిటర్జంట్ పౌడర్, చాక్ పౌడర్	ఉదర సంబంధిత వ్యాధులు
7.	వంటనూనె	ఆర్జిమోన్ (బ్రహ్మజెముడు) నూనె, ఆముదం నూనె, మినరల్ ఆయిల్	గుడ్డితనం, గుండెనొప్పి
8.	కందిపప్పు	కేసరిపప్పు	పక్షవాతం
9.	మిరియాలు	బొప్పాయి గింజలు	ఆర్థిక నష్టం
10.	ఆవాలు	ఆర్జిమోన్ (బ్రహ్మజెముడు) గింజలు	గుడ్డితనం
11.	కొబ్బరినూనె	మినరల్ ఆయిల్	జుట్టు ఊడిపోవడం
12.	ఇంగువపొడి	చాక్‌పొడి, ఇసుక, ధూళి	ఉదర సంబంధిత వ్యాధులు
13.	గోధుమపిండి	గంజిపొడి, ఇసుక, ధూళి	ఉదర వ్యాధి, కాలేయం పాడవడం
14.	కాఫీపొడి	చికోరి, చింతపండు విత్తనాలు, ఖర్జూర విత్తనాలు, కృత్రిమ రంగులు	క్యాన్సర్, ఉదర వ్యాధులు
15	తేనె	బెల్లం పాకం	ఆర్థికనష్టం, పోషకాలుండవు
16.	పెరుగు	పిండిపదార్థాలు, రసాయనాలు	ఉదర వ్యాధులు
17.	ధనియాల పొడి	రంపపు పొట్టు	ఆర్థిక నష్టం, వంట రుచిగా వుండదు.

రైతాంగ సమస్యలపై దేశవ్యాపిత ఉద్యమం

ఎ.ఐ.కె.ఎస్. జాతీయ సమితి పిలుపు

దేశ వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపైన కేంద్రంలో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, ఆయా రాష్ట్రాల్లో పాలిత ప్రభుత్వాల రైతాంగ విధానాలపై ఉద్యమించాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ సమితి తీర్మానించింది. మహా రాష్ట్రలోని ముంబాయి మహా నగరంలో భూపేష్ గుప్తా భవన్‌లో సెప్టెంబర్‌లో 19, 20, 21 తేదీలలో కిసాన్ సభ అధ్యక్షులు ప్రబోద్ పాండా అధ్యక్షతన జరిగిన జాతీయ సమితి మూడు రోజులపాటు రైతు సమస్యలు పాలకుల విధానాలపై విస్తృతంగా చర్చించింది.

దేశంలో 27 రాష్ట్రాల నుండి 87 మంది జాతీయ సమితి సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ అతుల్ కుమార్ అంజాన్ సమావేశంలో ప్రారంభోపన్యాసం చేస్తూ హైదరాబాద్‌లో 2016 మార్చి 3-6 తేదీలలో జరిగిన 29వ జాతీయ మహాసభల అనంతరం వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యక్రమాలపై రిపోర్టు ఇచ్చారు. సెప్టెంబర్ 1న దేశ వ్యాపితంగా రైతాంగ డిమాండ్స్ డే సందర్భంగా సుమారు 400 జిల్లాలలో సభలు, సమావేశాలు, పాదయాత్రలు, ఎఐకెఎస్ పతాకావిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. 1936 ఏప్రియల్ 11న ఆవిర్భవించిన అఖిల భారత కిసాన్ సభ నాయకత్వాన నాటి నుండి నేటి వరకు పలు రైతాంగ సమస్యలపై ఉద్యమాలు నిర్వహించి విజయాలు సాధించామన్నారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తమ ఎన్నికల వాగ్దానాల్లో డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులు అమలుచేస్తామని హామీ ఇచ్చి రైతాంగం ఓట్లతో అధికారం చేపట్టి నేడు కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నదన్నారు. రాష్ట్రాల్లోని ఎఐకెఎస్ విభాగాలు పాలకుల విధానాలపై ఆందోళనకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.

అఖిల భారత బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు శ్రీ విశ్వనాథ్ ఊద్గే మాట్లాడుతూ ప్రతి పంచాయితీ పరిధిలో బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి రావాలన్నారు. పాలకులు కార్పొరేట్ రంగానికి పెద్దఎత్తున రుణాలు ఇస్తున్నారనీ, వ్యవసాయ రంగానికి ముఖ్యంగా పేద రైతులు, కౌలు రైతులు, చిరు వ్యాపారుల రుణాల కోసం ఉద్యమించాల్సి వున్నదన్నారు. ఎఐకెఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు భూపేంద్ర సాంబా, కార్యదర్శి

పంచదార వేస్తే చాక్‌పౌడర్ నీటి అడుగుకు చేరుతుంది.

→ టీపొడిలో కలర్ ఆకులు, ఇనుప రజను, ఒకసారి వాడిన టీపొడి కలుపుతారు. తెల్లని కాగితంపై ఆకులను నలిపితే కల్తీ రంగు బయటపడుతుంది. స్వచ్ఛమైన టీ ఆకులకు రంగు వుండదు. అయస్కాంతాన్ని వాడితే టీపొడిలోని ఇనుప రజను అతుక్కుంటుంది.

→ కాఫీ పొడిలో చికోరి, కోల్తార్‌డై వంటివి కలుపుతారు. కాఫీ పొడిని గ్లాస్ నీటిలో వేసినపుడు కాఫీపొడి నీటిపై తేలుతుంది. చికోరి రంగు వదులుతూ నీటి అడుగుకు చేరుతుంది.

→ తేనెను బెల్లంపాకంతోగాని, చక్కెర ద్రావణంతోగాని కల్తీచేస్తే, ఆ తేనెను దూదిలో ముంచి మండించినపుడు సరిగా అంటుకోదు లేదా చిటపటమని శబ్దం వస్తుంది. నాణ్యమైన తేనెలో ముంచిన దూది వుండ బాగా మండుతుంది.

→ మిరప పొడిలో ఇటుకపొడి, రంపపు పొట్టు, లెడ్‌క్రోమైడ్‌లు కలుపుతున్నారు. గ్లాసు నీటిలో మిరపపొడి వేస్తే ఇటుక పొడి వేగంగా గ్లాస్ అడుగు భాగానికి చేరుతుంది.

→ కొబ్బరి నూనెను ఫ్రీజింగ్ టెంపరేచర్స్‌లో వుంచినపుడు, కల్తీలేని కొబ్బరినూనె గడ్డగడుతుంది. మినరల్ ఆయిల్స్ కలిపిన కొబ్బరినూనె గడ్డకట్టదు.

ఆహారంలో జరుగు కల్తీని భౌతిక పరీక్షల ద్వారా గుర్తించలేనపుడు రసాయన పరీక్షల ద్వారా గుర్తించడానికి వీలుగా, ఆచార్య ఎన్.జి. రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీ, గృహ విజ్ఞాన కళాశాల వారు, "ఫుడ్ అడల్టరేషన్ టెస్టింగ్ కిట్"ను రూపొందించారు. నిత్యావసరాలు కల్తీ అయినట్టు వినియోగదారులు గుర్తిస్తే ఆ విషయాన్ని ముందుగా హెల్త్ అండ్ ఫుడ్, ఇన్‌స్పెక్టర్, న్యూట్రిషన్ డిపార్ట్‌మెంట్, తూనికలు, కొలతల అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి. ఏ వస్తువు కొన్నా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. ఆ బిల్లు ఆధారంగా వ్యాపారిపై కోర్టుకెళ్ళి పరిహారం కోరవచ్చు.

ముఖ్యంగా బహిరంగ మార్కెట్‌లో లూజుగా విక్రయిస్తున్న వస్తువుల్లో ఎక్కువగా కల్తీ జరిగే అవకాశముంటుంది. బ్రాండెడ్ వస్తువులలో కల్తీ అవకాశాలు తక్కువ. ఏదీ ఏమైనప్పటికీ వినియోగదారులందరూ ఆహార పదార్థాల్లో జరుగు కల్తీలపై కనీస అవగాహన కలిగి వుండటం అవసరం. ✧

శ్రీ సత్యన్ ముఖర్జీ, ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, కార్యదర్శి శ్రీమతి పశ్య పద్మ, మహారాష్ట్ర కిసాన్ సభ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీ మధుకర్ పాటిల్, శ్రీ నామ్‌దేవ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు 'వ్యవసాయ రంగం-సంక్షోభం' అను అంశంపై సెమినార్ జరిగింది. ప్రధాన ఉపన్యాసకులుగా ప్రముఖ రచయిత, వ్యవసాయరంగ నిపుణులు శ్రీ సి.కె. శ్రీనివాస్ ఖండావాలే పాల్గొని విశ్లేషణలతో కూడిన వివరాలందించారు. వ్యవసాయ రంగంపై అన్ని రాష్ట్రాల ప్రతినిధులు ఆయా రాష్ట్రాల్లో సంఘం నిర్వహించిన కార్యక్రమాలతోపాటు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి. రామచంద్రయ్య, కెవివి ప్రసాద్, సమితి సభ్యులు శ్రీ కె. కాటమయ్య, శ్రీమతి పి. గంగాభవాని, వైట్ల విద్యాధర్‌లు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ రాష్ట్రంలో జరిగిన కార్యకలాపాలను వివరించారు. చర్చల అనంతరం జాతీయ సమితి పలు తీర్మానాలను ఆమోదించింది. రాబోయే సాధారణ బడ్జెట్‌కు ముందుగా రైతాంగ సమస్యలపై దేశ వ్యాపిత ఉద్యమాన్ని చేపట్టాలని జాతీయ సమితి నిర్ణయించింది.


దేశవ్యాప్తంగా లక్ష గ్రామాల్లో కిసాన్ సభ గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని, సభ్యత్వం పునరుద్ధరించాలని, నవంబర్ మాసాల్లో రైతాంగ డిమాండ్స్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలని, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో జనరల్ బాడీ సమావేశాలు, సభలు, పాదయాత్రలు నిర్వహించి ఆయా రాష్ట్రాల రాజధానుల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలని రాబోయే సాధారణ బడ్జెట్‌ను పురస్కరించుకొని ఢిల్లీలో పెద్దఎత్తున జాతీయ స్థాయి రైతు సంఘాల నేతలను ఆహ్వానించి ముగింపు సభ నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. దేశ వ్యాపితంగా కిసాన్ సభ నాయకులు, కార్యకర్తలు ప్రచారాందోళనా ఉద్యమంలో భాగస్వాములై రైతాంగాన్ని పెద్దఎత్తున సమీకరించాలి.

డిమాండ్స్

1. 60 సంవత్సరాలు నిండిన రైతులు, గ్రామీణ పేదలందరికీ నెలకు రు.10,000/- పెన్షన్ సౌకర్యం కల్పించాలి.
2. డాక్టర్ స్వామినాథన్ కమీషన్ సిఫారసుల ప్రకారం రైతాంగ ఉత్పత్తులకు మద్దతు ధరలు నిర్ణయించి అమలుచేయాలి. వరి, గోధుమ పంటలకు క్వింటాకు రు.2,500/-లు మద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించాలి. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రు.500/- బోనస్ ఇవ్వాలి.
3. జిడిపిలో 15% వ్యవసాయానికి వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలి. వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ రూపొందించాలి.
4. వ్యవసాయ రంగానికి సబ్సిడీలు పెంచాలి. పేద రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు 90% సబ్సిడీపై ఇవ్వాలి.
5. రైతులు, కౌలు రైతులందరికీ వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. పేద కౌలు రైతుల రుణాలు పూర్తిగా మాఫీచేయాలి.
6. రాబోయే 5 సంవత్సరాల్లో నీటి పారుదల ప్రాజెక్టులు పూర్తిచేసి వ్యవసాయ భూములన్నిటికీ సాగునీటి సౌకర్యం కల్పించాలి.
7. మార్కెట్ కమిటీలకు అనుబంధంగా ప్రతి పంచాయితీ స్థాయిలో రైతుమిత్ర గ్రూపులు ఏర్పాటుచేసి, కమిటీలలో రైతుల ప్రాతినిధ్యంతో వ్యవసాయ మార్కెట్లు సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలి.
8. భూ సంస్కరణలు సమర్థవంతంగా అమలుచేసి ప్రతి పేదకు సాగుభూమి, ఇండ్లస్థలాలు ఇవ్వాలి. కౌలు రైతులకు ఆర్థిక సహాయం, వ్యవసాయ పరికరాలు అందించేందుకు చట్టం చేయాలి.
9. రైతులకు కావలసినటువంటి వ్యవసాయ యంత్ర పరికరాలు, ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరలు పెరుగుదలను నిలుపుదల చేస్తూ పబ్లిక్‌రంగ పంపిణీ విధానాన్ని అభివృద్ధి చేసి, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి ప్రజలకు అందించాలి.
10. ఆహార భద్రతా చట్టాన్ని అమలు జరిపి రైతు కుటుంబాలకు ఇళ్ళు, విద్య, వైద్యం వంటి సంక్షేమ పథకాలు అమలు జరపాలి.
11. రైతుల ఆదాయ కమీషన్ ఏర్పాటు చేయాలి. 5 లక్షల రూపాయల వరకు రైతులందరికీ భీమా సౌకర్యం కల్పించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని రైతుల ఇన్సూరెన్స్ ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలి.
12. పశువులు, గొర్రెలు, మేకల పెంపకం దార్లకు ఆర్థిక సహాయం అందించి, భీమా సౌకర్యంలో స్థానం కల్పించాలి. పాల ఉత్పత్తిదార్లకు లీటర్‌కు రు.10/- వంతున ప్రోత్సాహక సబ్సిడీ ఇవ్వాలి.
13. వాతావరణ సమస్యలను పరిరక్షించడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి.
14. 2013 లో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన భూ సేకరణ చట్టాన్ని అమలుచేయాలి. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు శాసనసభలలో 2013 చట్ట అమలుకు తీర్మానించాలి.

పై సమస్యల సాధనకోసం మన సంఘంతోపాటు అన్ని సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటాలకు సిద్ధంకావాలని జాతీయ సమితి తీర్మానించింది. ✧

సమగ్ర జల ప్రణాళిక లేని ప్రభుత్వం...!



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నదీ జలాల విషయంలో ఒక సమగ్రమైన ప్రణాళికతో ముందుకు వెళ్లకపోవటం వల్లనే సమస్యలు వస్తున్నాయని రైతు సంఘాల నేతలు పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర జల వనరుల శాఖ మంత్రి ఉమాభారతి రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించినా ప్రయోజనం కలగలేదన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రధానంగా కృష్ణా జలాల విషయంలో అనేక విభేదాలున్నాయని వారు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28న విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ రైతు సంఘ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సంఘం నాయకులు నరిశెట్టి గురవయ్య అధ్యక్షత వహించారు. నదీజలాల విషయంలో నిపుణులతోపాటుగా, వాటిపై అధ్యయనం చేసిన, రైతు సంఘ నాయకులు, క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదుర్కొంటున్న రైతుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుని సమగ్రమైన విధానాన్ని రూపొందించుకోకుండా చంద్రబాబు నాయుడి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం వల్లరాష్ట్రానికి నష్టం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో కేటాయించిన 8,1100 టీఎంసీల నీటిలో ఆంధ్రప్రదేశ్‌కు కచ్చితంగా వచ్చే విధంగానూ 512, తెలంగాణకు 299 టీఎంసీల నీరు వినియోగించుకునే విధంగానే జలాల పంపిణీ జరగాల్సి ఉందన్నారు. గోదావరి జలాలను ఉమ్మడి రాష్ట్రంలో 1490 టీఎంసీలను కేటాయించారని పేర్కొన్నారు. విభజన తరువాత తెలంగాణాకు కేటాయింపులు ఇంకా చేయలేదన్నారు. అయినప్పటికీ గోదావరిపై అడ్డగోలుగా కేసిఆర్ ప్రభుత్వం రీడెజైన్‌ల పేరుతో ప్రాజెక్టులు కడుతుంటే ఏపి ప్రభుత్వం అఖిలపక్షాన్ని పిలిచి దానిపై గట్టిగా తన వాదన వినిపించే ప్రయత్నం చేయకపోవడం సరికాదని వక్తలు పేర్కొన్నారు. ప్రధానంగా కృష్ణా జలాల విషయంలో ఇదివరకే రెండు రాష్ట్రాల మధ్య అనేక గొడవలు జరిగి ఇటు, అటు పోలీసులు సైతం కొట్లాటకుదిగే స్థాయిలో వివాదాలు జరిగాయి. సుప్రీంకోర్టు చేసిన సూచన మేరకే ఉమాభారతి పరిష్కారానికి ప్రయత్నిస్తే సమస్యలు ఏమీ పరిష్కారం కాకుండానే ఇద్దరు సిఎంలు వెనుదిరిగి వచ్చారని అన్నారు. సమావేశంలో చేసుకున్న ఒప్పందాలు ప్రస్తుతం అమల్లో ఉన్నవేనని, మరి మీరు గొప్పగా సాధించుకుని వచ్చిందేమంటే ఏమీలేదనే చెప్పాలని వారు అన్నారు. ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ, నీటి యుద్ధాలు వస్థాయని గతంలో చెప్పుకోగా విన్నాం ఇప్పుడు దాదాపు వాటిని చూస్తున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ విస్తృత ప్రయోజనాలకోసం ప్రభుత్వం సాగునీటిపై సమగ్రమైన ప్రణాళికతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిజేష్ ట్రిబ్యునల్ కేటాయింపుల్లో నూటికి 65 శాతం నుంచి లెక్కించి నీటి కేటాయింపులు చేయడం వల్ల నష్టం జరిగిందన్నారు. దేవెగౌడ ప్రభుత్వం ఉన్న రోజుల్లో చంద్రబాబుకు సన్నిహితంగా ఉన్నప్పటికీ ఆల్‌మట్టీ డ్యాం ఎత్తు పెంచుతుంటే పట్టించుకోలేదని విమర్శించారు.

నిపుణుల సలహాలు పాటించాలి - వడ్డే శోభనాద్రీశ్వరరావు : జల సాధన విషయంలో చంద్రబాబు నాయుడు అన్నీ తనకే తెలుసనే భావన నుంచి ముందు బైటికి వచ్చి నిపుణుల సలహాలతో సమగ్ర ప్రణాళికను తయారు చేసుకోవాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. 150 టీఎంసీల నీటి నిల్వ ఉంచుకునే అవకాశమున్న ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి కోసమని మాకు అదనపు జలాలు అక్కరలేదని ట్రిబ్యునల్‌కు రాసిచ్చారని విమర్శించారు. విభజన చట్టంలో డిండి.. పాలమూరు ప్రస్తావన లేకపోయినా మేం కట్టి తీరుతామని చెప్పడం కేసిఆర్ అహంకారానికి నిదర్శనమన్నారు. వీటిపై కేసిఆర్‌ను నిలదీయాల్సిన చంద్రబాబు కేసిఆర్ సమావేశం నుంచి వెళ్లిపోతుంటే నేనే చేయిపట్టుకుని ఆపానని తనంటే కేసిఆర్‌కు గౌరవమని చెప్పుకోవడం శోచనీయమని గురవయ్య అన్నారు.

బ్రిజేష్ కమిటీ నష్టం చేసింది - రాజేంద్రప్రసాద్ : బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపుల్లో నష్టం చేసిందని నీటి పారుదల శాఖ మాజీ ఎస్సీ రాజేంద్రప్రసాద్ అన్నారు. బచావత్ అవార్డు ప్రకారం వందేళ్లపాటు నీటి లభ్యతను పరిగణలోకి తీసుకుని అందులో 75 శాతం నీటి కేటాయింపులు చేసేవారని ఇప్పుడు బ్రిజేష్ కుమార్ కమిటీ 65 ఏళ్లనే పరిగణలోకి తీసుకుని కేటాయింపులు చేయడం నష్టదాయకమన్నారు. పాలమూరు, డిండి ప్రాజెక్టుల ఎత్తిపోతలు పూర్తిచేయడం మాటలు చెప్పినంత తేలిక కాదన్నారు. అందుకయ్యే విద్యుత్ ఖర్చు అసాధారణమైందన్నారు. ఆయా మోటార్లు నడిచేందుకు 4,200 మెగావాట్ల విద్యుత్ కావాలన్నారు. నీటి కేటాయింపులు క్యాచ్‌మెంట్ ఏరియాకు కాకుండా పంటలు పండే ఆయకట్టుకే ఉంటుందన్నారు. పోలవరంవల్ల ఉపయోగం ఎక్కువగా ఉందన్నారు. 20 లక్షల ఎకరాలకు నీరు అందించే అవకాశం ఉందన్నారు.

తీర్మానాలు : బ్రిజేష్ కమిటీ తీర్పును త్వరగా అమలుచేయాలని, దిగువన ఉన్న రాష్ట్రానికే మిగులు జలాలు పూర్తిగా ఇవ్వాలని, సాగర్ ఆయకట్టుకు గ్యారెంటీగా నీరు ఇవ్వాలని, పులిచింతల ప్రాజెక్టును పూర్తిగా వినియోగంలోకి తేవాలని, నిర్వాసితుల డిమాండ్లు పరిష్కరించి పూర్తి నీటిని నిల్వచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, సాగునీటి సమస్య పరిష్కారంపై చర్చించేందుకు రాజకీయ పార్టీలు, రైతు సంఘాలను ప్రభుత్వం సమావేశ పరచాలనీ కోరుతూ సమావేశం తీర్మానించింది. తీర్మానాలను రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ప్రవేశపెట్టారు. రైతు సంఘం, ఇతర సంఘాల నాయకులు సంగిరెడ్డి హనుమంతరెడ్డి, మల్లిఖార్జునరావు, డి. శ్రీనివాసరెడ్డి, ముసునూరి రమేష్, వైట్ల విద్యాధర్, సురేంద్రనాద్, బెనర్జి తదితరులు పాల్గొన్నారు. ✧

సెప్టెంబర్ 1 అఖిల భారత కిసాన్‌సభ డిమాండ్స్ డే సందర్భంగా


జిల్లాలలో జరిగిన కార్యక్రమాలు

మంగళగిరి : రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళేందుకు అఖిల భారత కిసాన్‌సభ ఎన్నో పోరాటాలు చేసి రైతులకి రక్షణ కవచంగా నిలిచిందని అఖిల భారత కిసాన్‌సభ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నియోజకవర్గ రైతుసంఘం కార్యాలయం వద్ద సెప్టెంబరు 1న రైతాంగ కోర్కెల దినోత్సవం సందర్భంగా ఆయన రైతుసంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు 15 లక్షల ఎకరాలను భూ సమీకరణ పేరుతో భూములను స్వాధీనం చేసుకుంటున్నారని విమర్శించారు. బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాడా లన్నారు. రైతులందరికీ గిట్టుబాటు ధరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతాంగ డిమాండ్లపై సంతకాలు సేకరించి తహశీల్దార్‌లకు అందజేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రావుల శివారెడ్డి, నియోజకవర్గ సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, పిల్లలమర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, రైతుసంఘం నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ సుబ్బారావు, సంఘం నాయకులు ముసునూరి సుహాస్, తోట వెంకటేశ్వరరావు, జవ్వాది వీరయ్య, మోదుగుల సిద్ధయ్య, జూట్రు శంకరరావు, గంజి వెంకయ్య, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంఘ కార్యాలయం నుండి రైతులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి మండలం పెనుమాకలో రావుల వెంకయ్య, పెదవడ్లపూడిలో రైతుసంఘం నాయకులు భావన సాంబశివరావు, నూతక్కిలో సీనియర్ రైతు నాయకులు తోట వెంకటేశ్వరరావు, తాడేపల్లిలో రావుల శివారెడ్డి, చిర్రావూరులో ముక్కపాటి మోహనరావులు రైతు సంఘ జెండాలు ఆవిష్కరించారు.

పత్తికొండ రూరల్ : రైతు సంక్షేమమే ధ్యేయంగా ఏపీ రైతుసంఘం పని చేస్తోందని రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య అన్నారు. రైతాంగ కోర్కెల దినోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా పత్తికొండ మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో పతాకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతి రేక విధానాలతో దేశవ్యాప్తంగా 53% మంది, రాష్ట్రవ్యాప్తంగా 91% మంది రైతులు అప్పుల పాలయ్యారని దుయ్యబట్టారు. పత్తికొండ పర్యటనకు వచ్చిన వ్యవసాయ మంత్రి పత్తిపాటి పుల్లారావు కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడారని విమర్శించారు. ప్రస్తుతం ఉల్లి, టమోటా పంటలకు గిట్టుబాటుధరలు లేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజ సాహెబ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు తిమ్మయ్య, సీపీఐ మండల కార్యదర్శి కారన్న, నాయకులు లక్ష్మన్న, మస్తాన్, ఆదెప్ప, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

వినుకొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కే.వి.వి. ప్రసాద్ డిమాండ్ చేశారు. రైతాంగ కోర్కెల దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా వినుకొండ నియోజకవర్గ రైతుసంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రైతుసంఘ కార్యాలయం నుంచి బయలుదేరి ప్రదర్శనగా రైతులు, మహిళా రైతులు రైతుసంఘం జెండాలు చేబూని నినాదాలు చేశారు. ఈ ధర్నాకు సంఘం నియోజక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు కె.శివ రామకృష్ణ, ఉలవలపూడి రాము అధ్యక్షత వహించారు. అనంతరం తహశీల్దార్ బి. నాగూల్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. తొలుత సీపీఐ కార్యాలయం శివయ్య భవనంపై రైతాంగ (ఏఐకేఎస్) జెండాను ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ ఆవిష్కరించారు. నియోజకవర్గ రైతుసంఘం నాయకులు పఠాన్‌లాల్ ఖాన్, బండికోటయ్య, పి.అంజయ్య, సాయిబాబా, కొండారెడ్డి, జెక్కిరెడ్డి అంజిరెడ్డి, షేక్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లా - డోన్ : మండలాన్ని కరవు మండలంగా గత సంవత్సరం ప్రకటించారుగాని నిధులు మంజూరు చేయకపోవడం ప్రభుత్వానికి తగదని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె జగన్నాథం అన్నారు. మండల పరిధిలోని ఓబులాపురం గ్రామంలో ఎపి రైతు



సంఘం డిమాండ్స్ డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభకు రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షులు నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథులుగా హాజరైన కె. జగన్నాథం, సిపిఐ జిల్లా కార్యదర్శి కె. రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాల వలన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, రైతుల ఆత్మహత్యలను నివారించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల గౌరవాధ్యక్షులు చిన్న రంగన్న, కార్యదర్శి సుధాకర్ సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎన్ రంగనాయుడు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు సుంకయ్య, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, సిపిఐ నాయకులు నక్కిశ్రీకాంత్, ఏపిజిఎస్ జిల్లా కార్యదర్శి మోటా రాముడు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు : డా॥ స్వామినాథన్ కమిషన్‌ను అమలుచేయాలని ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె జగన్నాథం అన్నారు. జిల్లాలో ఉల్లి, టమోటా ధరలకు గిట్టుబాటు ధర కల్పించాలని, 60 సంవత్సరాలు నిండిన రైతులకు 10 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి తోళ్ళ మద్దిలేటి, దళిత హక్కుల పోరాటసమితి జిల్లా కార్యదర్శి మహేష్, రైతుసంఘం సీనియర్ నాయకులు పుల్లన్న, ఎఐఎస్ఎఫ్ నాయకులు నారాయణ, భాస్కర్, భీమేష్ తదితరులు ఉన్నారు.

ఆలూరు : ఆలూరులో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి గిడ్డయ్య ఆద్వర్యంలో రైతుసంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మునిస్వామి, నాగరాజు, హొసూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి : వరుస కరువులతో వ్యవసాయం రైతులకు గుదిబండగా మారిందని రైతుసంఘం మండల కార్యదర్శి ఉమాపతి అన్నారు. రైతుల డిమాండ్స్‌డేను నిర్వహించి గ్రామంలో రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బాలన్న, మద్దిలేటి, సూరి, రాజు, చిరంజీవి, లాలన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్ : ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బీజి. మాదన్న ఆవిష్కరించారు. బీజి. మాదన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో రైతులను నిలువునా మోసాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు రామచంద్ర రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యన్న రైతు సంఘం మండల అధ్యక్షులు జబ్బీరు, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు జనన్న, సోమేశ్వర రెడ్డి, జిల్లా సమితి సభ్యులు భాస్కర్ యాదవ్ రైతుసంఘం నాయకులు తిమ్మప్ప,చిన్నన్న,వీరేష్ పాల్గొన్నారు.

ఆదోని : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరచు అభివృద్ధి మంత్రం జపిస్తూ రైతుసమస్యలను పట్టించుకోవడం లేదని రైతుసంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు లక్ష్మిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అయ్యప్ప గౌడ్‌లు పిలుపునిచ్చారు. దొడ్డనగేరి గ్రామంలో రైతాంగం కోర్కెల దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ ఉపాధ్యక్షులు తిమ్మారెడ్డి జెండా ఆవిష్కరించారు. రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షులు నర్సప్ప, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సుదర్శన్, రైతుసంఘం నాయకులు రాము, ఈరన్న, ఉరుకుందు, రామాంజనేయులు పాల్గొన్నారు.

నందవరం : మండలంలోని సిపిఐ స్థూపం నందు సిపిఐ మండల కార్యదర్శి వంవన్నగౌడ్ రైతుసంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు చంద్రగౌడ్,జలాల్, నాగన్న, విజయ్‌కుమార్, మునిస్వామి, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద : రైతాంగ కోరికల దినోత్సవాన్ని రైతుసంఘం రాష్ట్ర సమితి నాయకులు బసాపురం గోపాల్, మండల రైతుసంఘం కార్యదర్శి కాలప్ప ఆచారిలు గజ్జెహళ్ళి గ్రామంలోని బస్టాండ్‌వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బుడేన్‌సాబ్, అయ్యన్న, ఉలిగయ్య, మూకన్న, ఎఐటియుసి నాయకులు రుద్రప్ప, నాగరాజు, రాజా, మోదీన్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆస్పరి : రైతులు పండించిన ఉల్లి, టమోటా పంటలను ప్రభుత్వమే కొనుగోలుచేయాలని ఏపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. మండలంలో బిల్లేకల్, ముత్తుకూరు, ఆస్పరి గ్రామాల్లో రైతాంగ కోర్కెల దినోత్సవాలు జరిగాయి. బిల్లేకల్ గ్రామంలో జరిగిన కార్యక్రమానికి గిడ్డయ్య ముఖ్య అతిథిగా హాజరై రైతుసంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. రైతుసంఘం తాలూకా అధ్యక్షులు నాగేంద్రయ్య, డిహెచ్‌పిఎస్ తాలూకా అధ్యక్షులు ముద్దు రంగన్న, విద్యాకమిటి చైర్మన్ మారెన్న,

రైతుసంఘం నాయకులు ఈరన్న, ఉరుకుందు, భీమన్న, అంజనేయ పాల్గొన్నారు.

దేవనకొండ : రైతులకిచ్చిన హామీలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలోకి తొక్కాయని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్, మండల అద్యక్ష, కార్యదర్శులు కండప్ప, ఇబ్రహీం, జిల్లా కార్యవర్గ సభ్యులు శాంతికుమార్‌లు తెలిపారు. సిపిఐ కార్యాలయం వద్ద ఎఐకెఎస్ జెండాను జగదీష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపి రైతుసంఘం నాయకులు రాజశేకర్, మాదన్న, అంజినేయ, శ్రీకాంత్, శేఖర్, రమేష్, జనర్దన్, నర్సయ్య, బజారప్ప, చిరంజీవి పాల్గొన్నారు.

కోడుమూరు : రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరకల్పించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె జన్నాథం అన్నారు. జాతీయ సమితి పిలుపు మేరకు జెండాను ఆయన ఆవిష్కరించారు. సిపిఐ మండల కార్యదర్శి మాధవస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, హమాలీ కార్మికులు మద్ది, మధు, జిలాని, కోటకొండ మద్దిలేటి, పెద్దయ్య, చంద్రన్న, ఎఐటియుసి నాయకులు మధు, మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఒబులాపురం, కె. తిమ్మాపురం, కోసిగి, పెద్దకడబూరు, దొడ్డనగిరి, జగ్గిహెళ్ళి, బాలగుం, చిప్పగిరి, కారుమంచి, నైరుప్పల, ఇరుపాపురం, రాంపల్లి, పెండెకల్లు ఆర్.ఎస్., మద్దికెర, అగ్రహారం, ఒలకదొడ్డి, పెద్దగుత్తి, కొత్తపల్లి, పందికోన, గోస్పాడు, మహానంది తదితర గ్రామాలలో రైతుసంఘ జెండాలను ఆవిష్కరించడం జరిగింది.

ప్రకాశం జిల్లా - యర్రగొండపాలెం : భూమిని నమ్ముకొని జీవిస్తూ 60 సంవత్సరాలు నిండిన రైతులకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని ఏపీ రైతుసంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు దేవండ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రైతాంగ కోర్కెల దినోత్సవం సందర్భంగా యర్రగొండపాలెం సంఘ కార్యాలయం ఎదుట ఏఐకేఎస్ జెండాను దూదేకుల నాసర్ ఆవిష్కరించారు. ఆ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి మంత్రం జపిస్తూ రైతులను, గ్రామీణపేదల జీవితాలను దుర్భరం చేస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో సంఘ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య మాట్లాడుతూ పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయించాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల నియోజకవర్గ కార్యదర్శి దాసరి మల్లికార్జున, నక్కా తిరుపతయ్య, నల్లబోతుల యోగయ్య, తిరుమెళ్ళ కృష్ణయ్య, నల్లబోతుల పాండు, తదితరులు పాల్గొన్నారు.

జరుగుమల్లి : జరుగుమల్లి మండలంలో రైతుదినోత్సవ వార్షికోత్సవాన్ని వాడవాడల్లో ఘనంగా నిర్వహించి రైతుసంఘ జెండాలను ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ రైతులు, కార్మిక



జీవితాలను నిరాశపరిచాయన్నారు. రైతుసంఘం కొండపి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, బెల్లం ప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి గద్దల బాలకోటయ్య, రెడ్డిపాలెం రైతులు సుబ్బరెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మణ నారాయణ, వెంకటేశ్వర్లు, రావి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జె పంగులూరు : జె. పంగులూరు మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో ఎఐకెఎస్ జెండాను రైతుసంఘం సీనియర్ నాయకులు గొల్లపూడి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. అద్దంకి నియోజకవర్గ రైతుసంఘ ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి శింగయ్య మాట్లాడుతూ ఎఐకెఎస్ 1936లో ఏర్పడిందని, ఆనాటినుండి ఈ నాటి వరకు రైతుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నేతలు వి. హనుమంత రావు, రావూరి అంజయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. దోర్నాలలోని సంఘ కార్యాలయం వద్ద ఎఐకెఎస్ జెండాను నీలూరి గోవింద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి వెంకటేశ్వరాచారి, రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షులు దుగ్గింపూడి తిరుపతిరెడ్డి, భవన నిర్మాణ కార్మికసంఘం నియోజకవర్గ కార్యదర్శి దాసరి మల్లికార్జున, గుమ్మారాజు, ఆదినారాయణ రెడ్డి, శ్రీనివాసులు, అంకయ్య, సుబ్బారెడ్డి, బాలకాశయ్య తదితరులు పాల్గొన్నారు. చిన్న దోర్నాల, తిమ్మాపురం గ్రామాల్లో జెండా ఆవిష్కరణలుగావించారు. యర్రగొండపాలెం నియోజకవర్గ కార్యదర్శి కె.వి.కృష్ణగౌడ్, రైతుసంఘ నియోజకవర్గ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, ఓరుగంటి ప్రసాద్, డీహెచ్‌పిఎస్ జిల్లా అద్యక్షులు పూర్ణకంటి తిరుమలయ్య, పిన్నెబోయిన నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి : రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలంచెందాయని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అద్దంకి

నియోజక వర్గ కార్యదర్శి యడ్లపల్లి శింగయ్య అన్నారు. పట్టణంలోని రామనగర్‌లో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా యడ్లపల్లి శింగయ్య మాట్లాడుతూ రైతాంగ కోర్కెల దినోత్సవం సందర్భంగా మండలంలోని వెంకటాపురం, వెంపరాల గ్రామాల్లో రైతు జెండా ఆవిష్కరణలుగా వించామన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి వెంకటేశ్వరరావు, కెఎల్‌డి ప్రసాద్, వి.బ్రహ్మారెడ్డి, మిరియాల సుబ్బారావు, షేక్ సుబాని, పూరి మెట్ల సుబ్బారావు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : త్రిపురాంతకం మండలం గాంధీనగర్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో పతాకావిష్కరణ కార్యక్రమం సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి. శ్రీనివాస్ మాట్లాడుతూ వరికి క్వింటాకు రూ. 2 వేలు కేంద్ర ప్రభుత్వం మద్దతు ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇవ్వాలన్నారు. రైతుసంఘ జెండాను గాంధీనగర్ రైతు నాయకులు అన్నెం తిరుపతయ్య ఆవిష్కరించారు. లింగయ్య, దాసరి మల్లికార్జున్, నూర్జహాన్, అచ్చమ్మ, బండారు నరసింహులు, జంపాల చిన్నక్క తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరు : సోమశిల ఉత్తర కాలువను వెంటనే పూర్తిచేసి రాళ్ళపాడు ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీరు అందించి ఆంధ్ర ప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కమిటి సభ్యులు కె. వీరారెడ్డి డిమాండ్ చేశారు. బస్విరెడ్డిపాలెంలో రైతు సంఘం జెండా ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సుబాబుల్, జామాయిల్ కొనుగోలు విషయంలో రైతులకు నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తుందని, పత్తి ధర రోజు రోజుకూ దిగజారిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగ వ్యతిరేక విధానాలపై ఆందోళన చేపడతామని వీరారెడ్డి తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి పి. బాల కోటయ్య, రైతుసంఘ నాయకులు చిలకల క్రిష్ణారెడ్డి, వై.శివారెడ్డి పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా - పెదకాకాని : మండల కేంద్రమైన పెదకాకానిలో రైతాంగ కోర్కెల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ హాజరై ప్రధాన సెంటర్‌లో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి మంత్రం జపిస్తూ రైతులు, గ్రామీణ పేదలు, అసంఘటిత రంగకార్మికుల జీవితాలను దుర్భరం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు కొల్లిరంగారెడ్డి, రమేష్, సాంబిరెడ్డి, విఠల్‌రెడ్డి, అనిమిరెడ్డి, సంగుల సంగీతరావు, పుప్పాల సత్యనారాయణ, బాబూరావు, తోకల వేమారావు, రాఘవులు, బాషీద్, నాగార్జున, శ్రీనివాసరావు, రాజులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి : సత్తెనపల్లిలోని పాతబస్టాండ్ సెంటర్‌లోని సంఘ కార్యాలయం వద్ద రైతుసంఘ పతాకాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్నెటి గురవయ్య ఆవిష్కరించారు. రైతులు, కౌలు రైతులు, గ్రామీణ పేదలందరికి పది వేల రూపాయల చొప్పున పెన్షన్ అందించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో కంబాల శ్రీనివాసరావు, పి. రామకోటేశ్వరరావు, యచ్. వేణుగోపాలరావు, ఆనంద్, ఆదినారాయణ, నూర్‌బాషా, జాని రామారావు, తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు : ప్రభుత్వ విధానాలతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని జిల్లా రైతు సంఘ ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రం చేబ్రోలులో ఆయన పతాకావిష్కరణ చేశారు. రాష్ట్రంలో ఉన్న కౌలు రైతులకు రక్షణగా 2011లో చట్టం చేసినా వారికి గుర్తింపు కార్డులు, ఋణాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి కేసాని కోటేశ్వరావు రైతుసంఘ జిల్లా ఉపాధ్యాక్ష్యులు కె.రంగారెడ్డి, జిల్లా రైతు సంఘనాయకులు సాంబిరెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు చల్లగుండ్ల రామ కృష్ణ, కె.విదుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి : కౌలు రైతుల హక్కులను హరించి, రైతుల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టే జీఓ నెంబర్ 471ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి డిమాండ్ చేశారు. నారాయణపురంలో రైతుసంఘం అరుణ పతాకాన్ని జిల్లా రైతుసంఘ నాయకులు తెలనాకుల సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు బుర్రి కృష్ణారెడ్డి, యడ్ల భాస్కర్,అన్నం లక్ష్మయ్య, ప్రత్తిపాటి రోశయ్య, వేముల వెంకటరెడ్డి, షేక్‌గాలీషా, సయ్యద్ సైదా, ఎం.రామిరెడ్డి, అంకిరెడ్డి, వై.రామిరెడ్డి, కోదండ రామిరెడ్డి, మీరావలి, వేముల కోటిరెడ్డి, వివేకానందరెడ్డి,సైదులు తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట : రావిపాడు గ్రామంలో రైతుసంఘం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ,



రైతుసంఘం ఏరియా కార్యదర్శులు కాసా రాంబాబు, యద్దనపల్లి లూర్థు రాజయ్యలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామపెద్ద పూదోట ఇన్నయ్య జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు నాగేశ్వరరావు, ఏఐటియుసి నాయకులు ఆలూరి రమణయ్య, వైదన వెంకట్, కోయా శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

కారంపూడి : రాష్ట్రంలో 91 శాతం మంది రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందన కరువైందని రైతుసంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు మేకపోతు శ్రీనివాసరెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి మంత్రం జపిస్తూ రైతులు, గ్రామీణపేదల జీవితాలను దుర్భరం చేస్తున్నా యన్నారు. ధర్నా అనంతరం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మాచర్ల ఏరియా అధ్యక్షులు సిహెచ్ కోటిరెడ్డి, ఏరియా కార్యదర్శి కె. వెంకట శివయ్య, యువజన సంఘ కార్యదర్శి సిహెచ్ రామకృష్ణ, పి. రాంబాబు, సైదుబుడే, మణికంఠ, గాలయ్య, వెంకటాచారి, జి. మార్కారావు, ఎస్ అంజనేయులు, ఎం. మంగమ్మ తదితరులు పాల్గొన్నారు. పెదకొడమగండ్ల గ్రామంలో మేకపోతు శ్రీనివాసరెడ్డిచే రైతుసంఘ పతాకావిష్కరణ కావించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల ఏరియా అధ్యక్షులు ఎంచినకోటిరెడ్డి, కార్యదర్శి కె. వెంకటశివయ్య, వై. అంజనేయులు, కెవెంకటేశ్వర్లు, బుడేసాహెబ్, ఎం.లచ్చిరెడ్డి, ఎం వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా - గన్నవరం రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల నడ్డివిరిచే విధానాలను మానుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. యల్లమందారావు కోరారు. రైతాంగ డిమాండ్స్ డే సందర్భంగా బీబీగూడెంలో కొండపల్లి వెంకట సుబ్బయ్య, గొల్లనపల్లిలో రైతుసంఘం నాయకులు పల్లగాని వెంకట కృష్ణారావు పతాకావిష్కరణ చేశారు. శోభనాచలపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కొండా వీరాస్వామి, గొంది రైతుసంఘం జిల్లా నాయకులు ముక్కాముల ఉమామహేశ్వరావు, పల్లగాని వెంకయ్య, పర్నా వెంకటేశ్వరరావు, బోయపాటి శివరామకృష్ణ, కట్టైవరపు విజయరావు, పడమట నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు : రైతులు, కౌలురైతుల సంక్షేమానికి, రైతుసంఘం కృషిచేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని పెద్దవరంలో రైతుసంఘ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన రైతుసంఘ జెండా ఆవిష్కరించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య, రైతుసంఘ నాయకులు నృసింహాద్రి వనమాలి, తూము కోటయ్య, రవి, నాగేశ్వరరావు, కృష్ణయ్య పాల్గొన్నారు.



చందర్లపాడు : చందర్లపాడు తహశీల్దారు కార్యాలయంలో రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుసంఘం ఉపాధ్యక్షుడు పోల్నేడి నాగభూషణం, సీపీఐ మండల కార్యదర్శి షేక్ ఖాసిం, పొల్లా వెంకటేశ్వరరావు, షేక్ బాబు, కంబం పాటివీరయ్య, షేక్ నజీర్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల : దేశానికి వెన్నెముక అయిన రైతు జీవితం అతి దీనావస్థకు చేరుకుందని, దీనికి పాలక ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని సీనియర్ రైతు నాయకులు దండమూడి బాలకృష్ణ అన్నారు. పెన్మత్సలో రైతుల ధర్నా జరిగింది. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి కెవి అప్పారావు, నియోజకవర్గ వ్యవసాయ కార్యదర్శి ఎస్. నాగేశ్వరరావు, నాయకులు డి. నరసింహారావు, జి. రఫీల్, డివి రామారాజు, దండమూడి సుబ్బారావు, పామర్తి వెంకటేశ్వరావులు పాల్గొన్నారు.

నందిగామ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి మంత్రం జపిస్తూ రైతులు, గ్రామీణ పేదల జీవితాలను దుర్భరం చేస్తున్నా యని ఏపీరైతు సంఘం జిల్లా కార్యదర్శి చుండూరు వెంకట సుబ్బారావు ఆరోపించారు. రైతాంగ కోర్కెల దినోత్సవాన్ని రామిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరి రైతుసంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. పోపూరు రాధాకృష్ణ, కోమటి సత్యం, నారాయణ, జె. శ్రీనివాసరావు, రాంబాబు, అబ్బూరు పున్నారావు, జె. వెంకటేశ్వరరావు, పల్లెకంటి సూలేమాన్, సురేష షేక్ ఉద్దండు తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు : రైతాంగ కోర్కెల దినోత్సవాన్ని మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున నిర్వహించారు. వీరులపాడులో రైతు సంఘం పతాకాన్ని రైతు సంఘం సీనియర్ అధ్యక్షులు వాసిరెడ్డి రాధాకృష్ణ ఆవిష్కరించారు. జుజ్జూరులో నాయకులు మాదల కోటేశ్వరరావు, చెన్నారావు పాలెంలో షేక్ అబ్దుల్లా, జమ్మవరంలో బురుగు బాలస్వాములు రైతుసంఘం పతాకాలను ఆవిష్కరించారు. రైతు సంఘం నియోజకవర్గ నాయకులు వట్టికొండ చంద్రమోహన్, కుసుమరాజు ప్రకాశరావు, అల్లూరు దుర్గయ్య, జి కోటేశ్వరరావు, మాహబూబ్‌సభాని, గుల్ మహమ్మద్, పిన్న వెంకయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి మంత్రం జపిస్తూ రైతులు, గ్రామీణ పేదలు జీవితాలను దుర్భరం చేస్తున్నాయని అవనిగడ్డ నియోజకవర్గ నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జి విమర్శించారు. రైతాంగ కోర్కెల దినోత్సవం సందర్భంగా వక్కలగడ్డలో రైతుసంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత రైతు నాయకులు అట్లూరి వెంకటేశ్వరరావు జెండాను ఆవిష్కరించగా సీపీఐ దివి ఏరియా ఇన్‌చార్జ్ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, సీపీఐ నాయకులు రావి బాబురావు, లెనిన్, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విస్సన్నపేట : గంపలగూడెం మండలం ఊటుకూరులో సంఘ కార్యాలయం ముందు రైతుసంఘం పతాకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి రైతుసంఘం తిరువూరు నియోజకవర్గ అధ్యక్షులు వైకుంఠరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గంపలగూడెం సీపీఐ నాయకులు ఎస్.కె. నాగుల్ మీరా, సిద్దే కృష్ణ, సీహెచ్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గంపలగూడెం : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని తిరువూరు నియోజిక వర్గరైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.వనమాలి ప్రభుత్వాన్ని కోరారు. సంఘ పతాకాన్ని వనమాలి ఆవిష్కరించారు. గంపలగూడెం మండల సీపీఐ కార్యదర్శి షేక్ నాగులు మీరా, సిద్ధి వైకుంఠరావు, కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని చిన్న చూపు చూస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం గన్నవరం నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వెంకటరత్నం అన్నారు. అమరజీవి కామ్రేడ్ చింతపల్లి పాపారావు స్మారక భవనంలో రైతుసంఘ 'రైతాంగ కోర్కెల దినోత్సవం' సందర్భంగా రైతుసంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘంనాయకులు పెద్దు వాసుదేవరావు, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, కటెవరపు విజయరావు, పర్సా వెంకటేశ్వరరావు, తిరివీధి సుబ్బారావు, బండారు లక్ష్మయ్య, పాండురంగారావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పడమటనరేష్, గండికోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దావాజీగూడెం : మండలంలోని బుద్ధవరం పంచాయతీ పరిధిలో ఉన్న దావాజీగూడెంలో రైతాంగ కోర్కెల దినోత్సవాన్ని నిర్వహించారు. అమరజీవి కామ్రేడ్ గొంది వెంకటేశ్వరరావు భవనంలో గొంది శివకోటేశ్వరరావు రైతుసంఘం జెండాను ఆవిష్కరించారు. జిల్లా రైతుసంఘం నాయకుడు ముక్కామల ఉమా మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా అధ్యక్షులు కొండా వీరాస్వామి మండల రైతు సంఘం నాయకుడు పెద్దువాసుదేవరావు, పెద్దు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా - పలమనేరు : సముద్రపల్లి పంచాయతీ పరిధిలో వున్న నూనెవారిపల్లి గ్రామంలో పలమనేరు నియోజకవర్గ సమితి ప్రధాన కార్యదర్శి ఉమాపతి నాయుడు, అధ్యక్షులు రవీంద్రారెడ్డిలు రైతుసంఘ పతాకాలను ఆవిష్కరించారు. ప్రభుత్వం ఈ-పాసు బుక్కువిధానం రెవెన్యూ రికార్డుల ఆన్‌లైన్ పేరుతో రైతుల భూహక్కుకు విఘాతం కల్పిస్తున్నదన్నారు. రాష్ట్రంలో రైతులకు నకిలీ విత్తనాలు పురుగు మందులపై ప్రభుత్వం నియంత్రణ కొరవడిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయ్‌కుమార్, చెంగన్న గౌడు, మురళీ, జానకీరామ్, రెడ్డెప్పరెడ్డి, గోవిందప్ప, వాసుదేవరెడ్డి, సుబ్రమణ్యం గౌడు, బాస్కర్ గౌడు, రాజేంద్ర నాయుడు రైతులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో సంఘ ప్రధాన కార్యదర్శి పి. భాస్కరరెడ్డి పతాకావిష్కరణ గావించారు. తొండంనాడు, ఎగువవీధి, బొక్కశంపాలెం, భగత్‌సింగ్ కాలనీ, అబ్బాబట్లపల్లి, రామాపురం, వెదం. ఎ, రెడ్డిపల్లి, మద్దిలేడు, పెనుబాక, మడ్డిబాక, యం.డి. పుత్తూరు, ఒర్వకాల్వ, కందాడ, తొట్టంబేడు, చివుటూరు, మొలకలచెరువు, మదనపల్లి, ముసలిపేడు తదితర గ్రామాలలో రైతుసంఘ పతాకవిష్కరణలు గావించారు.

శ్రీకాకుళం జిల్లా - పాలకొండ : సెప్టెంబర్ 1వ తేదీన కొండాపురం, విపిరావుపేట గ్రామాల్లో రైతు సంఘం జెండాలను ఆవిష్కరించారు. రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి మంత్రాలు జపిస్తూ రైతులు, గ్రామీణ పేదలు, అసంఘటిత కార్మిక రంగాల వారి జీవితాలను దర్భరం చేస్తున్నారన్నారు. రైతు సమస్యలపై చిత్తశుద్ధి పాలకులకు లేదని, కౌలు రైతులను పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. ఈ పరిస్థితుల్లో రైతు సంఘం ప్రజల మధ్యకు వెళ్ళి పాలకులు అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు తెలియజేయడానికే ఈ కోర్కెల దినం పాటించడం జరుగుతుందన్నారు. డా॥ స్వామినాధన్ సిఫార్సులు అమలుచేయాలని, 60 ఏళ్ళు నిండిన రైతుకు రూ. 10 వేలు పెన్షను ఇవ్వాలని, తోటపల్లి ఆధునీకరణ పనులు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రంపై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కిమిడి రామినాయుడు, ద్వారపూడి అప్పల నాయుడు, యందవ సూరిబాబుతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. టెక్కలిపట్నం, గోపివల్లభాపురం, మొదుగులపత్తి గ్రామం, శ్రీరంగాపురం, రావివలస, గూడెం, లంకం, మామిడివలస, కొండాపురం, వి.పి. రాజ్‌పేట, చంద్రాయవలస, అక్కరాజుపేట, వెంకటరాయిని వలస, జంపరకోట, గుడివాడ, చిన్నకోటపల్లి, యల్.యల్. పురం, ఓని, లుంబూరు, తెలగావీధి, ఆర్. ఆముదాలవలస, పుర్లి తదితర గ్రామాలలో జెండావిష్కరణలు గావించడం జరిగింది.

విశాఖపట్నం జిల్లా - పాయకరావుపేట : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపు మేరకు మండలంలోని సత్యవరం గ్రామంలో రైతాంగ కోర్కెల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి రైతుసంఘం పతావిష్కరణ, సంతకాల సేకరణ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు రామచంద్రరావు మాట్లాడుతూ 60 సంవత్సరాలు నిండిన రైతులకు, కౌలు రైతులకు, గ్రామీణ పేదలందరికి నెలకు 10 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జున్‌రావు, గోళ్ళ వెంకటేశ్వరరావు, వై. రాజుబాబు, గట్టెం తమ్మయ్యరాజు, గోళ్ళ నాగు, బోయిడి సన్యాసిరావు, నాగం రాజుబాబు, బోయిడి బుల్లబ్బాయి పాల్గొన్నారు.

రావికమతం : రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు గోలకొండ నూకినాయుడు అన్నారు. మండలంలోని పి.పొన్నవోలు గ్రామంలో జెండా ఆవిష్కరణ చేసారు. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల తహశీల్దారుకు వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం చోడవరం నియోజకవర్గ నాయకులు అచ్యుతరావు, అప్పారావులతోపాటు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన క్యాదర్శి శివలంక కొండలరావు, మండల కార్యదర్శి జి. జోగిరాజు, శ్రీరామమూర్తి, మహిళలు పాల్గొన్నారు.

కె.కోటపాడు మండలంలో మర్రివలస, దాలివలస, పాతవలస, సూదివలస, కె.కోటపాడు, కింతాడ, మేడిచర్ల గ్రామాల్లో రైతు సంఘం జెండాలు రెపరెపలాడాయి. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి వేచలపు వెంకటరమణ (కాసుబాబు), జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి అప్పల నాయుడు, మండల కార్యదర్శి వర్రిచిన రమణ, జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి గొర్లె దేముడు, మండల కల్లు గీత కార్మికుల సంఘం కార్యదర్శి దమ్ము ముత్యాల నాయుడు, మర్రివలస కార్యదర్శి సీముసురు సూర్యనారాయణ, సీముసురు గురువునాయుడు, చుక్కా సన్యాసిరావు, కన్నూరి అప్పారావు, కళ్యాణం తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లా - చిల్లకూరు : రెట్టపల్లి గ్రామంలో రైతు సంఘం నాయకులు చెన్నూరు రఘురామయ్య రైతుసంఘం పతాకాన్ని ఎగురవేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో రైతులు,గ్రామీణ పేదల నుండి బలవంతంగా భూములను సేకరిస్తూ పరిహారం నామ మాత్రంగా చెల్లిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సీతాభాస్కర్, ఓడూరు కోటయ్య, గుండాల రమేష్ పాల్గొన్నారు.

సూళ్ళూరుపేట : ఏపీ రైతుసంఘం డిమాండ్స్ డే ను ఘనంగా నిర్వహించారు. సంఘ కార్యాలయం ఎదుట జెండాను రైతుసంఘం



నాయకులు ఆబోతుల బాలయ్య ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మోదుగుల పార్థసారధి మాట్లాడుతూ రైతులకు సకాలంలో తెలుగుగంగ కాలువల ద్వారా సాగునీరు సరఫరా చేయాలన్నారు. ప్రతి ఎకరా ఎండిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేని తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి ఓగూరు కృష్ణ, సహాయ కార్యదర్శి ఆనంద్‌బాబు, నాయకులు ఇలపా నాగేంద్ర బాబు, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు : రైతుసంఘం నాయకులు బి. రమణయ్య కోర్టుసెంటరు సమీపంలో రైతుసంఘం పతాకావిష్కరణ చేసారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్. ప్రభాకర్, రైతులు సివిఆర్. కుమార్, బి. సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తూర్పు గోదావరి జిల్లా - కాకినాడ : గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో ఘనంగా రైతంగ కోర్కెలదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు యాళ్ళ అయ్యన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు గురించి పట్టించుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమానికి ముందు గొల్లప్రోలు మండలం అధ్యక్షుడు పిల్లా అప్పారావు, రైతుసంఘం జెండాను ఆవిష్కరించారు. పిల్లా గోవిందు, నాన్నాజి, పెద్ద, ఎ. నాగేశ్వరరావు, జగ్గారావు, అప్పారావు, చిన్న, కె. జగన్, సత్యనారాయణ, టి. శ్రీను,పి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. కేశవదాసుపాలెం, కేశవదాసుపాలెం రూరల్, అంతర్వేది కర, అంతర్వేది కర రూరల్, అంతర్వేది దేవస్థానం, గొంది, శృంగవరపు పాడు, లక్కవరం, దిండి, కడలి, ముమ్మిడివరం, ముమ్మిడివరం రూరల్, అమలాపురం, అమలాపురం రూరల్, అంబాజిపేట, గన్నవరం, కాకినాడ, కాకినాడ టౌన్, శంకవరం, సామర్లకోట, పెద్దాపురం తదితర గ్రామాలలో రైతుసంఘ జెండాలు ఆవిష్కరించడం జరిగింది.

పశ్చిమ గోదావరి జిల్లా : యలమంచిలి, లక్ష్మిపాలం, లక్షిపాలెం రూరల్, కోడూరు, ఆచంత, యల్.వి. చర్ల, వల్లూరు, కాంబొట్ల పాలెం, తిప్పరు తదితర గ్రామాలలో రైతుసంఘ జెండాలు ఆవిష్కరించడం జరిగింది. ✧

రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ

కర్నూలు : కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సిహెచ్ విజయమోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె జగన్నాథం, సహాయ కార్యదర్శి మద్దిలేటిలు మాట్లాడుతూ కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదని, సబ్సిడీలు వర్తింపచేయడం లేదని, పంటలు నష్టపోతే నష్టపరిహారం రావడం లేదన్నారు. దేవాదాయ, ధర్మాదాయ కౌలు రైతులవేలం పాటలు మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించాలన్నారు. ఈ-పాస్ పుస్తకాల విధానాన్ని రద్దుచేసి జిఓ నెం. 271 ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పుల్లన్న, డిహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బి.జి. మాదన్న విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైతుల సంతకాలు సేకరించి 12 డిమాండ్లతో కూడిన వినతిపత్రంతో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షులు జబ్బార్ అధ్యక్షతన జరిగింది. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బీజి మాదన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు రామ చంద్రలు మాట్లాడుతూ డా॥ స్వామినందన్ కమీషన్ సిఫార్సులు ప్రకారం రైతులకు పండిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని 60 సంవత్సరాలు నిండిన రైతులకు 10 వేలు రూపాయలు పెన్షన్ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలని తదితర డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌చార్జీ తహశీల్దార్ లక్ష్మన్‌దాసుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యన్న, (ఎఐటియుసి) అధ్యక్ష కార్యదర్శులు రాముడు, ఏసేపు, బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి సోమేశ్వరరెడ్డి, మల్లికార్జునగౌడ్, తిమ్మప్ప, చాంద్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎపి రైతుసంఘంజిల్లా సహాయ కార్యదర్శి తోళ్ళ మద్దిలేటి డిమాండ్ చేశారు. పర్లగ్రామంలో రైతుల సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మద్దిలేటి మాట్లాడుతూ జిల్లాలో ఉల్లి, టమోటా పంటలకు గిట్టుబాటు ధరలు లేకరైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పర్లగ్రామ సర్పంచ్ శేఖర్, మాజీ జడ్పీటీసీ సుంకన్న, రైతుసంఘం నాయకులు జమ్మన్న, మేకల శేషన్న, రామగిడ్డయ్య పాల్గొన్నారు.

పత్తికొండ : రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతుసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. రైతు సంఘం జిల్లాసహాయ కార్యదర్శి రాజాసాహెబ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుదాస్, మండల కార్యదర్శి కారన్న, నెట్టె కంటెయ్య, పులికొండ, తిమ్మయ్య, శివలింగడులు వినతిపత్రం అందచేసిన వారిలో ఉన్నారు.

మంత్రాలయం : గురురాఘవేంద్ర,పులికనుమ ప్రాజెక్టులను వెంటనే చేపట్టాలని భాస్కర్‌యాదవ్ అన్నారు. తహశీల్దార్ చంద్రశేఖరవర్మ, వ్యవసాయ అధికారి శివశంకర్‌కు వినతిపత్రం అందచేసి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి డిఎన్ ఎల్లప్ప, వీరేష్, వెంకటేష్, గౌషియా బేగం హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎపి రైతుసంఘం అధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ మండలంలో 45 వేల ఎకరాలకు ఇవ్వాల్సి వుండగా, ఇంతవరకు ఒక ఎకరాకూ నీళ్ళు ఇవ్వలేదని, పైగా ఆలూరు ప్రాంతానికి హంద్రీ-నీవా నీటిని తీసుకెళ్తానని సి.యం. ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమానికి రైతుసంఘం జిల్లా కార్యవర్గసభ్యులు శాంతికుమార్ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇబ్రహీం, కండప్ప, రాజశేఖర్, మాదన్న, నర్సయ్య, ఆంజనేయ, బజారప్ప, విద్యార్థి, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆస్పరి : ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని ఎ.పి. రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు వందలాది మంది రైతులతో ధర్నా నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి అధ్యక్షత వహించారు. ఎపి రైతుసంఘం తాలూకా అధ్యక్షులు నాగేంద్రయ్య, మల్లారెడ్డి, దుబ్బరాముడు, బ్రహ్మయ్య, సిపిఐ నాయకులు సత్యన్న, అంజనేయ, శివన్న, కృష్ణ, నర్సప్ప, మాజీ మండల ఉపాధ్యక్షులు వీరన్న, డిహెచ్‌పిఎస్ తాలూకా కన్వీనర్ దుబ్బరంగన్న, ఎఐవైఎఫ్ నాయకులు రవి, బాలు, హనుమంతు, రాజశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం : రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు పంపన్నగౌడ్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురురాఘవేంద్ర ప్రాజెక్టు ద్వారా పులిచింత రిజర్వాయర్ క్రింద ఉన్న ఆయకట్టు రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలని తెలిపారు. అనంతరం తహశీల్దార్ ఉస్సేన్ సాహెబ్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు చంద్రగౌడ్, ప్రభాకర్, జలాల్, చంద్రగౌడ్, అయ్యన్న, భీమన్న, బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు : రైతులను ఆదుకోవాలని రైతుసంఘ నాయకులు, సిపిఐ మండల కార్యదర్శి మునిస్వామి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంను ముట్టడించారు. అనంతరం రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు సమర్పించారు. కార్యక్రమంలో హెూతూరప్ప, వన్నూరుస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లా - త్రిపురాంతకం : తాము అధికారంలోకి వస్తే రుణమాఫీ చేయడమేకాకుండా పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రైతువ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ విమర్శించారు.



ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు కోర్కెల దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా రైతుసంఘం అధ్యక్షులు డి. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కె.వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం కరవు కాటకాలతో సతమతమవుతున్న పశ్చిమ ప్రాంతానికి వరప్రసాదమైన పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నదని, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే ఆందోళన, పోరాటాల ద్వారాను సాధ్యమన్నారు. సంఘ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య, మండల సీపీఐ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు యోగయ్య, ఆంజనేయులు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పై సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దారు నిమ్మరాజు వెంకటేశ్వర్లుకు అందజేశారు.

పొన్నలూరు : రాష్ట్రంలో జామాయిల్, సుబాబుల్, పొగాకు రైతులకు తీవ్రస్థాయిలో అన్యాయం జరిగిందని రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.వీరారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వారోత్సవాలలో భాగంగా పొన్నలూరు మండలంలోని చౌటపాలెం, సింగరబొట్లపాలెం, పొన్నలూరు బస్టాండ్ సెంటర్లలో రైతుసంఘ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైతుసంఘ రాష్ట్ర సమితి సభ్యులు కె.వీరారెడ్డి, కొండపి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బెల్లం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. జామాయిల్, సుబాబుల్, పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐమండల నాయకులు డి. మాలకొండరాయుడు, నర్సింగరావు, రామలింగారెడ్డి, వి.శేషారెడ్డి, డి.రంగనాయకులు పాల్గొన్నారు.

అద్దంకి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతుసంఘం నాయకులు మానం వెంకటనారాయణ డిమాండ్ చేశారు. రైతుసంఘం ఆధ్వర్యంలో రైతుసంఘం నాయకులు రైతాంగ సమస్యల పరిష్కారం కోసం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ అశోకవర్ధన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అద్దంకి నియోజకవర్గ కార్యదర్శి యడ్లపల్లి శింగయ్య, గౌరవ అధ్యక్షులు గొల్లపూడి వెంకటేశ్వర్లు, పొదిలి శ్రీను, ఆరుమళ్ళ అంజయ్య, షేక్ ఫరీన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపు మేరకు కంభం మండల రైతు సమస్యలపై కంభం తహశీల్దారు కార్యాలయం ఎదుట రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహశీల్దారుకు వినతిపత్రం అందించారు. 60 సంవత్సరాలు నిండిన రైతులకు, కౌలు రైతులకు పెన్షన్ రూ. 10 వేలు ఇవ్వాలని, డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు రైతాంగ ఉత్పత్తులకు మద్దతు ధరలు నిర్ణయించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజక వర్గ రైతు సంఘం అధ్యక్షులు అంకయ్య,ఏఐటీయూసీ జిల్లాకార్యదర్శి షేక్‌మహ్మద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహశీల్దారుకు వినతిపత్రం సమర్పించారు.

బేస్తవారిపేట : రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ రైతుసంఘం గిద్దలూరు నియోజకవర్గ కార్యదర్శి ధాకాల పుల్లయ్య ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ ఎం. రాజ్‌కుమార్‌కు

వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం గిద్దలూరు నియోజకవర్గ గౌరవాధ్యక్షులు ఆవుల ఈశ్వర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి ఎస్ఎం బాషా, మండల కార్యదర్శి శ్రీనివాసుల రెడ్డి, వెంకటరెడ్డి, పల్నాటి పెద్దరంగారెడ్డి, బైరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పామూరు : రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కనిగిరి నియోజకవర్గ నాయకులు పేరం రఘునాథరెడ్డి అన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దారు సీతారామయ్యకు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మిరెడ్డి, ఎన్ నాయబ్ రసూల్, ఎస్‌డి మౌలాలి, బి సుబ్బారావు, వై ప్రసాద్ ఇతరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కరించకుండా కాలం గడుపుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరాచారి, రైతుసంఘం నాయకులు డి తిరుపతి రెడ్డి, తహశీల్దారు కె.వి.వి. ప్రసాద్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకుడు ఎం గోవిందరెడ్డి, రాజయ్య, ముర్తుజావలి, లక్ష్మీదేవి, కాశింపీరా ఇతరులు పాల్గొన్నారు.


గుంటూరు జిల్లా పెదకాకాని : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో రైతులవద్ద సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా రైతు సంఘం నాయకులు కొల్లిరంగారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. రైతుల సంతకాల సేకరణ చేసి 12 డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహశీల్దార్‌కు అందజేస్తామన్నారు. విఠల్‌రెడ్డి, హనిమిరెడ్డి, తోకల వేమారావు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా - కంకిపాడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి మంత్రం జపిస్తూ, రైతులు, గ్రామీణ పేదలు, అసంఘటిత రంగ కార్మికుల జీవితాలు దుర్భరం చేస్తున్నాయని ఏపీ రైతు సంఘం పెనమలూరు నియోజకవర్గ అధ్యక్షులు జంపాన వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక తహశీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంక్ రుణాలు అందజేయాలని, సర్వే నంబరు ప్రాతిపదికన పంటల బీమా వర్తింపజేయాలని, మత విద్వేషాలను రెచ్చగొట్టే కౌలు రైతుల హక్కులను హరించే దేవాదాయ శాఖ జీవో 471 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మేరుగు విజయకుమార్, నాయకులు దమ్ము సత్యనారాయణ, బండి ప్రేమ్‌కుమార్, మున్నంగి నరసింహరావు, మర్రి ముత్యాలు, వీరాబత్తిన బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి : ఏపీ రైతు సంఘం పిలుపుమేరకు రైతాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని 1 నుంచి 5వ తేదీ వరకు పతాకాలు ఆవిష్కరించి రైతు సంఘాల నేతలు చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మూడు మండలాల తహశీల్దార్లకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. 60 ఏళ్ళు నిండిన రైతులు, కౌలు రైతులు, గ్రామీణ పేదలకు నెలకు రూ. 10 వేల పెన్షన్ చెల్లించాలని, డా॥ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం రైతాంగ ఉత్పత్తులకు మద్దతు ధర నిర్ణయించాలని, వ్యవసాయ రంగానికి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలని తదితర 12 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్లకు సమర్పించారు. చల్లపల్లిలో హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జి, మేకా నరసింహారావు, పర్చూరి వెంకన్నబాబు, అట్లూరి వెంకటేశ్వరరావు, అడ్డాడ ప్రసాద్‌బాబు, సత్యంబాబు, మోపిదేవిలో మోపిదేవి వెంకటరావు, రావిప్రభుప్రసాద్, బండే రామకృష్ణ, ఘంటసాలలో గుత్తికొండరాము, సూరపనేని వెంకటేశ్వరరావు, కోడి రాధాకృష్ణ, కోదాటి నాగయ్య, ఘంటసాల ఆదిశేషు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి జిల్లా - కాకినాడ : అఖిల భారత కిసాన్ సభ పిలుపుమేరకు సెప్టెంబరు 1వతేదీ జిల్లా రైతుసంఘ అధ్యక్షులు యాళ్ళ అయ్యన్న ఆధ్వర్యంలో రైతుసంఘం నాయకులు జిల్లా కలెక్టర్‌ను, ఆర్డీఓను కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. ప్రధానంగా ఏలూరు రిజర్వాయర్ నుంచి పంటలకు నీరందక రైతులు తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని దీనిపై తక్షణం స్పందించి ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలిచ్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు కొమర్తి శ్రీనివాస్, కె.చినబాబు, పి. వెంకటేశ్వరరావు, కె. హరినాథ్, డి. వెంకటేశ్వరరావు, టి. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం : దేవాదాయ ధర్మాదాయశాఖ కౌలు రైతులు రేయంబవళ్ళు శ్రమించే రైతాంగం యావత్తు పాలకుల మాటల గారడీలో ప్రభుత్వాలపై నమ్మకంపోయి సాగును సాగించలేక నానా అవస్థలు పడుతున్నారని పలుడిమాండ్లను ముఖ్యమంత్రికి అందిం



చాలని కోరుతూ జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కెఎస్ బాబు ఆధ్వర్యంలో రైతు సమస్యలపై ఆర్డీకు వినతిపత్రం అంద జేశారు.

దేవరాపల్లి : రైతులు పండించే పంటలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు పెంచాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వేచలపు కాసుబాబు డిమాండ్ చేశారు. దేవరాపల్లి మండలంలో గ్రామాలలో రైతులు, రైతుసంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. చెరకు పంట ఒక టన్నుకు రూ.3000 చేయలన్నారు. వరి మద్దతు ధరను రూ.2 వేలుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించాలని, ఆ మొత్తానికి రూ.500 కలిపి రాష్ట్ర ప్రభుత్వం రైతుకు ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తహశీల్దార్ వైయస్. నాగరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వేమల కన్నబాబు, సీపీఐ మహిళా అధ్యక్షురాలు లెక్కలలక్ష్మి, రావాడ సింహాద్రి, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

విశాఖపట్నం జిల్లా : రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్డీఓ కె.సూర్యారావుకు రైతుసంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మేకా సత్యనారాయణ మాట్లాడుతూ సోమనాధన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా రైతాంగానికి హక్కులు కల్పించాలని అన్నారు. అటవీ భూములు సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలివ్వాలని, రైతాంగానికి రావాల్సిన రాయితీలు కల్పించాలని, 60 ఏళ్ళు పైబడిన వారికి రూ. 10 వేలు పెన్షన్ ఇవ్వాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్లను ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు గోలుగొండ నూకినాయుడు, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పి.గంగా భవాని, నియోజకవర్గ కమిటీ చైర్మెన్ మాకిరెడ్డి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

కే.కోటపాడు : రైతులు వ్యవసాయంపట్ల ఆసక్తి కనబర్చ లేకపోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం విశాఖ జిల్లా సహాయ కార్యదర్శి వేచలపు కాసుబాబు ఆవేదన వ్యక్తంచేశారు. రైతుల సంతకాలు సేకరించిన వినతి పత్రాలను డిప్యూటి తాశీల్దార్ ఎం. పాలు కిరన్‌కు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డి అప్పల నాయుడు, ప్రజానాట్యమండలి నాయుకులు గొర్లె దేముడు, బాబు సీమునురు సూర్యనారాయణ చుక్కా సన్యాసిరావు, మహిళా సంఘం మండల కార్యదర్శి లెక్కల లక్ష్మి, వబ్రి చినరమణ, కె అప్పారావు తదితరులున్నారు.

చిత్తూరు జిల్లా - తిరుపతి : రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలను శ్రీకాళహస్తి తహశిల్దార్‌కు



సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పి. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వరి మద్దతు ధరను క్వింటాల్‌కు 2000 రూపాయలు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించాలని లేక రాష్ట్ర ప్రభుత్వం 500 రూపాయలు బోనస్ ఇవ్వాలని కోరారు. 1(బి) రికార్డులలో ఉన్న తప్పులను పూర్తి స్థాయిలో సరిదిద్దాలని, రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీ-సర్వే చేపట్టాలని, తదితర డిమాండ్లు పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘ నాయకులు వెంకటకృష్ణ, మణి, చెంచయ్య, కాళయ్య, మునింద్ర తదితరులు పాల్గొన్నారు.


పలమనేరు : రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దారు శ్రీనివాసన్‌కు అందించారు. నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ నిర్మాణాలు పూర్తిచేసి రైతులకు నీరు అందించాలని, 60 సంవత్సరాలు నిండిన రైతులు, కౌలు రైతులకు గ్రామీణ పేదలందరికీ నెలకు 10వేలు పెన్షన్ కల్పించాలని, డా॥ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం రైతాంగ ఉత్పత్తులకు మద్దతు ధరలు నిర్ణయించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గ అధ్యక్షులు రవీంద్రరెడ్డి, ఉమాపతి, డివి మునిరత్నం, సుబ్రమణ్యంరెడ్డి, వాసుదేవరెడ్డి, రాజేంద్రనాయుడు, ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ✧

రైతుల పంటలకు బీమా పథకం వర్తింపజేయాలి

నంద్యాల డివిజన్ పరిధిలోని దెబ్బతిన్న పంటలకు భీమా పథకం వర్తింపజేయాలని ఎపి రైతుసంఘం (ఎఐకెఎస్) నంద్యాల డివిజన్ కార్యదర్శి ఎ.సుబ్బరాయుడు, సంఘ నాయకులు సుబ్బయ్య, ఓబులేసులు కోరారు. గోస్పాడు మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులు వేలకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టడం జరిగిందని, కౌలు రైతులు పెట్టుబడితో పాటు పొలం యజమానికి గుత్తను చెల్లించాల్సి ఉంటుందని, నష్టాల బారినపడిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ పాల డెయిరీల దోపిడీ అరికట్టాలి!

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ డిమాండ్



రాష్ట్రంలో పాడి రైతులను ప్రైవేట్ పాల డైరీలు నిలువు దోపిడీ చేస్తున్నాయని ప్రభుత్వం వెంటనే వాటిని అరికట్టాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ డిమాండ్ చేశారు. తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో చిత్తూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు అధ్యక్షులుగా ఉమాపతి నాయుడు వ్యవహరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించి రైతాంగాన్ని ఆదుకునేందుకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని, పాడి పరిశ్రమ, కోళ్ళ పరిశ్రమ, ఆక్వా కల్చర్ లాంటి పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు. పడమటి మండలాల్లో దెబ్బతిన్న వేరుశనగ పంటను కాపాడటానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన వేల కోట్ల రూపాయలతో చేపట్టిన రెయిన్ గన్ కార్యక్రమం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చెప్పిన మాట ప్రకారం టమోటా, ఉల్లిని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. రాయలసీమ జిల్లాల ప్రధాన పంటైన వేరుశనగవర్షాలు లేక దెబ్బతిన్నదని రాయలసీమ ప్రాంతంలోని జిల్లాలను కరవు జిల్లాలుగా గుర్తించి నష్టపరిహారం చెల్లించాలని, పెండింగ్‌లో వున్న ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తూర్పు మండలాల రైతులకు నీటి సరపర అందించే తెలుగు గంగ కాలువ దెబ్బతినడంతో పంటలు ఎండిపోయాయని వెంటనే కాలువ మరమ్మతులు సాగించి రైతులను ఆదుకోవాలని కోరారు. టమోటాకు ప్రత్యామ్నాయ పంటను శాస్త్రవేత్తలు కనుగొని రైతులను కాపాడాలన్నారు. జిల్లాలో జ్యూస్ ప్యాక్టరీలను ఏర్పాటు చేయాలన్నారు. 60 సం॥రాలు నిండిన రైతులకు, కౌలు రైతులకు గ్రామీణ పేదలందరికీ నెలకు 10 వేలు పెన్షన్ ఇవ్వాలి. స్వామినాథన్ సిఫార్సులు ప్రకారం రైతాంగ ఉత్పత్తులకు మద్దతు ధరను నిర్ణయించాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు యం. రాంమోహన్, అంజినప్ప, ఉమాపతి నాయుడు, మోహన్, వెంకటరమణ, సుధాకర్ నాయుడు, శ్రీరాములు, జనార్ధన్‌రెడ్డి, వెంకటకృష్ణ, సురేంద్రరెడ్డి, నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ✧

ఉల్లి, టమోటా పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి!

ఉల్లి, టమోటా పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కర్నూలు జిల్లా పత్తికొండలో సిపిఐ, రైతుసంఘం ఆధ్వర్యంలో నాలుగు స్తంభాల కూడలివద్ద ఆందోళన చేపట్టారు. మొదట చదువుల రామయ్యభవన్ నుండి నాలుగు స్తంభాల వరకు రైతులతో ర్యాలీ నిర్వహించి ఉల్లి, టామోటాగంపలతో దాదాపు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు, సిపిఐ నాయకులతో పోలీసులు వాగ్వివాదంకు దిగారు. నాయకులను పోలీసులు అరెస్టు చేస్తామని హెచ్చరించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు వచ్చేంత వరకు రాస్తారోకో కొనసాగుతుందని నాయకులు పోలీసులతో తేల్చిచెప్పారు. ఈ రాస్తారోకో కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి కారన్న అధ్యక్షత వహించారు. రాస్తారోకో నుద్దేశించి ఏపి వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆవుల శేఖర్, సిపిఐ పత్తికొండ నియోజకవర్గం ఇన్‌చార్జి నబీరసూల్‌లు మాట్లాడుతూ ఉల్లి, టామోటా పంటలకు గిట్టుబాటు ధరల లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పెట్టిన పెట్టుబడులు రాక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉల్లి పంటను క్వింటా రెండువేల రూపాయలు, టమోటా కిలో 20 రూ గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే ఉల్లి కొనుగోలు చేయాలని డిమాండు చేశారు. అనంతరం డిప్యూటి తహశీల్దార్ నాగభూషణం రాస్తారోకో వద్దకు వచ్చి రైతులకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు పోతామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, రైతుసంఘం నాయకులు గురుదాస్, మద్దిలేటిశెట్టి, క్రిష్ణయ్య, రామకృష్ణారెడ్డి, తిమ్మయ్య, పెద్ద ఈరన్న, సుధాకర్, సుల్తాన్, వెంకటేశ్వర్లు, హనుమప్ప, కారుమంచి, నెట్టెకంటెయ్య, ఖాజా హుసేన్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు. ✧

ఘనంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య 156వ జయంత్యుత్సవాలు



ప్రపంచ ప్రఖ్యాత ఇంజనీర్, భారతరత్న, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిరెడ్డి హనుమంతారెడ్డి పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలోని బెస్తవారిపేట మండలంలోని మోక్షగుండం గ్రామంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య 156వ జయంతి ఉత్సవాలను ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక రచ్చబండ వద్ద మాజీ సర్పంచ్ తమ్మినేని పెద్దిరెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హనుమంతారెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి, పండితుడు, శాస్త్రవేత్తని, క్రమశిక్షణాపరుడని, సమయపాలన పాటించేవాడని తెలిపారు. ఆయన ఎన్నోపరిశ్రమలు, విశ్వ విద్యాలయాలు నిర్మించారన్నారు. భారత సామ్రాజ్యయోధుడు, భారతరత్న, డాక్టర్ ఆఫ్ సైన్స్, డాక్టర్ ఆఫ్ లా వంటి ఎన్నో బిరుదులు విశ్వేశ్వరయ్య స్వంతమన్నారు. ఇంజనీరింగ్ చదివిన వారే ఇంజ నీర్లు కాదని, సామాజిక సమస్యల పరిష్కారానికి వారి తెలివితేటలను ఉపయోగించిన వారు, సమాజానికి వారధులుగా ఉన్న వారు కూడా ఇంజనీర్లేనని ఉద్ఘాటించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ సమాజం మంచి దారిలో నడవాలంటే విశ్వేశ్వరయ్య బాటలో మంచి నడవడికతో ముందుకు సాగాలని, సమాజసేవ చేయాలని, అప్పుడే ఆయన ఆశయం నెరవేరినట్లు అవుతుందని పేర్కొన్నారు. స్థానిక అంజనేయ స్వామి గుడి వద్ద, హైవేరోడ్డు పక్కన వున్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూల మాలలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు డి. శ్రీనివాసులు, మాజీ సర్పంచ్, సిపిఐ గిద్దలూరు నియోజకవర్గ కార్యదర్శి ఆవుల ఈశ్వర్‌రెడ్డి, రిటైర్డ్ వెటర్నరీ డాక్టర్ పల్నాటి మహదేవరెడ్డి, ఎంపీటీసీ చిలకల కేశవరెడ్డి,ఆవుల కోటారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కేఎండీ ఇబ్రహీం, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఢాకాల పుల్లయ్య, ప్రధానోపాధ్యాయులు రఘునాథ్‌రెడ్డి, కో-ఆపరే టివ్ సొసైటీ అధ్యక్షులు బారెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, హోమియో వైద్యులు డాక్టర్ హరినాద్,భవన నిర్మాణ కార్మికులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ✧

రైతులకు పంట నష్ట పరిహారంతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి!



రైతులకు పంట నష్ట పరిహారంతో పాటు ఇన్‌పుట్ సబ్సీడీ ఇవ్వాలని రైతు సంఘ చిత్తూరు జిల్లా అధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య డిమాండ్ చేశారు. పీలేరు రెవెన్యూ కార్యాలయ ఆవరణలో రైతుసంఘం నేతృత్వంలో ధర్నా కార్యాక్రమం జరిగింది. ఈ ధర్నానుద్దేశించి వెంకయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హల్‌చల్ చేసిన రెయిన్‌గన్‌ల ప్రయోగంతో రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. రైతుల పంట నష్టాన్ని పరిహారంగా చెల్లించి ఇన్‌పుట్ సబ్సీడీని ఇచ్చి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రచార అస్త్రాలకే పరిమితం కాకుండా నేరుగా పొలాలను పరిశీలించి రైతులను ఆదుకునే దిశగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాయలసీమలో కరువు లేకుండా చేస్తామని చెప్పిన చంద్రబాబు అందుకనుగుణంగా ఏ చర్యలు చేపట్టారని ఆయన నిలదీశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమానికి పీలేరు శాసన సభ్యులు చింతల రామచంద్రారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త కంభం భాస్కర్ రెడ్డి తమ మద్దతును, సంఘీభావాన్ని ప్రకటించారు. ఈసందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ రైతుసంఘ జిల్లా అధ్యక్షులు వెంకయ్య అధ్యక్షతన రైతుసంఘ నాయకులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం పై వారి సమస్యల పరిష్కరానికి అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా నాయకుడు చిన్నయల్లప్ప, రైతుసంఘ మండల అధ్యక్షులు మోపిరెడ్డిరామ్మోహన్‌రెడ్డి, నరసారెడ్డి, గాయం భాస్కర్‌రెడ్డి,డాక్టర్ మల్లికార్జున, తిమ్మయ్య, దినకర్‌రెడ్డి, పురుషోత్తం, చంద్రయ్య, అన్నారెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, ఆనంద్, మండలంలోని రైతులు పాల్గొన్నారు. ✧


Printed and Published by Kolli Nageswara Rao on behalf of Andhra Pradesh Ryotu Sangham, Ryotu Bhavan, 210 Amrutha Estates, Himayatnagar, Hyderabad-29 and printed at Nagarjuna Enterprises, Visalaandhra Building, Chuttugunta, Vijayawada-4, Published at Andhra Pradesh Ryotu Sangham, Ryotu Bhavan, 210 Amrutha Estates, Himayatnagar, Hyderabad-29 Editor : Kolli Nageswara Rao.


BCI


చదవండి - చదివించండి - చందాదారులుగా చేరండి - చేర్పించండి!


రైతులకు కరదీపిక రైతులోకం































Ryotulokam
R.N.I. 15836/68

October 2016
Date of Printing Every Month 1st

Regd.No. VJ/119/2015-17
Date of Posting : 4 & 5th

No. of
Pages : 44

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA106M195
పుస్తకం పేరు	రైతులోకం
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	45
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Jayalakshmi
పేజీలు విడదీసినది	Jayalakshmi
స్కాన్ చేసినది	S.Lakshmi
పరీక్ష చేసినది	hema
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good